



Downloaded from Playstore - Today's Newspaper Telugu


# ఈనాడు

కరీంనగర్ 28-6-2019 శుక్రవారం సిటీ సంపుటి 45 సంచిక 319

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50, పేజీలు 16+16 www.eenadu.net

Karimnagar, Visakhapatnam, Hyderabad, Vijayawada, Tirupati, Ananthapuramu, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru, Mumbai, Delhi









శాసనసభ భవనానికి శంకుస్థాపన చేస్తున్న ముఖ్యమంత్రి

## తెలంగాణకు మకుటాయమానంలా నిర్మాణాలు

5లో

సచివాలయం, శాసనసభ భవనాలకు ఘనంగా శంకుస్థాపన



# స్నేహగీతిక



## తెలుగు రాష్ట్రాల సీఎంల కీలక భేటీ నేడే

ఈనాడు–హైదరాబాద్, అమరావతి

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌ల స్నేహ సంబంధాలను పటిష్ఠం చేయడంతో పాటు రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు వీలుగా ఇరువురు ముఖ్యమంత్రులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శుక్ర, శనివారాల్లో సమావేశం కానున్నారు. గోదావరి, కృష్ణా నదులకు సంబంధించిన ప్రధానాంశాలు సహా 5 కీలక అంశాలపై చర్చలు జరపనున్నారు. ఇప్పటికే పలు దఫాలు లాంఛనంగా ముఖ్యమంత్రుల భేటీలు జరిగాయి. గవర్నర్ సమక్షంలోనూ చర్చించారు. దీనికి అనుగుణంగా కార్యాచరణ చేపట్టేందుకు ఇరు రాష్ట్రాల సీఎంలు సన్నద్ధమయ్యారు. వారి మధ్య తొలి ఉన్నతస్థాయి సమావేశం శుక్రవారం ఉదయం 10.00 గంటలకు ప్రగతిభవన్‌లో మొదలవుతుంది. ముఖ్యంగా గోదావరి వరద జలాల తరలింపు, కృష్ణా, గోదావరి బేసిన్లలో నీటిని రెండు రాష్ట్రాలు సమగ్రంగా వినియోగించుకోవడం, విద్యుత్తు సంస్థల విభజన, తొమ్మిది, పదో షెడ్యూలు సంస్థల విభజన సహా పలు కీలకాంశాలపై ముఖ్యమంత్రులు చర్చించనున్నారు. దిల్లీలోని ఏపీ భవన్‌పై కూడా చర్చించే అవకాశం ఉంది. గోదావరి, కృష్ణా నదులకు సంబంధించిన ప్రధాన అంశాలపై ముఖ్యమంత్రులిద్దరూ చర్చించి ఓ అంగీకారానికి వచ్చే అవకాశం ఉన్నట్లు తెలిసింది. శుక్రవారం హైదరాబాద్‌లో జరిగే ఈ ఉన్నతస్థాయి సమావేశంలో రెండు రాష్ట్రాల మధ్య వివాదంగా ఉన్న పలు అంశాలను సామరస్యంగా పరిష్కరించుకోవడంతోపాటు, గోదావరి వరద నీటిని రెండు రాష్ట్రాల్లోని కరవు ప్రాంతాలకు వినియోగించుకోవడంపైన చర్చించే అవకాశం ఉంది.

### ఎవరెవరు హాజరవుతారు?

తెలంగాణ నుంచి ఏడుగురు, ఏపీ నుంచి ఐదుగురు మంత్రులు హాజరవుతారు. రెండు రాష్ట్రాల ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు ఎస్‌కే జోషి, ఎల్వీ సుబ్రహ్మణ్యం, నీటిపారుదల, ఆర్థిక, విద్యుత్, పౌరసరఫరాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, సాధారణ పరిపాలన శాఖల ముఖ్యకార్యదర్శులు, ఉన్నతాధికారులు పాల్గొంటారు. వీరితోపాటు రెండు ప్రభుత్వాల సలహాదారులు, నీటిపారుదల శాఖ, ఆర్థిక, ఇంధన శాఖల ముఖ్యకార్యదర్శులు, ఇంజినీర్ ఇన్ చీఫ్‌లు, పునర్విభజన చట్టం అమలుకు సంబంధించిన అధికారులు పాల్గొనే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

### మహామార్గం.. మళ్లీ తెరపైకి

విభజన చట్టంలో కేంద్రం ప్రతిపాదించిన హైదరాబాద్-అమరావతి ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మాణం అంశాన్ని కూడా ఈ చర్చల్లో చేర్చాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుతం నిర్ణయించింది. హైదరాబాద్-నాగార్జునసాగర్-పిడుగురాళ్ల మీదుగా అమరావతికి ఎక్స్‌ప్రెస్ రహదారి నిర్మించాలన్నది ప్రతిపాదన. సుమారు 272 కిలోమీటర్ల దూరం ఉంటుంది. ఇది పూర్తయితే హైదరాబాద్ నుంచి మూడు గంటల్లోపే అమరావతి చేరుకోవచ్చని అంచనా. దీని నిర్మాణానికి 9,000 - 10,000 కోట్ల వరకు వ్యయం అవుతుందని అప్పట్లో అంచనాలు వేశారు. దీనిపై సీఎంల భేటీలో చర్చించి నిర్ణయం తీసుకోవలసి ఉంది.

### చర్చలతోనే సమస్యలకు పరిష్కారం

"తెలుగు రాష్ట్రాలు స్నేహభావంతో మెలుగుతున్నాయి. దీంతో కొత్త వెలుగులు ప్రసరిస్తున్నాయి. గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు ఏపీ సీఎం జగన్ మోహన్‌రెడ్డితో కలిసి నడుంబిగించాం. జగన్ యువకుడు, ఏపీ అభివృద్ధిపై గొప్ప సంకల్పంతో ఉన్నారు. ఇరు రాష్ట్రాల మధ్య శుక్ర, శనివారాల్లో వివిధ అంశాలపై కీలక సమావేశాలు నిర్వహించనున్నాం. నదీ జలాల వినియోగంతో పాటు రాష్ట్ర విభజనకు సంబంధించిన అంశాలను చర్చిస్తాం. వాటి ద్వారా అనేక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది"

**- తెరాస విస్తృతస్థాయి సమావేశంలో కేసీఆర్**

### బోర్డులతో ప్రయోజనమేంటి?

ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం మేరకు ఏర్పాటైన కృష్ణా, గోదావరి బోర్డుల వల్ల ఎలాంటి ప్రయోజనం లేదని, వాటిని రద్దు చేయమని కేంద్రానికి సిఫార్సు చేయడంపైన, నీటి వినియోగం, మిగులు జలాల వాడకం తదితర అంశాలపై రెండు రాష్ట్రాలు ఓ అంగీకారానికి వచ్చి బ్రిజేష్‌కుమార్ ట్రైబ్యునల్‌కు ఇదే విషయాన్ని చెప్పడం తదితర అంశాల గురించి చర్చించనున్నట్లు తెలిసింది. అంతర్ రాష్ట్ర నదీ జలాల పంపిణీ ఎలా అన్నదానిపై చర్చించే అవకాశం ఉంది. బచావత్ ట్రైబ్యునల్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 811 టీఎంసీలు కేటాయించగా, ఇందులో ఆంధ్రప్రదేశ్ 512 టీఎంసీలు, తెలంగాణ 299 టీఎంసీలు వాడుకుంటోంది. ఇదే పద్ధతి కొనసాగించి మిగులు జలాలు, క్యారీ ఓవర్ స్టోరేజీ, పోలవరం

...మిగతా 2లో

### చర్చించే ప్రధానాంశాలేమిటి?

- గోదావరి, కృష్ణా జలాల సంపూర్ణ వినియోగం, నదీజలాలపై వివాదాల పరిష్కారం.
- గోదావరి జలాలు శ్రీశైలానికి తరలింపు ప్రతిపాదనపై ప్రధాన చర్చ.
- రెండు రాష్ట్రాల నీటి అవసరాలు, పంపిణీపై కేసీఆర్ దృశ్య రూప ప్రదర్శన.
- విద్యుత్ సంస్థల విభజన, ఉద్యోగుల సర్దుబాటు, విభజన సమయం నాటికి డిస్కంలకు బకాయిల చెల్లింపుల అంశం.
- పౌరసరఫరాల సంస్థ విభజన, లెవీ నిధుల వినియోగ విషయం.
- దిల్లీలోని ఏపీ భవన్ వ్యవహారం.
- తొమ్మిది, పదో షెడ్యూలు సంస్థల విభజన అంశం.

## దేశంలో ఎక్కడి నుంచైనా రేషన్!



- 'ఒకే దేశం.. ఒకే కార్డు' దిశగా కేంద్రం కసరత్తు
- సమీకృత ప్రజా పంపిణీ విధానానికి నిర్ణయం
- కేంద్ర ఆహార మంత్రి పాసవాన్ వెల్లడి

దిల్లీ: దేశంలో ఏ రేషన్ దుకాణం నుంచైనా సరకులు తీసుకునే వీలుంటే ఎలా ఉంటుంది? ఎంతోమందికి ప్రయోజనం చేకూర్చే ఈ విధానం అమలుకు కేంద్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. 'ఒకే దేశం.. ఒకే రేషన్ కార్డు..' లక్ష్యం దిశగా చర్యలు చేపడుతున్నట్లు కేంద్ర ఆహార శాఖ మంత్రి రామ్‌విలాస్ పాసవాన్ గురువారం వెల్లడించారు. దిల్లీలో ఆహారభద్రతపై సంబంధిత రాష్ట్రాల కార్యదర్శులు; భారత ఫుడ్ కార్పొరేషన్ (ఎఫ్‌సీఐ); కేంద్ర, రాష్ట్ర వేర్‌హౌసింగ్ కార్పొరేషన్‌ల (సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ)ల అధికారులతో మంత్రి సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ ఆహార భద్రత చట్టం సమర్థంగా అమలయ్యే దిశగా వివిధ అంశాలపై చర్చించారు. ప్రజా పంపిణీ విధానానికి సంబంధించి మొత్తం వ్యవస్థను

...మిగతా 2లో

# బడుగులకు ప్రాధాన్యం

- వారి కోసం ప్రత్యేక పథకాలు తెస్తాం
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల అభివృద్ధికి కృషి
- వచ్చే నెలలోనే పురపాలక ఎన్నికలు
- తెరాస సభ్యత్వం కోటి దాటాలి
- ప్రతీ ఇంట్లోనూ పార్టీ సభ్యుడుండాలి
- మీడియాలో చర్చలకు ఎవరూ వెళ్లొద్దు
- తెరాస విస్తృత సమావేశంలో కేసీఆర్
- తొలి సభ్యత్వం స్వీకరణ



పార్టీ సభ్యత్వం అందుకుంటున్న తెరాస అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్

ఈనాడు – హైదరాబాద్

రాష్ట్రంలో వచ్చే నెలలో పురపాలక సంఘాలు, నగర పాలక సంస్థలకు ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. అందుకోసం పార్టీ శ్రేణులు సన్నద్ధం కావాలని సూచించారు. గురువారం తెలంగాణభవన్‌లో జరిగిన తెరాస విస్తృత స్థాయి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన పురపాలక ఎన్నికలపై మాట్లాడారు. పురపాలక ఎన్నికలను వెంటనే పూర్తి చేస్తామని, ఎన్నికలన్నీ పూర్తయితే అభివృద్ధి మీద పూర్తిస్థాయిలో దృష్టి సారించవచ్చని పేర్కొన్నారు. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల మాదిరే అన్ని ఛైర్మన్ పదవులూ మనకే దక్కాలని.. మెజారిటీ వార్డులు, డివిజన్లు గెలవాలని అన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు పార్టీ చేరువ కావాలని ఆకాంక్షించారు. ఇందుకోసం పెద్దఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, కొత్త పథకాలను ప్రవేశపెడతామని ప్రకటించారు. తెలంగాణ సభ్యత్వ నమోదు వచ్చే నెల 20 వరకు నిర్వహిస్తామని, కోటిమందికి పైగా సభ్యత్వాలు నమోదు కావాలన్నారు. టీవీ మీడియాలో చర్చలకు ఇకపై తెరాస తరఫున ఎవరూ వెళ్లవద్దని, ఎవరైనా దీనిని ఉల్లంఘిస్తే వెంటనే సస్పెండ్ చేస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం నీళ్లు వచ్చే నెలలో పొలాలకు చేరతాయన్నారు. ఈ ప్రాజెక్టుతో పాటు మిషన్ భగీరథ పూర్తయిందని, ఇక పాలమూరు-రంగారెడ్డిపై దృష్టి సారిస్తామన్నారు.

### ఇబ్బందుల్లేవు

ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న, షాద్‌నగర్ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్‌లు మున్సిపల్ ఎన్నికల

...మిగతా 2లో

## ఆదివాసీల చెంతకే వైద్య పరీక్షలు!

**తొలిదశలోనే వ్యాధి నిర్ధారణ లక్ష్యంగా.. ఏజెన్సీల్లో సంచార ప్రయోగశాలలు**

ఈనాడు, హైదరాబాద్: వ్యాధిని తొలిదశలో గుర్తించకుంటే, తీరా అది ముదిరిన తర్వాత వ్యయప్రయాసలకు గురికావాల్సి వస్తుంది. ఈ దుర్భర పరిస్థితి నుంచి నిరుపేదలను తప్పించడానికి తెలంగాణ ప్రభుత్వం నడుం బిగించింది. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో..ఆరోగ్యంపై అవగాహన అంతంతమాత్రంగానే ఉండే ఆదివాసీలకు మేలు కలిగించడంపై చూపు సారించింది. వారికి తొలిదశలోనే వ్యాధి నిర్ధారణ జరిగేలా చూడటమే ధ్యేయంగా సర్కారు ముందుకు సాగనుంది. ఆదిలాబాద్‌తో పాటు ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నాగర్ కర్నూల్..ఇలా 10 జిల్లాల్లో సంచార ప్రయోగశాలలను అందుబాటులోకి తేవాలని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ నిర్ణయించింది. ఆరోగ్య కార్యకర్తలు నేరుగా గిరిజన గూడేలకే వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహిస్తారు.

### 6.52 లక్షల జనాభాకు లబ్ధి

ఉమ్మడి 10 జిల్లాల్లోనూ 75 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధుల్లో 1697 పల్లెలున్నాయి. కొత్తగా సంచార ప్రయోగశాలల వల్ల దాదాపు 6.52 లక్షలమంది లబ్ధి పొందగలరని వైద్యవర్గాలు అంచనా వేశాయి. ములుగు, భూపాలపల్లి, కొత్తగూడెం, ఆసిఫాబాద్, ఆదిలాబాద్ వంటి జిల్లాల్లో దీర్ఘకాలికంగా మూత్రపిండాల జబ్బుల బారినపడుతున్నవారి సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. నమోదవుతున్న మలేరియా కేసుల్లో 63 శాతం..గిరిజన జిల్లాల్లోనే ఉండటం ఆందోళన కలిగించేదే. దీనితో పాటు డెంగీ జ్వరాల కేసులు ఖమ్మం, ఇతర ప్రాంతాల్లో అత్యధికంగా నమోదవుతున్నాయి. దీనిపై సంబంధిత జిల్లాల కలెక్టర్లు, ఇతర సంబంధిత అధికారులతో మంత్రి ఈటల రాజేందర్ ఇటీవల సమీక్ష నిర్వహించారు. దీర్ఘకాలిక చర్యలనూ చేపట్టాలని నిశ్చయించి, సంచార ప్రయోగశాలల విధానాన్ని తెరపైకి తీసుకొచ్చారు. మారుమూల ప్రాంతాల్లో అత్యాధునిక వైద్య పరికరాలతో కూడిన వాహనాలను అందుబాటులోకి తెస్తారు. ఇందులో ఏకకాలంలోనే 200కి పైగా రక్తనమూనాలను పరీక్షించి ఫలితాలు తెలుసుకోవచ్చు. ఈ తరహా యంత్ర పరికరాలు ప్రస్తుతం నిమ్స్, గాంధీ ఆస్పత్రులతో పాటు ఐపీఎంలో నెలకొల్పిన కేంద్రంలో ఉన్నాయి. ఆయా జిల్లాల్లోని గ్రామాలకు కనీసం నెలకు ఒకసారి వెళ్లి పరీక్షలు జరుపుతారు. సంచార ప్రయోగశాలల ఏర్పాటుకు రూ.300 కోట్ల వరకు ఖర్చవుతుందని భావిస్తున్నారు. ఆ ల్యాబ్‌ల వెంట వైద్యుడు, నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మాసిస్టు ఉంటారు. బాధితులకు అవసరమైన ఔషధాలను అందజేస్తారు. వ్యాధి తీవ్రతను బట్టి అవసరమైతే సమీపంలోని పెద్దాస్పత్రికి తరలిస్తారు.



## ఎదురులేని భారత్

**వెస్టిండీస్‌పై ఘనవిజయం**

ప్రపంచకప్‌లో భారత జట్టు దూసుకుపోతోంది. కోహ్లీసేన ఐదో విజయంతో సెమీఫైనల్‌కు మరింత చేరువైంది. గురువారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో వెస్టిండీస్‌ను 125 పరుగుల తేడాతో చిత్తు చేసింది. కోహ్లి (72), ధోని (56), రాహుల్ (48), హార్దిక్ (46) రాణించడంతో 7 వికెట్లకు 268 పరుగులు చేసిన భారత్.. షమి (4/16), బుమ్రా (2/9) విజృంభణతో విండీస్‌ను 143 పరుగులకే కుప్పకూల్చింది.

– వివరాలు ఛాంపియన్స్‌లో

# అక్షరాభ్యాసానికి వెళ్తూ.. మృత్యు ఒడికి

- రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం
- మృతులంతా ఒకే కుటుంబానికి చెందిన వారు

ఈనాడు డిజిటల్, కామారెడ్డి: కుమారుడికి ఓనమాలు దిద్దించాలన్న తపన అమ్మది.. మనవడి అక్షరాభ్యాస వేడుకను కళ్లారా చూడాలని ముచ్చటపడిన అమ్మమ్మ.. ముద్దుల మేనల్లుడి చిట్టి చేతులతో అ.. ఆ..లు రాయించాలనే తృష్ణ మేనమామది. దైవ సన్నిధిలో పలకాబలపం పట్టి లోకాన్ని చదవాలని పయనమైన ముద్దుల బాబు.. వీరంతా మృత్యుఒడికి చేరుకొన్నారు.

కామారెడ్డి జిల్లా సదాశివనగర్ మండలం అడ్లూర్ఎల్లారెడ్డి ఫ్లైఓవర్‌బ్రిడ్జి వద్ద గురువారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మరణించారు. నల్గొండ, గుంటూరు జిల్లాలకు చెందిన నాగళ్ల రాకేష్-సునీత దంపతులు హైదరాబాద్ వనస్థలిపురం హైకోర్టు కాలనీలో నివాసం ఉంటున్నారు. వీరు తమ కుమారుడు అభిరామ్‌కు బాసరలో అక్షరాభ్యాసం చేయించేందుకు ఐదు మంది కారులో బయలుదేరారు. మార్గమధ్యలో కారు అదుపు తప్పి డివైడర్‌ను దాటి పక్కమార్గంలో వెళ్తున్న లారీని ఢీ కొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న రమాదేవి(50), సునీత(31), రఘురాం(33) అక్కడికక్కడే ప్రాణాలు విడిచారు. తీవ్రంగా గాయపడ్డ అభిరాం(3) హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచాడు. తీవ్ర గాయాలతో బయటపడ్డ రాకేష్‌ను ఆసుపత్రికి తరలించారు. కారు ఢీ కొనడంతో ఇంధన ట్యాంకు పేలి లారీ పూర్తిగా దగ్ధమైంది. వేగంగా వస్తున్న కారు డివైడర్‌ను రెండుసార్లు ఢీ కొట్టడంతో ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. కారు








మృతులు రమాదేవి, రఘురాం, సునీత, అభిరాం

ముందు సీట్లో కూర్చున్న సునీత రోడ్డుపై యాభై అడుగుల దూరంలో ఎగిరి పడ్డారు. వెనుక సీట్లో కూర్చున్న రమాదేవి తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. డ్రైవింగ్ చేస్తున్న రఘురాం తలకు తీవ్రగాయాలు కావడంతో ఘటనా స్థలంలోనే మరణించారు.

### చెట్టుపై పడిన అభిరాం

కారులో వెనుక సీట్లో తండ్రి రాకేష్-అమ్మమ్మ రమాదేవిల మధ్యలో కూర్చున అభిరాం ప్రమాద సమయంలో డివైడర్ పైన ఉన్న గన్నేరు చెట్టు మీద పడ్డాడు. దీంతో తల, చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. హైదరాబాద్ ఆసుపత్రిలో దాదాపు నాలుగు గంటల పాటు మృత్యువుతో పోరాడి కన్నుమూశాడు.

### అమ్మ కావాలంటూ..

సహాయక చర్యలు చేపట్టిన పోలీసులు అభిరాంను లాలించి అక్కున చేర్చుకొని ఆసుపత్రికి తరలించారు. అభిరాం అమ్మ కావాలంటూ ఆసుపత్రిలో రోదించడం పలువురిని కంట తడి పెట్టించింది. అమ్మ దగ్గరికి తీసుకెళ్తేనే మంచి నీళ్లు తాగుతానంటూ మారం చేశాడు. అమ్మమ్మను పిలవాలంటూ ఏడవడం కలిచివేసింది. కుటుంబ సభ్యులందరినీ పోగొట్టుకొన్న రాకేష్ తల్లడిల్లిపోతుంటే ఆయన్ను ఓదార్చడం ఎవరి తరం కాలేదు.

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

# బడుగులకు చేరువవుదాం

(మొదటి పేజీ తరువాయి)

గురించి మాట్లాడుతూ నాలుగు నెలల వ్యవధిలోనే మళ్లీ ఎన్నికలంటే ప్రజలు ఇబ్బందులు పడతారని అన్నట్లు తెలిసింది. దీనిపై సీఎం స్పందిస్తూ ఎన్నికలు ఎప్పుడు జరిపించాలో అన్నీ ఆలోచించే నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. ముందస్తు ఎన్నికలపై తలో మాట అన్నారని, అలా వెళ్లడం వల్ల మనం ఘన విజయం సాధించామని చెప్పారు. సార్వత్రిక ఎన్నికలతో కలిపి జరిగితే ఫలితాలు అలా వచ్చేవి కావని పేర్కొన్నట్లు తెలిసింది. ఎన్నికలకు అవసరమైన సన్నాహాల కోసం ఆర్డినెన్స్ జారీ చేస్తామన్నారు. రెండురోజుల్లోనే మంత్రి మండలి సమావేశం ఏర్పాటు చేసి, దాన్ని ఆమోదిస్తామని సీఎం చెప్పారు. 'ప్రజలు మనవెంటే ఉన్నారు.. ఏ ఎన్నికలైనా మనదే విజయం.. ఇదే స్ఫూర్తితో పనిచేయాలి' అని పార్టీ శ్రేణులకు చెప్పారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన వారికి గుర్తింపు, నియమిత పదవులను ఇస్తామని సీఎం వివరించారు.

### ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు దగ్గరవ్వాలి

ఎస్సీ, ఎస్టీ, బీసీలు, మైనారిటీలకు మన ప్రభుత్వానికి మధ్య కొంత దూరం ఉందని, ఈ లోటును భర్తీ చేయాలని కేసీఆర్ పేర్కొన్నారు. ప్రస్తుతం నడుస్తున్న పథకాలు, కార్యక్రమాలనుసమీక్షించాలని, కొత్తపథకాలను పెద్దఎత్తున చేపట్టాలని అన్నారు.

### సభ్యత్వ నమోదు..

ఎమ్మెల్యే పిలిస్తే వేలమంది తరలిరావాలని..





కేసీఆర్ సమక్షంలో పార్టీ సభ్యత్వం తీసుకుంటున్న హరీశ్‌రావు ★ పార్టీ సభ్యత్వం తీసుకుంటున్న తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్

## నాతో పాటు హరీశ్ కష్టపడి పార్టీని నిలబెట్టారు

తెరాస విస్తృత స్థాయి సమావేశానంతరం తెలంగాణభవన్‌లో మొదటి సభ్యత్వాన్ని కేసీఆర్ తీసుకున్నారు. ఆ తర్వాత రెండో సభ్యత్వం మాజీ మంత్రి హరీశ్‌రావు నమోదు చేసుకున్నారు. అనంతరం పార్టీ పార్లమెంటరీ నేత కె.కేశవరావు సభ్యత్వం పొందారు. ఈ సందర్భంగా కేసీఆర్ హరీశ్‌ను పిలిచి సభ్యత్వ పుస్తకాలు అందజేశారు. 2001లో తాను తెరాసను స్థాపించినప్పుడు తనతో పాటు హరీశ్ కష్టపడి పార్టీని నిలబెట్టారని ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు. సిద్దిపేటలో పార్టీ కార్యాలయాల శంకుస్థాపన బాగా జరిగిందని అన్నారు.

అప్పుడే ప్రజాభిమానం రుజువవుతుందని పార్టీ అధినేత వివరించారు. ప్రతీ ఇంటికి వెళ్లి సభ్యత్వం నమోదు చేయించాలన్నారు. సభ్యత్వం కోటి దాటితే మన బలమేమిటో ప్రపంచానికి తెలుస్తుందని పేర్కొన్నారు. సభ్యత్వ నమోదు ఎమ్మెల్యేల పనితీరును వెల్లడిస్తుందని చెప్పారు.

### ఎమ్మెల్యేలకు విదేశీయానం

పాలనలో, పార్టీలో ఎమ్మెల్యేలకు పెద్ద పీట వేస్తున్నామని, ప్రత్యామ్నాయ వ్యవస్థ ఉండరాదనే ఉద్దేశంతో పార్టీలో జిల్లా కమిటీలను రద్దు చేసి, నియోజకవర్గ కమిటీలను వేశామన్నారు. జిల్లా కమిటీలను పునరుద్ధరించే ప్రసక్తే లేదని కేసీఆర్ చెప్పారు. ఎమ్మెల్యేలు విషయ పరిజ్ఞానం పెంచుకోవాలన్నారు. వారిని ఇతర రాష్ట్రాలు, దేశాలకు అధ్యయనానికి పంపిస్తామన్నారు.

### త్వరలో పాలమూరు-రంగారెడ్డి

కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా జులై నుంచి పొలాలకు నీరిస్తామని, మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరందుతోందని, ఇక మరో ముఖ్య పథకం పాలమూరు-రంగారెడ్డిని యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామన్నారు.

### జడ్పీ ఛైర్మన్లకు అధికారాలు

కొత్త పంచాయతీరాజ్ చట్టం మేరకు జడ్పీ ఛైర్‌పర్సన్లకు అధికారాలు ఇస్తామని సీఎం చెప్పారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు వారికి సహకరించాలని సూచించారు. టీవీ చర్చల్లో తెరాస పేరిట ఎవరెవరో పాల్గొంటున్నారని.. ఇతర పార్టీల నేతలు విమర్శిస్తుంటే వారు బొమ్మల్లా ఉంటున్నారని ఎత్తిచూపిన పార్టీ అధినేత ఇకపై అలాంటివి సాగవద్దని, చర్చలకు ఎవరూ వెళ్లవద్దని స్పష్టంచేశారు. అవసరమయితే ప్యానల్‌ను ఏర్పాటు చేస్తామని వివరించారు.

### సభ్యత్వ నమోదు ప్రారంభం

విస్తృతస్థాయి సమావేశం సందర్భంగా తెరాస అధినేత కేసీఆర్ తొలి సభ్యత్వం స్వీకరించారు. తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన 11 ప్రత్యేక కౌంటర్లలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌తోపాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, జడ్పీ ఛైర్మన్లు, కార్పొరేషన్ల ఛైర్మన్లు పార్టీ సభ్యత్వం తీసుకున్నారు.

### తెరాస నేతలకు జగన్ అభివాదం..

తెరాస సమావేశం ముగిసిన తర్వాత కేసీఆర్ నానక్‌రాంగూడలో నటి, దర్శకురాలు విజయనిర్మలకు నివాళులు అర్పించేందుకు వెళ్లాలని నిర్ణయించారు. ఆయన బయల్దేరుతున్న సమయంలో.. ఏపీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కాన్వాయ్ బేగంపేట నుంచి బంజారాహిల్స్ మీదుగా లోటస్‌పాండ్ వైపు వస్తోందని తెలియడంతో కేసీఆర్‌కొద్దిసేపు ఆగారు. జగన్ తెలంగాణభవన్ మీదుగా వెళ్తూ తెరాస నేతలకు అభివాదాలు చేశారు.. ఆయన కాన్వాయ్ వెళ్లిన తర్వాత.. కేసీఆర్ కాన్వాయ్ కదిలింది.

### మనకు ఎవరూ పోటీ లేరు

"తెలంగాణలో మనకు ఎవరూ పోటీ లేరు. భాజపా గురించి మనం గాబరా పడి మాట్లాడొద్దు. అసలా పార్టీకి ఏమీ లేదు. వారిని పదిలేయండి. ఆగస్టు నాటికి తెలంగాణలో తెరాస తిరుగులేని రాజకీయశక్తిగా ఎదుగుతుంది"

– తెరాస అధినేత కేసీఆర్

# స్నేహ గీతిక

(మొదటి పేజీ తరువాయి)

నుంచి మళ్లించే నీటిలో కూడా ఇదే పద్ధతిని వినియోగించుకోవచ్చు. చర్చల్లో ఈ అంశం కీలకం కానుంది.

### మూడు ప్రతిపాదనలు

గోదావరి వరద నీటిని మళ్లించడానికి సంబంధించి మూడు ప్రతిపాదనలపై ఇద్దరు ముఖ్యమంత్రులు చర్చించే అవకాశం ఉన్నట్లు తెలిసింది. ఇంద్రావతి నది గోదావరిలో కలిసిన తర్వాత ఇచ్చంపల్లి నుంచి లేదా దిగువ నుంచి నేరుగా శ్రీశైలంకు మళ్లించడం, అకినేపల్లి నుంచి నాగార్జునసాగర్ ద్వారా శ్రీశైలానికి, లేదంటే దుమ్ముగూడెం-నాగార్జునసాగర్ టేల్‌పాండ్ ద్వారా శ్రీశైలానికి మళ్లించే ప్రతిపాదనలపై చర్చించి నిర్ణయం తీసుకోవడం కాని రెండు రాష్ట్రాల ఇంజినీరింగ్ అధికారులతో కమిటీని ఏర్పాటు చేయడం కాని చేసే అవకాశం ఉన్నట్లు తెలిసింది.

### శ్రీశైలంలోకి మళ్లింపుపైనే ఏపీ ఆసక్తి!

గోదావరి జలాలను నేరుగా శ్రీశైలం జలాశయంలోకి మళ్లించడం అనే అంశంపైనే ప్రధానంగా దృష్టి సారించాలని ఏపీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి జలవనరులశాఖ అధికారులకు సూచించారు. శుక్రవారం హైదరాబాద్‌లో తెలుగు రాష్ట్రాల సీఎంల భేటీ నేపథ్యంలో తాడేపల్లిలోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో గురువారం ఇంజినీర్ ఇన్ చీఫ్ ఎం.వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర వ్యవహారాల చీఫ్ ఇంజినీరు నాగేశ్వరరావు ముఖ్యమంత్రి జగన్‌ను కలుసుకున్నారు. గోదావరి వరద జలాల వినియోగంపై ఈ సందర్భంగా వీరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. గోదావరి వరద నీటిని మధ్యలో ఏ జలాశయంలోకి మళ్లించనవసరం లేకుండా నేరుగా శ్రీశైలంలోకి ఎలా ఎత్తిపోయాలనే అంశంపై దృష్టి సారించాలని సీఎం వారికి దిశా నిర్దేశం చేసినట్లు తెలిసింది. ఈ సందర్భంగా అధికారులు కొన్ని భిన్నాంశాలను ప్రస్తావించగా ముందు పూర్తి స్థాయి ప్రతిపాదన రూపుదాలిస్తే ఆ తర్వాత అవసరమైన అన్ని అంశాలు పరిగణనలోకి తీసుకుని చర్చిద్దామని ముఖ్యమంత్రి అభిప్రాయపడినట్లు తెలిసింది.

## సీఎం దృష్టికి ఇంజినీర్ల పదోన్నతుల సమస్య

ఈనాడు, హైదరాబాద్: సాగు నీటిపారుదల శాఖలో ఐదు, ఆరు జోన్ల ఇంజినీర్ల పదోన్నతుల సమస్యను పరిష్కరించాలంటూ ముఖ్యమంత్రి కేసీఆర్‌కు గురువారం హైదరాబాద్ ఇంజినీర్స్ అసోసియేషన్ వినతిపత్రం అందించింది. పదోన్నతుల వ్యవహారంలో సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం గతేడాది నవంబర్ 22న జారీ చేసిన జీవోలను వెంటనే అమలుచేయాలని విన్నవించింది. రాష్ట్రం ఏర్పడిన నాటినుంచి శాఖలో అత్యున్నత పదవుల్లో ఐదో జోన్ వారికే అవకాశాలు దక్కుతున్నాయని పేర్కొంది. అసమానతలను సరిచేసేందుకు ప్రభుత్వం ప్రయత్నించినా కొందరు అడ్డుకుంటున్నారని సంఘం విమర్శించింది. సీఎస్ ఎస్కే జోషిని కూడా ఇంజినీర్లు కలిసి సమస్య తీవ్రతను వివరించారు. వారంలోగా ఓ పరిష్కారం చూపే ప్రయత్నం చేస్తామని ఆయన అన్నారని అసోసియేషన్ అధ్యక్షుడు మహేందర్, కార్యదర్శి చక్రధర్ వెల్లడించారు.

## ఈడబ్ల్యూఎస్ కోటా అమలు చేయండి

- 10 ప్రైవేటు వైద్య కళాశాలల నుంచి ప్రభుత్వానికి ప్రతిపాదన

ఈనాడు, హైదరాబాద్: ఆర్థికంగా బలహీన వర్గాల(ఈడబ్ల్యూఎస్) కోటాను తమ కళాశాలల్లో అమలు చేయాలని కోరుతూ తెలంగాణలోని 10 ప్రైవేటు వైద్య కళాశాలలు ప్రభుత్వానికి దరఖాస్తు చేశాయి. వాటిని పరిశీలించిన వైద్యారోగ్య శాఖ గురువారం భారతీయ వైద్య మండలి(ఎంసీఐ)కి రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతిపాదించింది. ఈ నెల 28తో దరఖాస్తు గడువు ముగియనుండడంతో రాష్ట్రంలోని ఇతర ప్రైవేటు కళాశాలలు ఈడబ్ల్యూఎస్ కోటా అమలుకు ముందుకొస్తాయా? లేదా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. వారి ప్రతిపాదన ఇలా ఉండగా ఈడబ్ల్యూఎస్ కోటా కింద అదనపు సీట్లు మంజూరైన వైద్య కళాశాలల్లో మాత్రమే ఆ కోటా అమలు చేసే అవకాశం ఉంటుందని వైద్యారోగ్యశాఖ వర్గాలు తెలిపాయి. రాష్ట్రం నుంచి అదనంగా ఈడబ్ల్యూఎస్ కోటా కింద సుమారు 1200 ఎంబీబీఎస్ సీట్లు ప్రైవేటు కళాశాలలకు మంజూరు చేయాలంటూ ప్రతిపాదనలు పంపామని వెల్లడించాయి. ఈడబ్ల్యూఎస్ కోటాకు పంపించిన ప్రతిపాదనల్లో మొత్తం సీట్లకు అదనంగా సీట్లను మంజూరు చేయాలని ప్రతిపాదించినట్లుగా తెలుస్తోంది. ఎంసీఐ ఈ విషయంలో ఎటువంటి స్పష్టత ఇవ్వకపోవడంతో ఆ ప్రతిపాదనలకు పూర్తిస్థాయి ఆమోదం లభిస్తుందా? లేదా కన్వీనర్ కోటా(మొత్తం సీట్లలో 50 శాతం) సీట్లకు మాత్రమే అదనపు సీట్లను మంజూరు చేస్తారా? అనేది తేలాల్సి ఉంది.

# దేశంలో ఎక్కడి నుంచైనా రేషన్!

(మొదటి పేజీ తరువాయి)

కంప్యూటరీకరించడం; ఆహారధాన్యాల పంపిణీ, నిల్వల విషయంలో పారదర్శకత; ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ డిపోలను డిపో ఆన్‌లైన్ విధానంతో అనుసంధానించడం తదితర అంశాలపై చర్చ జరిగింది. దేశమంతా పనిచేసేలా రేషన్ కార్డుల విధానం అమలు దిశగా ముందుకెళ్లేందుకు సదస్సులో నిర్ణయించారు. ఈ విధానం కార్డుదారులందరికీ.. ప్రత్యేకించి ఉపాధిని వెతుక్కుంటూ ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వలస వెళ్లేవారికి చాలా ప్రయోజనకరంగా ఉంటుందని మంత్రి అభిప్రాయపడ్డారు.

### తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటికే సమీకృత విధానం..

సమీకృత ప్రజా పంపిణీ విధానానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా పలు రాష్ట్రాలు ఇప్పటికే రూపకల్పన చేశాయి. దీనిద్వారా ఆయా రాష్ట్రాల్లో వినియోగదారులు ఏ జిల్లాలోనైనా రేషన్ సరకులు తీసుకునేందుకు వీలు కలుగుతుంది. మరికొన్ని రాష్ట్రాలు కూడా దీనికి హామీ ఇచ్చాయి. ఈ నేపథ్యంలో 'ఒకే దేశం.. ఒకే రేషన్ కార్డు' దిశగా ఆహార, ప్రజా పంపిణీ విభాగం కూడా రంగంలోకి దిగింది. నిర్ణీత కాలవ్యవధిలోనే ఇలాంటి విధానాన్ని దేశమంతా తీసుకు రావాలన్నది లక్ష్యం. ఈమేరకు అన్ని రేషన్ కార్డుల అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకు కేంద్ర స్థాయిలో కార్డుల సమాచారంతో ఒక వ్యవస్థను ఆహార మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయనుంది. ఇందులో ఆహార, ప్రజా పంపిణీ విభాగం చేసే పని కీలకమని మంత్రి పాసవాన్ తెలిపారు. ఎఫ్‌సీఐ, సీడబ్ల్యూసీ, ఎస్‌డబ్ల్యూసీ, ఇతర ప్రైవేటు గోదాముల్లో 612 లక్షల టన్నుల ఆహారధాన్యాలు ఏటా 81 కోట్ల మందికి పంపిణీ అవుతున్నట్లు వివరించారు. సరకుల కొనుగోలు నుంచి పంపిణీ వరకూ అవినీతికి తావు లేకుండా జరిగేలా ఇన్ఫర్మేషన్ టెక్నాలజీని వినియోగించనున్నట్లు వెల్లడించారు.

## మరాఠాల రిజర్వేషన్‌కు హైకోర్టు సమ్మతి

12-13 శాతానికి తగ్గించాలని స్పష్టీకరణ

ముంబయి, న్యూస్‌టుడే: విద్య, ఉద్యోగావకాశాల్లో మరాఠాలకు రిజర్వేషన్ కోటా కల్పిస్తూ మహారాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని బొంబాయి హైకోర్టు సమ్మతించింది. అయితే రాష్ట్ర బీసీ కమిషన్ సిఫార్సుల మేరకు దాన్ని 16 శాతం నుంచి 12-13 శాతానికి తగ్గించాలని ఆదేశించింది. ఈమేరకు జస్టిస్ రంజిత్ మోరే, జస్టిస్ భారతి డాంగ్రేలతో కూడిన ధర్మాసనం గురువారం తీర్పును వెలువరించింది. గతంలో బీసీ కమిషన్ ఇచ్చిన నివేదికలో విద్యావకాశాల్లో 12%, ఉద్యోగాలకు 13% రిజర్వేషన్ అమలు చేయాలని సిఫార్సు చేసింది.

## ఉన్నత విద్యకు ప్రత్యేక కమిషన్

- బిల్లు తీసుకొచ్చే యోచన
- యూజీసీ, ఏఐసీటీఈల విలీనం
- కేంద్ర మంత్రి పోఖ్రియాల్

ఈనాడు, దిల్లీ: దేశంలో విద్యా ప్రమాణాలను మెరుగుపరిచే లక్ష్యంతో ఉన్నత విద్యా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేశ్ పోఖ్రియాల్ తెలిపారు. దీని కోసం బిల్లు తెచ్చే అంశాన్ని కేంద్రం పరిశీలిస్తోందన్నారు. గురువారం రాజ్యసభలో ఓ లిఖిత పూర్వక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయాన్ని వెల్లడించారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ), ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)చట్టాలను రద్దుచేసి ఈ రెండు సంస్థలనూ ఉన్నత విద్యా కమిషన్‌లో విలీనం చేసే ఆలోచనా ఉందన్నారు. ఉన్నత విద్యా కమిషన్ విద్యారంగంలో అత్యంత ప్రముఖులైన వారి నేతృత్వంలో స్వతంత్ర ప్రతిపత్తి సంస్థగా పనిచేస్తుందని పేర్కొన్నారు. బాగా పని చేసే ఉన్నత విద్యాసంస్థలను, పరిశోధనలు, నవకల్పనలను ప్రోత్సహించడం దీని ప్రధాన ఉద్దేశమని చెప్పారు.

# అవయవ మార్పిడి కేంద్రంగా గాంధీ ఆసుపత్రి

- 8వ అంతస్తులో వేర్వేరు అత్యాధునిక శస్త్రచికిత్స గదులు
- రూ.35 కోట్లతో నిర్మాణానికి ఏర్పాట్లు



ఈనాడు, హైదరాబాద్: మూత్రపిండాలు, కాలేయం, గుండె, ఊపిరితిత్తులు.. తదితర అవయవ మార్పిడి శస్త్రచికిత్సలను ప్రభుత్వ వైద్యంలో నిర్వహించే విధంగా తెలంగాణ ప్రభుత్వం దృష్టిపెట్టింది. అత్యాధునిక పరికరాలతో అధునాతన సౌకర్యాలతో(మాడ్యులర్) వేర్వేరు శస్త్రచికిత్స గదులను సిద్ధం చేయనున్నారు. ఇందుకోసం గాంధీ ఆసుపత్రిని వైద్యఆరోగ్యశాఖ ఎంపిక చేసింది. ఈ ఆసుపత్రిలోని 8వ అంతస్తులో దాదాపు రూ.35 కోట్ల నిర్మాణంతో 8 ఆధునిక శస్త్రచికిత్స గదులను నిర్మించాలని నిర్ణయించింది. ఆరోగ్యశ్రీ ట్రస్టులో అందుబాటులో ఉన్న మూల ధనాన్ని ఈ మాడ్యులర్ థియేటర్ల నిర్మాణం కోసం వినియోగించాలని తీర్మానించింది.

### గాంధీ ఆసుపత్రియే ఎందుకు?

ప్రస్తుతం ప్రభుత్వ వైద్యంలో స్వయంప్రతిపత్తి సంస్థగా ఉన్న నిమ్స్‌లో అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెండు మాడ్యులర్ థియేటర్లున్నాయి. వీటిలో ఎక్కువగా మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తుండగా.. అప్పుడప్పుడు గుండె, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. నిమ్స్ మినహా సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలందిస్తున్న ఆసుపత్రులు ఉస్మానియా, గాంధీలే. వీటిలో మాడ్యులర్ థియేటర్లు లేవు. అయినా ఉస్మానియా ఆసుపత్రిలో మూడు దశాబ్దాల కిందటి నుంచే మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు. ఐదేళ్లుగా పరిమిత సంఖ్యలో కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు చేస్తున్నారు. ఉస్మానియా ఆసుపత్రిలో ఉన్న శస్త్రచికిత్స గదులు ఏళ్ల కిందటివి కావడంతో వాటిల్లో ఇప్పుడు పూర్తిస్థాయిలో అవయవ మార్పిడి ఆపరేషన్లు సాధ్యపడడంలేదు. అధునాతన శస్త్రచికిత్స గదులు నిర్మించాలన్నా పురాతన భవనం కావడంతో అధికారులు ఆ దిశగా చర్యలు చేపట్టడం లేదు. ఇక గాంధీలోనూ ఇదే పరిస్థితి. ఇక్కడ భవనం పురాతనమైనదేమీ కాకపోయినా.. అవయవ మార్పిడికి తగ్గట్లుగా శస్త్రచికిత్స గదులు లేవు. ప్రస్తుతం గాంధీ ఆసుపత్రిలో అతి స్వల్పంగా మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సలు జరుగుతున్నాయి. ఈ పరిస్థితుల్లో గాంధీలోనే అవయవ మార్పిడికి తగ్గట్లుగా అత్యాధునిక శస్త్రచికిత్స గదులను నిర్మించాలని ఆరోగ్యశాఖ నిర్ణయించింది. పైగా గాంధీ ఆసుపత్రిలో మహిళలు, పిల్లలకు సంబంధించిన విభాగాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ మాడ్యులర్ థియేటర్లను నిర్మించడం వల్ల పిల్లల్లో గుండె మార్పిడి, కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినా.. ఆయా విభాగాలకు సంబంధించిన నిపుణులు అందుబాటులో ఉండడం మెరుగైన చికిత్సకు దోహదపడుతుంది.

### నిర్మాణమెలా?

- గాంధీ ఆసుపత్రిలో 8వ అంతస్తులో అందుబాటులో ఉన్న దాదాపు లక్ష చదరపు అడుగుల విస్తీర్ణాన్ని విభజించి, వేర్వేరు అవయవ మార్పిడి శస్త్రచికిత్సల నిర్వహణకు అనుగుణంగా గదులను ఆధునికీకరిస్తారు.
- ప్రస్తుతం 8వ అంతస్తులో ఉన్న నర్సింగ్ పాఠశాల, వసతిగృహాన్ని సికింద్రాబాద్‌లోని బోయిగూడలో ఉన్న భవనానికి, ఇదే అంతస్తులో ఉన్న పల్మనాలజీ విభాగాన్ని ఐదో అంతస్తుకు మారుస్తారు.
- ప్రతి శస్త్రచికిత్స గదికి అనుబంధంగా మినీ ఐసీయూను, శస్త్రచికిత్సకు ముందు సిద్ధం చేసే గదిని, శస్త్రచికిత్స అనంతరం పర్యవేక్షణ గదిని నెలకొల్పుతారు.
- ఉస్మానియా ఆసుపత్రిలోని సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగాన్ని గాంధీ ఆసుపత్రికి బదిలీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీనికి సంబంధించిన ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి.

### ఏమిటీ ఉపయోగం?

- ప్రభుత్వ వైద్యంలో అవయవ మార్పిడికి అవసరమైన అత్యాధునిక శస్త్రచికిత్స గదులు ఒకే చోట అందుబాటులోకి వస్తాయి.
- అవయవ మార్పిడి కేంద్రంగా తీర్చిదిద్దడం వల్ల అన్ని రకాల సూపర్ స్పెషాలిటీ సేవలు లభ్యమవుతాయి.
- ప్రస్తుతం ప్రైవేటులో మూత్రపిండ మార్పిడి శస్త్రచికిత్సకు కనీసం రూ.15 లక్షలవుతుంది. కాలేయ మార్పిడికి రూ.30-40 లక్షలవుతుంది. ప్రభుత్వ వైద్యంలో అత్యాధునిక శస్త్రచికిత్స గదులను అందుబాటులోకి తీసుకురావడం వల్ల.. తక్కువ ఖర్చుతో రోగులకు అవయవ మార్పిడికి సంబంధించి మెరుగైన చికిత్స అందించవచ్చు. ఆ మేరకు కార్పొరేట్‌కు చెల్లించాల్సిన ఆర్థిక భారమూ సర్కారుకు తప్పుతుంది.



### స్వేచ్ఛ - జననం

స్వేచ్ఛ అనేది జననం లాంటిది. మనం పూర్తిగా బయటపడి స్వేచ్ఛ పొందే వరకూ కూడా బానిసలమే! ఇదే సమయంలో ఇతరుల దయాదాక్షిణ్యాల ఫలితంగా దక్కే స్వేచ్ఛ.. వారిదెంతటి ఉదార ప్రయత్నమైనా సరే.. మనకు నిలబడేది కాదని చెప్పుకోక తప్పదు.

– మహాత్మా గాంధీ

### గ్రహం అనుగ్రహం

28–6–2019 శుక్రవారం

శ్రీ వికారి నామ సం॥రం॥ ఉత్తరాయణం
గ్రీష్మ రుతువు; జ్యేష్ఠ మాసం; బహుళ పక్షం
ఏకాదశి: తె. 3.48 తదుపరి ద్వాదశి
అశ్విని నక్షత్రం: ఉ. 6.54 తదుపరి భరణి
అమృత ఘడియలు: తె. 3.00 నుంచి 4.41 వరకు
వర్జ్యం: సా. 4.57 నుంచి 6.37 వరకు
దుర్ముహూర్తం: ఉ. 8.07 నుంచి 8.59 వరకు
తిరిగి మ. 12.28 నుంచి 1.20 వరకు
రాహుకాలం: ఉ. 10.30 నుంచి 12.00 వరకు
సూర్యోదయం: ఉ.5-31; సూర్యాస్తమయం: సా.6.32

# వేధిస్తే విదేశీ అల్లుడి వీపు మోతే!

- మహిళా భద్రతా విభాగం ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు
- ఎన్ఆర్ఐ అల్లుళ్ల వేధింపులకు చెక్
- నిందితుడిని గుర్తించి రప్పించేలా చర్యలు

ఈనాడు, హైదరాబాద్: అమెరికా సంబంధమంటే కొంతమంది అమ్మాయిలకు ఎంతో ఆశపడుతుంటారు. అందుకే చాలామంది తల్లిదండ్రులు విదేశీ సంబంధాల వైపు మొగ్గు చూపుతున్నారు. ఇదే అదనుగా కొంతమంది మోసగాళ్లు బరి తెగిస్తున్నారు. విదేశాల్లో ఉన్న తమపై ఎలాంటి చర్యలూ తీసుకోలేరనే నమ్మకంతో పెళ్లయ్యాక భార్యలను అదనపు కట్నం కోసం వేధించడం.. పుట్టింట్లో వదిలేసి వెళ్లిపోవడం.. లేదంటే రెండో పెళ్లి చేసుకోవడం, అంతకు ముందే పెళ్లయినా దాచిపెట్టి మరోమారు పెళ్లిచేసుకోవడం వంటివి ఇందులో కొన్ని. ఇలాంటివి జరిగితే అమ్మాయి తల్లిదండ్రులు ఆవేదన చెందడం తప్ప విదేశాల్లో ఉన్న అల్లుడిపై చర్యలు తీసుకోలేకపోతున్నారు. చట్టపరమైన సమస్యల కారణంగా పోలీసులు ఇలాంటి కేసుల్లో ఏమీ చేయలేకపోతున్నారు. ఇలాంటి కేసులకు సరైన పరిష్కారం కనుక్కునేందుకు తెలంగాణ ప్రభుత్వం పోలీసుశాఖలోని మహిళా భద్రతా విభాగం ఐజీ స్వాతి లక్రా ఆధ్వర్యంలో ప్రత్యేక సెల్ ఏర్పాటు చేయబోతోంది. లక్డీకాపూల్‌లోని మహిళా భద్రతా విభాగం భవనంలో ఈ సెల్ ఏర్పాటు చేయబోతున్నారు. ఎన్ఆర్ఐ కేసులపై ఇప్పటికే అమెరికా కాన్సులేట్‌లో సంప్రదింపులు జరిపారు.

### చర్యలు తీసుకోవడం కష్టమా!

గృహహింసకు సంబంధించిన కేసులలో విదేశాల్లో ఉన్న అల్లుళ్లపై చర్యలు తీసుకోవడం మన పోలీసులకు కష్టంగా ఉంది. అసలు ఏదైనా నేరం చేసి విదేశాలకు చెక్కేస్తే తిరిగి రప్పించడమే కష్టమైతే ఇక గృహహింస లాంటి వాటిలో చర్యలు సాధ్యమే కావడంలేదు. ఎందుకంటే ఆయా దేశాల్లో వరకట్న వేధింపుల వంటి నేరాలకు ప్రత్యేక చట్టాలు లేవు. రెండు దేశాల మధ్య నేరగాళ్ల అప్పగింత జరగాలంటే మొదట ఆ రెండు దేశాల్లోనూ అదేరకమైన నేరానికి సంబంధించిన చట్టాలు ఉండాలి. ఉదాహరణకు మన దేశంలో వరకట్న వేధింపులకు పాల్పడితే శిక్షించే చట్టాలున్నాయి. కాని అమెరికా, ఇంగ్లాండు వంటి దేశాల్లో అసలు వరకట్న వేధింపుల వంటివి ఉండవు. దాంతో అక్కడ అలాంటి చట్టాలేవీ లేవు. అందుకే ఎన్ఆర్ఐ అల్లుళ్లపై మన దేశంలో వరకట్న వేధింపుల కేసు నమోదైనప్పుడు వారిని ఇక్కడకు రప్పించడం కుదరడంలేదు. గతంలో ఇలాంటి వారిపై రెడ్‌కార్నర్ నోటీసు జారీ చేసేవారు. దీనివల్ల నిందితుడు ఒక దేశం నుంచి మరో దేశం వెళితే విమానాశ్రయంలోనే పట్టుకొని మన పోలీసులకు సమాచారం ఇచ్చేవారు. కాని ఇలాంటి వరకట్న వేధింపుల చట్టం ఆయా దేశాల్లో లేదు కాబట్టి రెడ్‌కార్నర్ సాధ్యంకాదని ఇంటర్‌పోల్ తేల్చేసింది. దాంతో తమకు ఏమీ కాదన్న భరోసాతో విదేశీ అల్లుళ్లు కొందరు చెలరేగిపోతున్నారు. బాధిత తల్లిదండ్రులు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండటంలేదు. భారత దేశంలోని ఏ విమానాశ్రయంలోనికైనా ప్రవేశిస్తే పట్టుకునేలా లుక్ అవుట్ నోటీసులు జారీ చేసి ఊరుకుంటున్నారు. దాంతో వేధింపులకు పాల్పడ్డ నిందితులు ఇక్కడ అడుగుపెట్టకుండా విదేశాల్లోనే గడిపేస్తున్నాడు. దీన్ని దృష్టిలో ఉంచుకొని మహిళా భద్రతా విభాగంలో ప్రత్యేక సెల్ ఏర్పాటుకు సంకల్పించారు.

గత ఐదేళ్లలో జారీ అయిన లుక్ అవుట్ నోటీసులు (ఎల్.ఒ.సి.లు)

| సంవత్సరం | సంఖ్య |
|---|---|
| 2014 | 7 |
| 2015 | 21 |
| 2016 | 27 |
| 2017 | 76 |
| 2018 | 101 |

### ఎలా పనిచేస్తుంది?

- డీఎస్పీ ఆధ్వర్యంలో ఈ సెల్ పనిచేస్తుంది.
- నిపుణులైన న్యాయవాదులతోపాటు స్వచ్ఛంద సేవా సంస్థలు ఇక్కడ సేవలు అందిస్తాయి.
- వచ్చిన ఫిర్యాదు ఆధారంగా వీరు న్యాయపరమైన సలహాలు ఇస్తారు.
- నిందితుడు ఏ దేశంలో పనిచేస్తున్నాడో తెలుసుకుని ఆ దేశంలోని స్వచ్ఛంద సంస్థల సాయం తీసుకుంటారు.
- అవసరమైతే ఆ దేశానికి చెందిన విదేశాంగ కార్యాలయం అధికారులతో మాట్లాడతారు. నిందితుణ్ని తమకు అప్పగించాలని విజ్ఞప్తి చేస్తారు. ఇదంతా విదేశీ వ్యవహారాల పరిధిలోనే జరుగుతుంది.
- ఆయా దేశాల్లో పనిచేస్తున్న స్వచ్ఛంద సేవా సంస్థల సాయం కూడా తీసుకుంటారు. దేశాల వారీగా ఆయా సంస్థల జాబితా సిద్ధం చేస్తున్నారు. అమెరికాలో పనిచేస్తున్న సంస్థల వివరాలు ఇప్పటికే సేకరించారు.
- నిందితుడి గుర్తించడం, రప్పించడం, చట్టపరంగా శిక్షించడం కొత్తగా ఏర్పాటు చేయబోయే సెల్ లక్ష్యం.

### వాతావరణం

| ప్రాంతం | గరిష్ఠ | కనిష్ఠ |
|---|---|---|
| ఆదిలాబాద్ | 40.3 | 27.6 |
| సూర్యాపేట | 40.0 | 31.0 |
| కరీంనగర్ | 40.0 | 27.0 |
| నల్గొండ | 40.0 | 25.0 |
| విజయవాడ | 38.9 | 27.0 |
| ఒంగోలు | 38.8 | 27.4 |
| నరసాపురం | 38.5 | 28.8 |
| నిజామాబాద్ | 38.1 | 26.4 |
| ఖమ్మం | 38.0 | 31.0 |
| రామగుండం | 38.0 | 27.6 |
| తిరుపతి | 38.0 | 25.7 |
| గుంటూరు | 37.9 | 27.4 |
| కర్నూలు | 37.1 | 26.4 |
| కడప | 37.0 | 28.0 |
| హన్మకొండ | 36.8 | 27.5 |
| మహబూబ్‌నగర్ | 36.8 | 25.5 |
| విశాఖపట్నం | 36.6 | 26.8 |
| హైదరాబాద్ | 35.8 | 25.0 |

TET EM TM PAPER-I, II గురుకుల్ టీచర్స్ TGT, PGT, PET
FREE DEMO : 30-6-2019@10AM by
TET + Gurukul Intensive Batch
బాసర ఇనిస్టిట్యూట్ 8686344155 7674883883

గురుకుల టీచర్స్ TET TM EM Paper - I&II
TGT/PGT/PET/LIBRARIANS
S.I/కానిస్టేబుల్స్ TM EM
FREE DEMO: 30-06-2019 at 10.08 am
RAMAIAH COMPETITIVE COACHING CENTRE Opp: Konark Theatre Dilsukhnagar, Hyd Cell :8885555202 9246208422

S.I & కానిస్టేబుల్
త్వరలో 15000 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల
Long Term New Batches : 01-07-2019
State 1st & 2nd Ranks in TSLPRB 2016 Results
Separate Batches for TM/EM
iRise Dilsukhnagar, Hyderabad. 9985999335 9985510325
Adding Fuel To Your Inner Fire

ఉచిత శిక్షణ SC,ST,BC,EBC(OC) FREE DEMO
గ్రూప్-1,2,3, SI, PC 30 Sun JUNE at 10 am
TET-1,2+SGT NEW BATCH 1-7-2019
VIJETHA STUDY CIRCLE
•DSNR Opp.Bus Depot: 99084 70999, 99084 80999
•KPHB, Above bank of India : 9848590605

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

# ఈనాడు

## శాశ్వత సభ్యత్వం ఎప్పుడో!

అంతర్జాతీయ స్థాయిలో భారత్‌కు లభించిన అనూహ్య దౌత్య విజయమిది. 2021 నుంచి రెండేళ్ల కాలానికి ఐక్యరాజ్య సమితి భద్రతామండలిలో తాత్కాలిక సభ్యత్వం కోసం ఆసియా-పసిఫిక్ దేశాల కూటమి మూకుమ్మడిగా ఇండియాకు మద్దతు ప్రకటించింది. మండలిలో చైనా, ఫ్రాన్స్, రష్యా, బ్రిటన్, అమెరికా అయిదూ శాశ్వత సభ్యదేశాలు. వాటితోపాటు రెండేళ్ల కాలపరిమితి కలిగిన పది తాత్కాలిక సభ్యదేశాలుంటాయి. ఏటా అయిదు నిష్క్రమిస్తే మరో అయిదు వాటి స్థానే భద్రతామండలిలో ప్రవేశిస్తుంటాయి. ఆఫ్రికా ఆసియాలకు అయిదు, తూర్పు ఐరోపా దేశాలకు ఒకటి, లాటిన్ అమెరికా కరీబియన్ దేశాలకు రెండు, తక్కిన వాటికి రెండు లెక్కన తాత్కాలిక సభ్యత్వాల భర్తీకి ఎప్పుడూ గట్టి పోటీ నెలకొంటుంది. అలా వచ్చే ఏడాది జూన్‌లో జరిగే ఎన్నికల్లో భారత్ ప్రాతినిధ్యానికి ఇప్పుడు ఆసియా-పసిఫిక్ కూటమి ఏకగ్రీవంగా వత్తాసు పలుకుతోంది. సాధారణంగా ఐక్యరాజ్య సమితి వేదికపై పాకిస్థాన్, చైనాల జోడీకి ఇండియా అంటేనే చుక్కెదురు. తరచూ దౌత్యపరమైన సవాళ్లు విసిరే ఇస్లామాబాద్, బీజింగ్‌ల నుంచి ఈసారి దిల్లీకి అసందిగ్ధ తోడ్పాటు వ్యక్తం కావడం విశేషం. నిర్ణీత పద్ధతి ప్రకారం ఏటా అయిదు తాత్కాలిక సభ్య దేశాలను ఐరాస సాధారణ సభ ఎన్నుకుంటుంది. 193 సభ్య దేశాల్లో మూడింట రెండొంతుల ఓట్లు పొందాల్సి ఉన్న భారత్‌కిక విజయం నల్లేరుపై బండి నడకేనన్న విశ్లేషణలు వెల్లువెత్తుతున్నాయి. ఇండియాకు పరతంత్ర పాలన పీడ విరగడై 2022 ఆగస్టుకు 75 ఏళ్లు పూర్తవుతాయి. అదే సంవత్సరం జి-20 సదస్సుకు దిల్లీ ఆతిథ్యం ఇవ్వనుంది. అందువల్ల అప్పటికి భద్రతామండలిలో ప్రాతినిధ్యం కలిగి ఉండాలన్న భారత్ అభిలాష నెరవేరడానికి మార్గం దాదాపుగా సుగమమైనట్లే. విశ్వ మానవాళిలో 17శాతానికి పైగా భూరి జన రాశికి నెలవైన భారత్ స్థాయీ ప్రమాణాలకు, స్వాభావిక అర్హతలకు సముచిత గౌరవం- భద్రతామండలిలో శాశ్వత సభ్యత్వమే!

భద్రతామండలిలో తాత్కాలిక సభ్యత్వ హోదా భారత్‌కు గతంలో ఏడుసార్లు దఖలుపడింది. ఇది ఎనిమిదోసారి. ఈ ప్రాతినిధ్యంకోసం 2013లోనే యత్నాలు ఆరంభించిన ఇండియాతో అఫ్గానిస్థాన్ తొలుత పోటీపడినా, తరవాత వెనక్కి తగ్గింది. 1996 నాటి హోరాహోరీలో జపాన్ చేతిలో భారత్‌కు భంగపాటు ఎదురైంది. జనాభా ప్రాతిపదికన చైనాకు ఇంచుమించుగా సాటిరాగల, సమీప భవిష్యత్తులో బీజింగ్‌ను వెనక్కి నెట్టగల ఏకైక దేశానికి- పరిమిత కోటాలో తాత్కాలిక సభ్యత్వానికి ఇన్ని తిప్పలు పడాల్సి రావడమేమిటి? అంతర్జాతీయంగా వర్ధమాన దేశాల వాణిని బలంగా వినిపించడంలో ముందున్న ఇండియాకు మండలిలో శాశ్వత సభ్యత్వం కల్పించడానికి రష్యా, ఫ్రాన్స్, అమెరికా, బ్రిటన్ వివిధ సందర్భాల్లో సుముఖత వ్యక్తపరచాయి. ఆ ప్రతిపాదనకు చిరకాలంగా మోకాలడ్డుతున్న 'వీటో' దేశం చైనాయే. 'పి 5' (అయిదు శాశ్వత సభ్యదేశాల కూటమి)ని ఇండియా, జపాన్, జర్మనీ, బ్రెజిల్‌తో 'పి 9'గా రూపొందించాలన్న యోచనకు ప్రతిబంధకాలు ఏర్పరుస్తున్నదీ అదే. ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికాలకు భద్రతామండలిలో ఏకైక శాశ్వత ప్రతినిధిగా వెలుగొందుతున్న చైనా తన సరసన ఇండియా, జపాన్‌లకు చోటు దక్కరాదన్న ఏకైక లక్ష్యంతో ఏళ్ల తరబడి ప్రతినాయక పాత్ర పోషిస్తోంది. భద్రతామండలి పరిమాణం, అధికారాల్లో ఎటువంటి మార్పులు చేర్పులకైనా శాశ్వత సభ్యదేశాల సమ్మతి పొంది తీరాలని సమితి ఛార్టర్ స్పష్టీకరిస్తోంది. సభ్య దేశాల నిబద్ధత, రాజకీయ నిశ్చయాలే ఐక్యరాజ్య సమితి సంస్కరణల ప్రస్థానాన్ని నిర్దేశించగలవన్న సర్వప్రతినిధి సభ సారథి మరియా ఫెర్నాండా ఎస్పినోసా వ్యాఖ్యలు అక్షర సత్యాలు. మండలి విశ్వజనీనత సంతరించుకోవాలీ అంటే కీలక నిర్ణయాధికారం ఏ కొందరి గుప్పిట్లోనో ఇరుక్కోకుండా ఛార్టర్‌నుంచే ఆరంభం కావాలి సంస్కరణలు!

రెండో ప్రపంచ యుద్ధ శిథిలాలపై ఊపిరి పోసుకున్న ఐక్యరాజ్య సమితి స్థాపిత లక్ష్యాల సాధనలో విఫలమైంది. విశ్వ మానవాళికి యుద్ధభీతిని దూరం చేయలేకపోయింది. 'సూపర్ పవర్' చేతిలో గువ్వపిట్టగా సమితి, వీటో రాజ్యాల సంచాలక కార్యాలయంగా భద్రతామండలి పరువు మాశాయి. గడచిన ఏడున్నర దశాబ్దాల్లో ప్రపంచ స్థితిగతుల్లో విశేష మార్పులు చోటుచేసుకున్నాయి. మండలిలో శాశ్వత సభ్యత్వం కలిగిన రష్యా, బ్రిటన్, ఫ్రాన్స్ గత వైభవ చిహ్నాలుగా మిగిలాయి. దశాబ్దాల తరబడి సమితిని తన కనుసన్నల్లో శాసించిన అమెరికా- ట్రంపరితనం పర్యవసానంగా ఐరాస మానవ హక్కుల మండలినుంచి వైదొలగి, సమితిని ఆర్థికంగానూ ఇక్కట్లపాలు చేస్తోంది. తనవంతుగా చైనా 'జైషే మహ్మద్' సారథి మసూద్ అజర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా ప్రకటించే తీర్మానాన్ని అడ్డుకోవడానికి 'వీటో' అధికారాన్ని ఎలా దుర్వినియోగపరచిందీ ఇటీవలి చరిత్రే! ప్రపంచ జనాభాలో పదిశాతంలోపు వాటా కలిగిన ఐరోపా, భద్రతామండలిలో మూడు సభ్య దేశాలను (బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా) కలిగి ఉండటమేమిటి? రష్యా, కజకిస్థాన్, టర్కీల్లో కొంత విస్తీర్ణంతోపాటు 48దేశాలతో ఎకాయెకి 60శాతం విశ్వమానవాళికి నెలవైన ఆసియా ఖండ ప్రాతినిధ్యం కేవలం చైనాకే పరిమితం కావడమేమిటి? ఒకప్పటి శిబిరాల లెక్కలు, బల సమీకరణాలను పక్కనపెట్టి భిన్న రంగాల్లో వివిధ దేశాల శక్తి సామర్థ్యాలు, అంతర్జాతీయంగా వాటి సేవానిరతి, శాంతిప్రియత్వం, ఖండాలవారీగా జనాభా ప్రాతిపదికన మండలిలో ప్రాతినిధ్యం కల్పించాలి. 'వీటో' అధికారం వద్దన్న పక్షంలో భారత్‌కు మండలి శాశ్వత సభ్యత్వం దక్కే అవకాశం ఉందన్న విద్దూర సూచన రెండేళ్ల క్రితం వెలుగు చూసింది. ఇష్టారాజ్యంగా మోకాలడ్డే అటువంటి అధికారం 'పి 5' దేశాలకు మాత్రం ఎందుకుండాలి? పంచరాజ్యాల 'వీటో' గుప్పిట సమితి, మండలి విలవిల్లాడే దుస్థితిని తుడిచిపెడుతూ మెజారిటీ సభ్యదేశాల అభిప్రాయమే చెల్లుబాటు అయ్యేలా విధివిధానాల సమూల క్షాళన ఒకటే ఐరాస ఉనికిని కాపాడగలిగేది!

# ప్రపంచం మేలుకోరి... మేల్కోవాలి!



డాక్టర్ మహేంద్రబాబు కురువ

ప్రపంచ జనాభాలో మూడింట రెండు వంతులు జి-20 దేశాల్లోనే నివసిస్తోంది. ప్రపంచ జీడీపీలో 90 శాతం ఈ దేశాల్లోనే నమోదవుతోంది. అంతర్జాతీయ వాణిజ్యంలో 80 శాతం ఈ దేశాల మధ్యనే జరుగుతోంది. అందువల్ల ఈ సదస్సు తీర్మానాలు అంతర్జాతీయ విధాన రచనను ప్రభావితం చేస్తాయి. 1997లో ఆసియా దేశాల్లో నెలకొన్న ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి ఏర్పడిన ఆర్థిక మంత్రుల వేదిక, తరవాత నాయకుల వేదికగా మారింది. 2008 ప్రపంచ ఆర్థిక సంక్షోభం అనంతరం ఈ వేదిక ఎంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక అప్పటి నుంచి జి-20 దేశాల నాయకులు ఏడాదికి ఒకసారి; ఆర్థిక మంత్రులు, కేంద్ర బ్యాంకుల గవర్నర్లు ఏడాదికి రెండుసార్లు సమావేశమవుతున్నారు. జి- 20 బృంద అధ్యక్ష పదవిని అన్ని సభ్యదేశాలూ వంతులవారీగా నిర్వహిస్తాయి. అధ్యక్ష స్థానంలో ఉన్న దేశమే ఆ ఏడాది సమావేశ అజెండాను నిర్ణయిస్తుంది. ఈ ఏడాది ఆ పదవిని నిర్వహిస్తున్న జపాన్- సముద్రాల్లో పేరుకుపోతున్న ప్లాస్టిక్, ప్రపంచంలో పెరుగుతున్న వృద్ధుల జనాభాపై చర్చకు సన్నాహాలు చేస్తోంది. ఇంకా ఇతర అంశాలూ చర్చకు రానున్నాయి. ముఖ్యంగా అమెరికా-చైనాల వాణిజ్య యుద్ధం, వెనెజ్వెలా ఆర్థిక సంక్షోభం, ప్రపంచ ఆర్థిక వ్యవస్థ మందగమనం వంటి కీలక పరిణామాలపై చర్చించనున్నది. ఇరాన్ మీద అమెరికా అధ్యక్షుడి దూకుడు, ఉత్తర కొరియా సమస్య అంతర్జాతీయంగా రాజకీయ, ఆర్థిక అనిశ్చితిని వ్యాపింపజేస్తున్నాయి. ఈ ధోరణుల వల్ల ఇటీవలి కాలంలో ప్రపంచ స్టాక్ మార్కెట్లలో వందల కోట్ల డాలర్ల మదుపరుల సంపద ఆవిరైపోయింది. ఈ ప్రతికూల పరిణామాలను ఎదుర్కోవడానికి ఒసాకా సదస్సు ప్రయత్నించనుంది. కానీ, ఆ యత్నాలు ఎంతవరకు సఫలమవుతాయో వేచి చూడాలి.

**జపాన్‌లోని ఒసాకా నగరంలో నేడు, రేపు జరగనున్న 20 దేశాల బృంద (జి-20) సదస్సు ప్రస్తుత పరిస్థితుల్లో ప్రాధాన్యం సంతరించుకొంది. ఐరోపా సమాఖ్య (ఈయూ), మరో 19 ప్రముఖ దేశాలతో ఏర్పడిన జి- 20లో అభివృద్ధి చెందిన దేశాలు, వర్ధమాన దేశాలూ ఉన్నాయి. ప్రపంచం ముందున్న ఆర్థిక సమస్యలపై అవి తరచూ చర్చించుకుంటాయి. పరస్పరం సహకరించుకుంటాయి.**



పుతిన్ డొనాల్డ్ ట్రంప్ జిన్‌పింగ్ నరేంద్ర మోదీ

### నేటి నుంచి జి-20 సదస్సు

### తరుగుతున్న పాశ్చాత్య ప్రాబల్యం

ఇటీవలి వరకు ప్రపంచీకరణకు, బహుళ సంస్కృతులు, విశ్వజనీనతకు చిహ్నాలనుకున్న పాశ్చాత్య దేశాలు క్రమంగా ఆ లక్షణాలకు దూరంగా జరుగుతున్నాయి. ప్రపంచ ప్రయోజనాలకన్నా తమ స్వప్రయోజనాలే మిన్న అని అవి అంటున్నాయి. వీటిలో కొన్ని దేశాలు గత్యంతరం లేక, మరికొన్ని దేశాలు ఉద్దేశపూర్వకంగా ఆ పథంలో నడుస్తున్నాయి. రెండో ప్రపంచ యుద్ధం ముగిసిన తరవాత పాశ్చాత్య దేశాలు ప్రపంచ నాయకత్వాన్ని చేపట్టి బాధ్యతాయుత పాత్ర నిర్వహించేవి. ఏవైనా దేశాల మధ్య వివాదాలు, ఘర్షణలు తలెత్తితే మధ్యవర్తిత్వం నెరపేవి. అమెరికా, జర్మనీ, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు చోదక శక్తులుగా నిలిచేవి. కానీ, 2000 సంవత్సరం మధ్యనాళ్ల నుంచి ఆర్థిక శక్తి క్రమంగా ఆసియా దేశాల చేతుల్లోకి వెళ్లడం ఆరంభించింది. 2008లో విరుచుకుపడిన ఆర్థిక సంక్షోభం అంతర్జాతీయ బ్యాంకింగ్, ఆర్థిక వ్యవస్థ పునాదులను కదిలించేసింది. పాశ్చాత్య దేశాల్లో ఉద్యోగాలు, వేతనాలకు కోత పెట్టింది. సంస్థల ఆదాయాలు, లాభాలను దెబ్బతీసింది. దానికి ప్రతిగా పాశ్చాత్య దేశాల్లో మితవాద జనాకర్షక నినాదాలకు, నాయకులకు గిరాకీ పెరిగింది. అమెరికాలో డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి రావడాన్ని ఈ కోణంలో చూడవచ్చు. తమ దేశ వ్యాపార ప్రయోజనాలకు మాత్రమే పట్టం కడుతూ అంతర్జాతీయ వ్యవహారాల్లో తమ పాత్రను కుదించుకుంటూ ముందుకు సాగుతున్నారాయన. ప్రపంచ దేశాలు కలసికట్టుగా ముందుకు సాగాలన్న చిరకాల విధానానికి అమెరికా స్వస్తి చెబుతుండటంతో అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక వ్యవహారాల్లో శూన్యత ఏర్పడుతోంది. దాన్ని భర్తీ చేస్తామంటూ ముందుకొస్తున్న మితవాద నాయకులు చివరకు వ్యవహారాన్ని మరింత కంగాళీ చేస్తున్నారే తప్ప సాధిస్తున్నది ఏమీ లేదు. దీనికి 'బ్రెగ్జిట్' ఒప్పందమే స్పష్టమైన ఉదాహరణ. ఐరోపా సమాఖ్య (ఈయూ) నుంచి హడావిడిగా బయటపడాలని చూసిన బ్రిటన్ ఇంటా బయటా రాజకీయ అనిశ్చితిని ఎదుర్కొంటోంది. ఆంగేలా మెర్కెల్ రాజకీయ విధానాల వల్ల ఆటుపోట్లను ఎదుర్కొంటున్న జర్మనీ సైతం ఆర్థికంగా ఒడుదొడుకులకు లోనవుతోంది. అంతర్జాతీయంగా గిరాకీ తగ్గడం వల్ల జర్మనీ మోటారు వాహనాల అమ్మకాలు క్షీణించాయి. ఐరోపా సమాఖ్య (ఈయూ) సైతం కీలకాంశాలపై రాజకీయంగా ఏకాభిప్రాయం సాధించలేకపోవడం ఆర్థికాభివృద్ధిపై ప్రతికూల ప్రభావం ప్రసరిస్తోంది. ఈ పూర్వ రంగంలో అమెరికాకు ప్రత్యామ్నాయ అగ్రరాజ్యంగా ఆవిర్భవించడానికి చైనా ప్రయత్నాలను ముమ్మరం చేస్తోంది. వీటిని పాశ్చాత్య దేశాలు వివిధ వేదికలపై అడ్డుకొంటున్నాయి. ఆర్థికంగా, సాంస్కృతికంగా, సైనికంగా అమెరికాదే ఇప్పటికీ పైచేయి. అయినప్పటికీ చైనా అన్ని రంగాల్లో ప్రాబల్య విస్తరణకు గట్టి ప్రయత్నమే మొదలుపెట్టింది. ఇరాన్, ఉత్తర కొరియా సమస్యలు అమెరికా ఆధిపత్యానికి సవాలుగా నిలుస్తూ చైనాకు కొత్త అవకాశాలు తెరచాయి. ప్రపంచ నాయకత్వం పట్ల అమెరికా నిరాసక్తత, సొంత సమస్యల్లో కూరుకుపోయిన ఐరోపా, అమెరికా రకరకాలుగా తీసుకొస్తున్న ఒత్తిళ్ల మధ్య అస్థిమితంగా ఉన్న చైనా- స్థూలంగా ఇదే ప్రస్తుత ప్రపంచ ముఖచిత్రం! ఈ అనిశ్చిత పరిస్థితుల మధ్య ఒసాకాలో జరుగుతున్న సదస్సు ఎంతో ప్రాధాన్యం సంతరించుకొంది. నేటి సంక్షోభ పరిస్థితికి ఏవైనా పరిష్కారాలు చూపుతుందా అన్న ఆసక్తి అంతర్జాతీయంగా నెలకొంది.



### సమన్వయమే కీలకం

ప్రపంచ శాంతిని కాపాడి, అంతర్జాతీయ ఆర్థిక రథాన్ని మళ్ళీ గాడిన పెట్టడానికి జి-20 సదస్సు చొరవ తీసుకుంటుందన్న ఆశాభావం వ్యక్తమవుతోంది. అవి ఫలించాలంటే సభ్య దేశాలు చేయీ చేయీ కలిపి విధానాలను రూపొందించుకోవాలి. ఆర్థికాభివృద్ధి మందగిస్తున్న దృష్ట్యా ఇది చాలా అవసరం. ప్రపంచ ఆర్థిక స్థితి అంచనా నివేదిక ప్రకారం 2019లో అంతర్జాతీయ ఆర్థికాభివృద్ధి రేటు మూడు శాతం మించదు. ప్రగతి మందగిస్తోందని ఇది రూఢి చేస్తోంది. 2017లో ప్రపంచ వృద్ధి రేటు నాలుగు శాతం కాగా, 2018 ప్రథమార్ధంలో 3.8 శాతానికీ, ద్వితీయార్ధంలో 3.2 శాతానికీ పడిపోయింది. ఇది మళ్ళీ పుంజుకోవాలంటే అంతర్జాతీయస్థాయిలో ఆర్థిక విధానాన్ని సమన్వయం చేయాలి.

### పన్నుల విధానాలపైనా చర్చలు

ఈ పరిస్థితుల్లో ప్రపంచ దేశాల మధ్య పెట్టుబడుల ప్రవాహం పెంచడానికి, విదేశీ మారక ద్రవ్య రేట్లలో అవకతవకలు జరగకుండా చూడటానికి తోడ్పడే ద్రవ్య విధానాలను అన్ని దేశాలూ రూపొందించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు చైనా తన కరెన్సీ రేటును ఉద్దేశపూర్వకంగా డాలర్ కన్నా తక్కువగా ఉంచుతున్నందునే అమెరికాకు చైనా చవకగా ఎగుమతులు చేయగలుగుతోందన్నది ట్రంప్ వాదన. దీని వల్ల చైనాతో అమెరికా వాణిజ్య లోటు అపరిమితంగా పెరిగిపోయిందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా తమ దేశంలో పరిశ్రమలు మూతబడి భారీ ఉద్యోగ నష్టానికి కారణమవుతోందని ఆయన ఆరోపిస్తున్నారు. ఇలాంటి అనుమానాలకు తావులేని ద్రవ్య విధానాలను ప్రపంచ దేశాలు అనుసరించేట్లు సదస్సు చర్యలు తీసుకోవాలి. ప్రపంచ ఆర్థికాభివృద్ధికి అవి దోహదం చేస్తాయి. పన్నుల విధానాలపైనా దృష్టి పెట్టాలి. అంతర్జాతీయంగా పెట్టుబడులు ప్రవహిస్తున్నా అవి జాతీయ స్థాయిలో నియంత్రణలకు తల ఒగ్గాల్సిందే. చట్టపరమైన నిబంధనలు, నియంత్రణలు ఒక్కో దేశంలో ఒక్కో రకంగా ఉంటాయి. దేశాల మధ్య చట్టపరమైన వ్యత్యాసాలను అంతర్జాతీయ పెట్టుబడిదారులు స్వప్రయోజనాల కోసం తెలివిగా ఉపయోగించుకొంటున్నారు. ఇది విషమ ప్రభావం ప్రసరిస్తోంది. కరెన్సీ విలువలు పడిపోవడానికీ, స్టాక్ మార్కెట్ల ఉత్థానపతనాలకూ కారణమై ఆయా దేశాల్లో ఆర్థికంగా కల్లోలం సృష్టిస్తున్నాయి. పెట్టుబడులు ఇష్టారాజ్యంగా వచ్చిపోవడం అస్థిరతను సృష్టిస్తోంది. దీన్ని కట్టడి చేసి విదేశీ పెట్టుబడుల ప్రవాహాన్ని ఆయా దేశాల్లో ఉత్పత్తి కార్యకలాపాలకు మళ్లించే పకడ్బందీ ఆర్థిక ఏర్పాట్లు చేయాలి. విదేశీ పెట్టుబడులు కేవలం స్టాక్ మార్కెట్లకు వచ్చి తక్షణ లాభాలు కళ్లజూసి వెనక్కు మళ్లిపోయే విధానం జూదం తప్ప మరొకటి కాదు. దీన్ని క్యాసినో పెట్టుబడిదారీ విధానమంటారు. ఈ అవాంఛనీయ ధోరణులపై సదస్సు దృష్టి పెట్టి నిజమైన వృద్ధికి బాట వేసే విధానాన్ని రూపొందించాలి.

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థలకు నిధుల ప్రవాహాన్ని అడ్డుకోవడానికి సమన్వయంగా పనిచేయాలి. నేడు పెట్టుబడులు ఒక దేశం నుంచి మరొక దేశానికి స్వేచ్ఛగా ప్రవహిస్తున్నాయి కానీ, కార్మికులు, నిపుణుల వలసకు మాత్రం ఆ వెసులుబాటు లేదు. పెట్టుబడులతో ఏర్పాటయ్యే పరిశ్రమలు పర్యావరణానికి ఎంత హాని చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదు. ఈ రెండు సమస్యలకూ సరైన పరిష్కారం చూపడానికి సదస్సు ప్రాధాన్యమివ్వాలి. ఏతావాతా మనకు కావలసింది బహుళ ధ్రువ ప్రపంచమే తప్ప ఏక ధ్రువ ప్రపంచం కాదు. ఏదో ఒక్క దేశమే పెత్తనం చలాయించే పరిస్థితి పోయి, అనేక దేశాలు కలసికట్టుగా విధానాలు రూపొందించుకొనే పరిస్థితి రావాలి. ఆర్థికానికి ఎల్లలు లేవని గ్రహించి అన్ని దేశాల ప్రజలు అంతర్జాతీయ వ్యాపారం ద్వారా లబ్ధి పొందడానికి తోడ్పడే విధానాలను చేపట్టాలి. 130 కోట్లకు పైగా జనాభా కలిగి, ప్రపంచంలో అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంగా విలసిల్లుతున్న భారత్- జి- 20 సదస్సులో వర్ధమాన దేశాల వాణిని వినిపించాలి. బడుగు దేశాల ప్రతినిధిగా నిలవాలి!

(రచయిత- హెచ్ఎన్‌బీ గఢ్వాల్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ డీన్)

# భయపెడుతున్న భూతాపం

ఈ ఏడాది రుతుపవనాల రాకలో జాప్యం జరగడంతో అన్నదాతలు ఆందోళనకు గురయ్యారు. ఎట్టకేలకు ఆలస్యంగానైనా వర్షాలు కురవడంతో రైతులు వ్యవసాయ పనులు ముమ్మరం చేశారు. రుతుపవనాల రాకలో జాప్యం ఈ ఏడాదికే పరిమితమైన అంశం కాదు. గతంలోనూ ఎన్నోసార్లు ఇలాంటి పరిస్థితి ఎదురైంది. కేరళ తీరాన్ని ఈనెల మొదటి వారంలో తాకిన రుతుపవనాలు వేగంగా ముందుకు కదలలేదు. ఫలితంగా వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. ఇందుకు కారణాలు లేకపోలేదు. విస్తరిస్తున్న పారిశ్రామికీకరణ, విపరీతంగా పెరిగిన శిలాజ ఇంధన వాడకం వల్ల సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. శిలాజ ఇంధన వాడకం ద్వారా వెలువడుతున్న బొగ్గు పులుసు వాయువుతో భూతాపం పెరుగుతోంది. బొగ్గు పులుసు వాయువు విడుదల పెరుగుతున్నంత కాలం ఉష్ణోగ్రత అధికమవుతుందే తప్ప తగ్గదు. అందువల్ల కర్బన ఉద్గారాలను తగ్గించాల్సిన అవసరం ఉంది. గాలిలో చేరిన 415 పీపీఎంల బొగ్గు పులుసు వాయువును 350 పీపీఎంల స్థాయికి తగ్గించనంత కాలం భూతాప విలయం తప్పదు.

### ఉష్ణోగ్రతలతో ఉక్కిరిబిక్కిరి

ఇప్పటికే సగటు ఉష్ణోగ్రత 1.1 డిగ్రీలు పెరిగింది. ఆస్ట్రేలియాకు చెందిన 'బ్రేక్ త్రు నేషనల్ సెంటర్ ఫర్ క్లైమేట్ రిస్టోరేషన్' ఈ ఏడాది మేలో వెలువరించిన నివేదిక మేరకు 2030 నాటికి సగటు ఉష్ణోగ్రత 1.6 డిగ్రీలు, 2045 నాటికి రెండు డిగ్రీలు పెరుగుతుంది. ఈ ఏడాది విపరీతమైన వేసవి ఉష్ణోగ్రతలు ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టాయి. రాజస్థాన్‌లోని 'చురు' లో ఈనెల ఒకటిన 50.8, గత నెల 16న 50.2 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. 2016 మే 19న అక్కడ 50 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంది. రాష్ట్రంలోని 'ఫలోడి' లో గత నెల 16న అత్యధికంగా 51 డిగ్రీలు నమోదయింది. ఈ ఏడాది వేసవిలో దేశమంతటా చాలా చోట్ల ఉష్ణోగ్రతలు 47 డిగ్రీల స్థాయికి చేరాయి. విపరీతమైన ఉష్ణోగ్రతలు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేశాయి. బిహార్‌లో వడదెబ్బకు తాళలేక ఒక్క రోజే 60 మందికి పైగా చనిపోయారు.

అధిక ఉష్ణోగ్రత ప్రజల జీవితాలపై ప్రభావం చూపుతోంది. అనేక సమస్యలను సృష్టిస్తోంది. ఈ వేసవిలో తాగునీటి సమస్యతో దేశంలో 43 శాతం ప్రజలు సతమతమయ్యారు. కొన్ని ప్రాంతాల్లో ప్రజలు పల్లెలను వదిలి వలస వెళ్లారు. మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో తాగడానికి నీళ్లు కూడా లేక ప్రజలు వలస పోవాల్సిన దుస్థితి నెలకొంది. భూతాపం ప్రభావంతో వడగాడ్పుల తీవ్రత పెరుగుతోంది. అక్టోబరు 2018 నాటి ఐపీసీసీ నివేదిక 1986-2015 మధ్యకాలంలో వడగాడ్పులను విశ్లేషించింది. దేశంలోని చాలా నగరాలు 2040 నాటికి వేసవిలో బయటకు అడుగు పెట్టలేని స్థితికి చేరతాయని అంచనా. పారిస్ ఒప్పందాన్ని యథాతథంగా అమలు పరచినా ఉష్ణోగ్రత రెండు డిగ్రీలు పెరిగితే కరాచీ, కోల్‌కతా నగరాల ప్రజలు తీవ్ర వడగాడ్పులకు లోనవుతారు. దేశంలో సాధారణ ఉష్ణోగ్రత ఒక్క రోజు 35 డిగ్రీలు దాటితే ఆ ఏడాది మరణాలు 0.74 శాతం పెరుగుతాయని అంచనా. అయితే అమెరికాలో మరణాలు కేవలం 0.03 శాతం మాత్రమే పెరుగుతాయని లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఏప్రిల్ 2017) అధ్యయనం పేర్కొంది. అధిక ఉష్ణోగ్రత ఫలితంగా నగరాల్లోకన్నా గ్రామీణ భారతంలో మరణాలు మూడు రెట్లు అధికమని ఈ అధ్యయనం వెల్లడించింది.



### రుతుపవనాలపైనా ప్రభావం

భూతాపంతో కరవు విస్తరిస్తోంది. ఉష్ణోగ్రత 1.5 డిగ్రీలు పెరిగితే ఏడాదిలో కరవు కాలం రెండు నెలలు, రెండు డిగ్రీలు పెరిగితే నాలుగు నెలలు ఉంటుందని 2018 నాటి ఐపీసీసీ నివేదిక పేర్కొంది. ఉష్ణోగ్రత పెరుగుదలను రెండు డిగ్రీలు దాటకుండా చేయగలిగినా పంటల దిగుబడి తగ్గి 8.4 శాతం ఆదాయం తగ్గుతుందని 2001 నాటి భారత శాస్త్రవేత్తల అధ్యయనాలు వెల్లడించాయి. 2006 నాటి పరిశోధనల ప్రకారం ఒక సెంటిగ్రేడు ఉష్ణోగ్రత పెరిగితే వరి 5.4 శాతం, గోధుమలు 8.1 శాతం, మొక్క జొన్న 10.4 శాతం, జొన్న 18 శాతం, వేరు శనగ 8.7 శాతం దిగుబడి తగ్గుతాయి. భూతాపం వల్ల 2020 నాటికి దేశంలో వర్షపాతం 'సహజ మార్పుల' దశ దాటి 'ఆకస్మిక మార్పుల' దశకు చేరుతుంది. వర్షపాతం అధికమవుతుంది. కానీ అకాల వర్షాల వల్ల అధిక పంట నష్టం జరుగుతుందని మార్చి 11, 2019 అమెరికా జాతీయ అకాడెమీ పత్రిక తెలిపింది.

అమెరికాకు చెందిన టమ్మా కార్లెటాన్ అనే మహిళా పర్యావరణవేత్త భారతీయ రైతుల ఆత్మహత్యలపై అధ్యయనం చేశారు. 47 సంవత్సరాల రైతుల ఆత్మహత్యల సమాచారం సేకరించి ఆమె విశ్లేషించారు. అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే కొద్దీ పంటల దిగుబడిపై ప్రభావం పడుతుందని ఆమె పేర్కొన్నారు. దీనివల్ల దిగుబడులు తగ్గడం రైతుల ఆత్మహత్యలకు దారితీస్తోంది. పెరుగుతున్న ఉష్ణోగ్రతల వల్ల వ్యవసాయంపై ప్రతికూల ప్రభావం పడి, రైతన్నల ఆత్మహత్యలు 6.8 శాతం పెరిగినట్లు గుర్తించారు.

భూతాపంతో ప్రభావం చూపని రంగమేదీ లేదు. 2017లో ఆర్థిక వ్యవస్థపై ఉష్ణోగ్రత ప్రభావాన్ని సోలమన్ సియాంగ్ అనే పర్యావరణవేత్త అంచనా వేశారు. భారత్, పాకిస్థాన్‌లలో సాధారణం కంటే పెరిగిన ప్రతి డిగ్రీ ఉష్ణోగ్రత ఆర్థిక వృద్ధిని ఒక శాతం తగ్గిస్తుందన్నది ఆయన అభిప్రాయం. భూతాపంతో అత్యధికంగా నష్టపోయే దేశం భారత్. అధిక ఉష్ణోగ్రతల వల్ల దక్షిణాసియాలో 80 కోట్ల ప్రజల జీవితాలు దుర్భరమవుతాయనీ, అందులో 10 కోట్ల మంది దుర్భర దారిద్ర్యానికి గురవుతారని 2018 నాటి ప్రపంచబ్యాంక్ నివేదిక వివరించింది. పేదలు మరింత పేదలవుతారని పేర్కొంది.

### విస్తరిస్తున్న ప్రజా ఉద్యమం

భూతాప వేగం విజ్ఞాన శాస్త్రానికి సైతం అందడం లేదు. కెనడా ఆర్కిటిక్ మహా సముద్ర ప్రాంతంలోని పెర్మాఫ్రాస్ట్ 2090 వరకూ కరగడం మొదలు కాదని తొలుత అంచనా వేశారు. కానీ ఈ అంచనాలు తలకిందులయ్యాయి. 70 ఏళ్ల ముందుగా ఈ ఏడాది నుంచే కరగడం ప్రారంభమైంది. గ్రీన్లాండ్‌లో మంచు కరిగే వేగం అంచనాలను మించిపోయింది. ఈ నెల 13న ఒకే రోజులో 200 కోట్ల టన్నుల మంచు కరిగింది. భూతాపం అంచనాలకు మించి పెరుగుతున్నా ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదు. పాత విధానాలకు కాలం చెల్లిందన్న విషయాన్ని అవి గ్రహించడం లేదు. సమూల మార్పులతోనే ఈ ప్రమాదాన్ని నివారించగలం. భూతాపాన్ని నివారించడానికి బ్రిటన్‌లో మొదలైన శాంతియుత ప్రజా ఉద్యమం ఇతర దేశాలకు విస్తరిస్తోంది. బ్రిటన్, ఐర్లాండ్ వాతావరణ అత్యవసర పరిస్థితిని ప్రకటించాయి. ఐరోపా సమాఖ్య దేశాలు అత్యవసర పరిస్థితి ప్రకటన దిశగా అడుగులు వేస్తున్నాయి. నానాటికీ పెరుగుతున్న భూతాపాన్ని నియంత్రించే దిశగా భారత్‌తోపాటు వివిధ దేశాలు కార్యాచరణకు ఉపక్రమించడం తక్షణ కర్తవ్యం!

- డాక్టర్ కలపాల బాబూరావు

## అందరూ ధనవంతులే...

ఈ జగత్తును నడిపించే ప్రాథమిక సూత్రం ఇవ్వడం. పంచభూతాలు అందించే శక్తి వనరులే సృష్టిలోని ప్రాణికోటికి జీవనాధారంగా నిలుస్తున్నాయి. దానాన్ని మించిన విధ్యుక్త ధర్మం లేదని మనకు కర్తవ్య బోధ చేశాయి శాస్త్రాలు.

పుణ్యం అంటే పరులకు ఉపకారం చేయడమేనని కోటి గ్రంథాల సారాన్ని ప్రవచించారు వ్యాసమహర్షి. పరులకు ఉపకారం చేయడానికే ఈ శరీరాన్ని ఇచ్చాడు భగవంతుడు. తోటివారి నుంచి మనకు ఎంత సహాయం లభిస్తుందంటే, మనం వారికి ఇచ్చినంత. చాలామందికి సందేహం కలుగుతుంది, నేను తోటివారికి ఇవ్వగలిగేంత ధనవంతుడినా అని. సృష్టికర్త మన ప్రతీ ఒక్కరి జీవితాన్ని తోటివారికి ఇవ్వగలిగేంత ధనవంతుడిగా రూపొందించాడనేది అర్థం చేసుకుంటే ఆశ్చర్యం కలగకమానదు.

తోటివారు అవసరంలో ఉన్నప్పుడు స్పందించి వస్తురూపంలో సహాయం చేయడం దానాల్లో మొదటి మార్గం. భగవంతుడి కృపతో మన వద్ద ఉన్న ధనం, ఆహారం, వస్త్రాలు, పుస్తకాలు, గృహాలు, భూమి, నీరు, రక్తం, మరెన్నో... దాన సమిధలే.

దానశీలతను తెలిపే ఘట్టాలెన్నో మనకు పురాణాల్లో, చరిత్రలో కనిపిస్తాయి. ఎన్నో రోజులు పస్తులున్న తరవాత కొంత ఆహారం లభిస్తుంది రంతిదేవుడికి. అది భుజించే సమయంలో ఒక అన్నార్తి వచ్చి ఆహారం అడిగితే, క్షుద్బాధను ఓర్చుకుంటూ తన ఆహారాన్ని దానంచేసిన రంతిదేవుడు దేవతల అనుగ్రహానికి పాత్రుడై మోక్షం పొందాడు! దాదాపు నలభై ఏళ్లు నిస్వార్థంగా పేదలకు, బాటసారులకు అన్నం పెట్టిన డొక్కా సీతమ్మ అన్నపూర్ణగా పుణ్యమూర్తిగా చరిత్రలో నిలిచారు. విద్య- వైద్యాలయాలను కట్టించడం, భూముల్ని పంచడం, బావులు, చెరువులు తవ్వించడం, చెట్లు నాటించడం, గ్రంథాలయాలను స్థాపించడం లాంటి లోక కల్యాణ కార్యక్రమాల ద్వారా మహనీయులెందరో తరతరాలకు స్ఫూర్తిగా నిలిచారు.

సమష్టి తత్వాన్ని పెంచే శ్రమదానం రెండో మార్గం. శ్రమ దానానికి ప్రత్యేకత ఉంది. కొన్ని సందర్భాల్లో డబ్బు ఉన్నా సేవలు అందని పరిస్థితి ఎదురవుతుంది. మానవ వనరులు తక్షణ అవసరం అవుతాయి. అలాంటి సందర్భాల్లో మన శక్తికొద్దీ శ్రమదానం చేయాలి. అద్భుతాలు సృష్టించగల జ్ఞాన దానం మూడో మార్గం. విద్యార్థి దశ నుంచి, జీవితంలో ప్రయోజకులుగా ఎదగడానికి మనల్ని తీర్చిదిద్దిన గురు పరంపర సంస్కృతిని మనం నిలబెట్టాలి. జ్ఞానాన్ని తోటివారితో పంచుకోవడం ఎంతో పవిత్ర కార్యం కాబట్టే గురువు దైవంతో సమానం అయ్యాడు.



అంతర్యామి

రామాయణ, మహాభారతాలను అందించిన వాల్మీకి, వ్యాసమహర్షులు, సుభాషితాలను అందించిన భర్తృహరి జ్ఞాన దానం చేయాలనే కర్తవ్యానికి ఆదర్శమూర్తులుగా నిలుస్తారు.

ఆపదవేళ ఆత్మీయుల తోడు ఎంతటివారికైనా సాంత్వన కలిగిస్తుంది. అలా సమయాన్ని కేటాయించడం నాలుగో మార్గం.

పెద్ద మనసుతో ప్రోత్సహించడం అయిదో మార్గం. తోటివారు మంచి పని చేపట్టినప్పుడు, దాని ప్రయోజకత్వాన్ని గుర్తించి ప్రోత్సహించడం విజ్ఞుల లక్షణం. కృతజ్ఞతగా ఉండటం జీవితానికి పరిపూర్ణతను ఇస్తుంది. కనీస ధర్మంగా కృతజ్ఞత కనబరచడం ఆరో మార్గం.

మనమందరం ఇంత సౌలభ్యమైన జీవితం గడుపుతున్నామంటే, తరతరాలుగా మహనీయులెందరో ఎంతో కృషిచేసి ఎన్నో ఆవిష్కరణలు అందజేసిన ఫలితమే అని మనం గ్రహించాలి. ప్రస్తుతం మనకు అందుతున్న ప్రతీ సౌకర్యానికి మనం కృతజ్ఞతా భావంతో ఉండాలి.

ఈ ఆరు మార్గాలను పరిశీలిస్తే, మనమందరం ఇవ్వగలిగేంత ధనవంతులమేనని, ఇవి సృష్టికర్త మనకు కల్పించిన మోక్షమార్గాలని అర్థం అవుతుంది. భగవంతుడు ప్రతీ మనిషిలో కోరుకునే మొదటి గుణాలు దయ, దానం. తోటివారు అవసరంలో ఉన్నప్పుడు దయాగుణంతో స్పందించి, శక్తివంచన లేకుండా ఇవ్వడమే మన జీవితానికి సార్థకత కల్పిస్తుంది!

- నరసింహరాజు కేశిపెద్ది

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

# రాష్ట్రానికి మకుటాయమానం

- సచివాలయం, శాసనసభ కొత్త భవనాల నిర్మాణంపై ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్ష
- ఘనంగా శంకుస్థాపనలు
- హాజరైన సభాపతి, మంత్రులు, ప్రజాప్రతినిధులు




సచివాలయ భవనానికి శంకుస్థాపన చేస్తున్న సీఎం కేసీఆర్ ★ ఎర్రమంజిల్‌లోని ఆర్‌అండ్‌బీ ఈఎన్‌సీ కార్యాలయంలో స్పీకర్ పోచారం, మంత్రులు కొప్పుల ఈశ్వర్, ప్రశాంత్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు కేశవరావులతో మాట్లాడుతున్న కేసీఆర్

ఈనాడు - హైదరాబాద్

కొత్త సచివాలయం, శాసనసభ భవనాలను తెలంగాణకు మకుటాయమానంగా నిలిచేలా నిర్మిస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ తెలిపారు. చక్కటి వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. సీఎం చేతుల మీదుగా గురువారం కొత్త సచివాలయం, శాసనసభ భవనాలకు ఘనంగా శంకుస్థాపనలు జరిగాయి. ఉదయం 11 గంటలకు ఆయన సచివాలయం డి-బ్లాక్ వెనుక భాగంలోని తోటలో వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య భూమిపూజ చేశారు. 30 ఎకరాల్లో ఆరు లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంతో ఈ భవన సముదాయాన్ని నిర్మించనున్నారు. రాజ్యసభ సభ్యులు కె.కేశవరావు, తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, మహమూద్‌అలీ, ఇంద్రకరణ్‌రెడ్డి, ఈటల, శ్రీనివాస్‌గౌడ్, తలసాని, ఎర్రబెల్లి, జగదీశ్‌రెడ్డి, మల్లారెడ్డి, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, డీజీపీ మహేందర్‌రెడ్డిలు పాల్గొన్నారు. అక్కడి నుంచి ఎర్రమంజిల్‌కు చేరుకున్న ఆయన 11.45 గంటలకు రోడ్లు, భవనాల శాఖ కార్యాలయం పాత భవనం దగ్గర నూతన శాసనసభ భవన నిర్మాణానికి భూమిపూజ చేయడానికి వెళ్లారు. ఇక్కడ సంప్రదాయ పద్ధతిలో శంకుస్థాపన జరిగింది. ఎర్రమంజిల్‌లోని జలసౌధ ప్రాంగణంలోని రోడ్లు, భవనాల శాఖ ఈఎన్‌సీ కార్యాలయానికి ఎదురుగా అసెంబ్లీ భవన నిర్మాణం జరగనుంది. శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, ఉపసభాపతి పద్మారావు, శాసనమండలి ఉప ఛైర్మన్ నేతి విద్యాసాగర్, మంత్రులు, విప్‌లు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

### వెంటనే టెండర్లు

సీఎం కేసీఆర్ రెండున్నరేళ్ల తర్వాత సచివాలయానికి వచ్చారు. శంకుస్థాపన అనంతరం మంత్రి ప్రశాంత్‌రెడ్డి, సీఎస్ ఎస్‌కే జోషి ఇతర అధికారులతో మాట్లాడారు. టెండర్లు, ఇతర అంశాలపై చర్చించారు. టెండర్ల ప్రక్రియను వెంటనే చేపట్టాలని ఆయన సూచించినట్లు తెలిసింది. కేశవరావు ఇతర నేతలతో సచివాలయ విస్తరణ, ఎక్కడెక్కడ ఏయే నిర్మాణాలుంటాయో వివరించినట్లు సమాచారం. శాసనసభ భవన శంకుస్థాపన వద్ద ఆయన మంత్రి ప్రశాంత్‌రెడ్డి, అధికారులతో మాట్లాడారు.

### బావా.. మన ఛాంబర్లను చూసొద్దామా!

సచివాలయంలో కొత్త భవనం భూమిపూజకు కేటీఆర్, హరీశ్‌రావులు హాజరయ్యారు. వీరిద్దరు కొద్దిసేపు మాట్లాడుకున్నారు. 'బావా.. మళ్లీ మనకు కుదరదేమో! ఒకసారి మన పాత ఛాంబర్లు చూసుకుందాం' అని హరీశ్‌తో కేటీఆర్ చమత్కరించారు. హరీశ్ నవ్వుతూ సరేనని చెప్పారు. ఇద్దరు తమ తమ ఛాంబర్లను చూసుకుని వచ్చారు. సచివాలయ సందర్శకులు, అక్కడికి వచ్చిన నాయకులు కేటీఆర్, హరీశ్‌లతో సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు.

# దిగ్దర్శకురాలి మృతిపై దిగ్భ్రాంతి

- విజయనిర్మల అంత్యక్రియలు నేడు
- కుటుంబ సభ్యులను ఓదార్చిన కేసీఆర్
- చిత్రపరిశ్రమకు తీరని లోటు :జగన్
- సినీ, రాజకీయ ప్రముఖుల నివాళి

మాదాపూర్, న్యూస్‌టుడే: తెలుగు చిత్ర పరిశ్రమలో నటిగా, దర్శకురాలిగా, నిర్మాతగా ప్రతిభ చూపిన విజయనిర్మల తిరిగిరాని లోకాలకు మరలిపోవడంతో సినీ కళామతల్లి కంట కన్నీరొలికింది. హైదరాబాద్‌లోని కాంటినెంటల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి 12.40 గంటలకు తుది శ్వాస విడవగా.. గురువారం ఉదయం 11.45 గంటలకు భౌతిక కాయాన్ని నానక్‌రాంగూడలోని ఆమె స్వగృహానికి తీసుకొచ్చారు. కడసారి చూపుకోసం సినీ ప్రముఖులు, రాజకీయ నేతలు, అభిమానులు భారీగా తరలివచ్చారు. భార్య పార్థివ దేహం చూసి ఆమె భర్త, సుప్రసిద్ధ నటుడు కృష్ణ కన్నీటి పర్యంతమయ్యారు. కుటుంబ సభ్యులు మహేశ్‌బాబు, నరేష్ శోక సంద్రంలో మునిగిపోయారు. చిలుకూరు సమీపంలోని విజయకృష్ణ గార్డెన్స్‌లో శుక్రవారం అంత్యక్రియలకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం 9గంటలకు నానక్‌రాంగూడలోని నివాసం నుంచి అంతిమ యాత్ర ప్రారంభమవుతుందని ఆమె కుమారుడు, సినీనటుడు నరేష్ తెలిపారు. ఉదయం 11.30 గంటలకు అక్కడికి చేరుకొని అంతిమ సంస్కారాలు నిర్వహిస్తామన్నారు.

### నివాళులర్పించిన సీఎం కేసీఆర్

ముఖ్యమంత్రి కేసీఆర్ విజయనిర్మల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. నటుడు కృష్ణ, కుమారుడు నరేష్‌ను ఓదార్చారు. ముఖ్యమంత్రి వెంట ఎంపీలు కేశవరావు, సంతోష్‌రావు, రంజిత్‌రెడ్డి, మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, శ్రీనివాస్ గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎమ్మెల్యేలు దానం నాగేందర్, గాంధీ, మాగంటి గోపీనాథ్, రసమయి బాలకిషన్ తదితరులు ఉన్నారు. విజయనిర్మల మృతి చిత్రపరిశ్రమకు తీరని లోటని ఏపీ ముఖ్యమంత్రి జగన్ తన సంతాప సందేశంలో పేర్కొన్నారు. సినీనటిగా, దర్శకురాలిగా విజయనిర్మల తెలుగు ఖ్యాతిని ఇనుమడింపజేశారని తెదేపా అధినేత చంద్రబాబు పేర్కొన్నారు. అమెరికా తెలుగు సంఘం తరఫున అధ్యక్షుడు పర్మేశ్ భీంరెడ్డి కూడా సంతాపం వ్యక్తం చేశారు.



విజయనిర్మల భౌతికకాయానికి నివాళులర్పించిన అనంతరం కృష్ణను ఓదారుస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్. పక్కన కోట శ్రీనివాసరావు, జమున, గల్లా అరుణకుమారి

# తెలంగాణ విత్తనాలు ప్రపంచానికి ఆధారం

- పంటకాలనీల తరహాలో విత్తన పంటకాలనీలు
- శాసనసభాపతి పోచారం, మంత్రి నిరంజన్‌రెడ్డి

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: తెలంగాణలో విత్తనాల పంట పండాలి.. ఆ విత్తనాలు ప్రపంచ పంటలకు ఆధారం కావాలని శాసనసభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. పంటకాలనీల తరహాలో విత్తన పంట కాలనీలను ఏర్పాటు చేయగలిగితే రాష్ట్రం ప్రపంచ విత్తన భాండాగారంగా ఎదగడం పెద్ద విషయం కాదనే ముఖ్యమంత్రి కేసీఆర్ ఆకాంక్షను నిజం చేయాలని పిలుపునిచ్చారు. అంతర్జాతీయ విత్తన సదస్సులో రెండోరోజైన గురువారం విత్తన రైతుల సమావేశం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించిన శాసనసభాపతి పోచారం మాట్లాడుతూ.. ప్రపంచంలో రైతులకు అండగా నిలుస్తున్న 20 అత్యుత్తమ పథకాల్లో తెలంగాణ నుంచి రైతుబంధు, రైతుబీమా పథకాలు నిలిచాయన్నారు. ఈ రెండే కాకుండా రాష్ట్రంలోని పథకాలన్నీ ఇతర రాష్ట్రాలు, దేశాలకు ఆదర్శనీయం, ఆచరణీయం అన్నారు. విత్తన సాగుపై దృష్టి సారించి, తెలంగాణ రైతు సుసంపన్నమైన రైతు కావాలని ఆకాంక్షించారు. పంటల వైవిధ్యీకరణతోనే లాభాలు వస్తాయని, విత్తన పంటల సాగే దానికి సరైన ప్రత్యామ్నాయమని వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. రైతుల ఆదాయం పెంచేందుకు రైతు సమన్వయ సమితి(రైసస)లు పనిచేయాల్సిన మార్గదర్శకాలను త్వరలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ వెల్లడిస్తారన్నారు. ప్రపంచవ్యాప్తంగా సమతుల్య ఆహారానికి పెరుగుతున్న ప్రాధాన్యం, మారుతున్న ఆహారపు అలవాట్లే మన విత్తనాల ఎగుమతికి అవకాశాలన్నారు. రసాయనాల వాడకం పెరిగిపోవడంతో మన దేశంలో సాగుచేసే పంటలను ఇతర దేశాలు నిరాకరిస్తున్నాయని, మేలైన సాగు పద్ధతులతో సమస్యను అధిగమించాలని సూచించారు.



అంతర్జాతీయ విత్తన సదస్సులో సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డిని సత్కరిస్తున్నమంత్రి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో వ్యవసాయ కార్యదర్శి

### కర్ణాటకలోనూ రైతుబంధు..

తెలంగాణలో అమలు చేస్తున్న రైతుబంధు పథకాన్ని కర్ణాటకలోనూ అమలు చేయాలని భావిస్తున్నామని సమావేశానికి హాజరైన ఆ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి శివశంకర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమానికి గౌరవ అతిథిగా హాజరైన ఆయన పూర్తిగా తెలుగులోనే ప్రసంగించి ఆకట్టుకున్నారు. సేంద్రియ పద్ధతుల్లో సాగుచేసే పంటలకు మార్కెట్‌లో ఆదరణ ఉంటుందని రైసస రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి అన్నారు. దేశానికి అవసరమైన విత్తనాల్లో 65 శాతం మన రాష్ట్రమే అందిస్తుందన్నారు.

### విత్తన రైతులకు గుర్తింపు కార్డులు..

రాష్ట్రంలో విత్తనరంగాన్ని బలోపేతం చేసేందుకు విత్తన రైతులందరికీ త్వరలోనే గుర్తింపు కార్డులు ఇవ్వనున్నట్లు వ్యవసాయశాఖ ముఖ్య కార్యదర్శి పార్థసారథి తెలిపారు. విత్తన రైతులకు సంబంధించిన పూర్తివివరాలను సేకరించి, కంప్యూటర్‌లో నిక్షిప్తం చేస్తామన్నారు. దీని ఆధారంగా గ్రామాలు, జిల్లాలు, పంటల వారీగా విత్తనాలు సాగు చేసే రైతులకు సాంకేతిక శిక్షణ అందజేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ నిర్ణయించారన్నారు. కార్యక్రమంలో ఇస్టా అధ్యక్షుడు క్రెగ్ మెక్ గిల్, వ్యవసాయశాఖ కమిషనర్ రాహుల్‌బొజ్జా, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ ఛైర్మన్ కొండబాల కోటేశ్వర్‌రావు, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఇస్టా ప్రతినిధి ఓల్గా, లండన్ విశ్వవిద్యాలయ విత్తన ప్రొఫెసర్ అలిసెన్ పావెల్, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ డైరెక్టర్ కేశవులు తదితరులు పాల్గొన్నారు.

## సచివాలయ నిర్మాణాన్ని స్వాగతించిన ఉద్యోగ సంఘాలు

ఈనాడు, హైదరాబాద్: కొత్త సచివాలయం, శాసనసభల నిర్మాణం చేపట్టడాన్ని తెలంగాణ ఉద్యోగ, అధికారుల సంఘాలు స్వాగతించాయి. టీఎన్జీవో అధ్యక్షుడు కారెం రవీందర్‌రెడ్డి, టీజీవో అధ్యక్షురాలు మమత, రెండు సంఘాల నేతలు మామిండ్ల రాజేందర్, సత్యనారాయణ, రేచల్, రవీంద్రకుమార్, తెలంగాణ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు పద్మాచారి, సచివాలయ సంఘం అధ్యక్షుడు నరేందర్‌రావు తదితరులు గురువారం జరిగిన కొత్త సచివాలయ శంకుస్థాపనలో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిసి అభినందనలు తెలిపారు.

## బీసీ బిల్లుకు మద్దతివ్వాలి

### కేంద్ర మంత్రి గహ్లోత్‌కు వినతి

ఈనాడు, దిల్లీ: రాజ్యసభలో ప్రవేశపెట్టిన బీసీ బిల్లుకు మద్దతు ఇవ్వాలని కేంద్ర సామాజిక న్యాయశాఖ మంత్రి గహ్లోత్‌కు బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రిని దిల్లీలో ఆయన గురువారం కలుసుకున్నారు. వైకాపా ఎంపీ విజయసాయిరెడ్డి ప్రవేశపెట్టిన ప్రైవేట్ మెంబర్ బిల్లుకు భాజపా మద్దతిచ్చేలా చూడాలని కోరారు. డీఎంకే, అన్నాడీఎంకే, కాంగ్రెస్, బీఎస్పీ, ఎస్పీ, బీజేడీ, ఆర్జేడీ, వైకాపాలకు చెందిన లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు 86 మందిని జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి బిల్లుకు మద్దతు ఇవ్వాలని విన్నవించారు. మంత్రిని, ఎంపీని కలిసినవారిలో కృష్ణ, నీల వెంకటేశ్, భూపేష్ సాగర్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



పెద్దిరెడ్డి, సురేశ్ రెడ్డి తదితర నేతలతో కలిసి దిల్లీలో గురువారం భాజపా కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డాను కలిసిన లక్ష్మణ్, మురళీధర్‌రావు

## తెరాస దుష్పరిపాలనకు వ్యతిరేకంగానే

- భాజపాలో చేరికలపై మురళీధర్‌రావు

ఈనాడు, దిల్లీ: తెలంగాణలో తెరాసకు పూర్తి మెజారిటీ ఉన్నా అప్రజాస్వామికంగా వ్యవహరించడం.. దుష్పరిపాలన చేస్తుండడంతోనే వివిధ పార్టీల నేతలు భాజపా దరి చేరుతున్నారని.. ఆ క్రమంలోనే భారీగా చేరికలు సాగుతున్నాయని భాజపా జాతీయ ప్రధాన కార్యదర్శి పి.మురళీధర్‌రావు అన్నారు. తెదేపా.. కాంగ్రెస్‌లకు చెందిన మాజీ మంత్రులు ఇనుగాల పెద్దిరెడ్డి, బోడ జనార్దన్, హన్మకొండ మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి, మెదక్ మాజీ ఎమ్మెల్యే పటోళ్ల శశిధర్‌రెడ్డి, పీసీసీ మైనారిటీ విభాగం మాజీ ఛైర్మన్ షేక్ రహంతుల్లా గురువారం మురళీధర్‌రావు, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి కృష్ణదాస్ సమక్షంలో భాజపాలో చేరారు. ఈ సందర్భంగా మురళీధర్‌రావు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రధాన ప్రతిపక్షంగా విఫలమవడంతోనే ప్రజలు ప్రత్యామ్నాయ శక్తిగా భాజపాను గుర్తించారన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఆయుష్మాన్ భారత్, పీఎంఏవై, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లు వేటిని తెలంగాణ ప్రభుత్వం అమలు చేయడం లేదని ఆయన ఆరోపించారు. భాజపాలో చేరినంత మాత్రాన కేసుల నుంచి రక్షణ ఉండదని ఓ ప్రశ్నకు ఆయన బదులిచ్చారు. రాజ్యసభ సభ్యుడు జి.వి.ఎల్.నరసింహారావు మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ప్రతిపక్ష నేతలు పూర్తిగా భాజపాలో చేరుతున్నారన్నారు. రాష్ట్రాన్ని కల్వకుంట్ల కుటుంబ నియంతృత్వ పాలన నుంచి విముక్తి చేసేది భాజపానేనని గుర్తించి తెదేపా, కాంగ్రెస్ నేతలు కమలం గూటికి చేరుతున్నారని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ అన్నారు. గురువారం దిల్లీలో లక్ష్మణ్ విలేకరులతో మాట్లాడారు. తెరాస నేతల్లోనూ అంతర్మథనం మొదలైందని.. వారు భాజపా వైపు చూస్తున్నారన్నారు. భాజపా ఎదుగుదలను చూసి ఓర్వలేక తెరాస భౌతిక దాడులకు తెగబడుతోందని ఆయన ఆరోపించారు. ప్రస్తుత చేరికలు ట్రైలర్ మాత్రమేనని... అసలు సినిమా ముందుందని ఆయన తెలిపారు. అనంతరం భాజపాలో చేరిన నాయకులు పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు జె.పి.నడ్డాను కలిశారు.

## పార్టీ భవిష్యత్తును ఆశించే మాట్లాడా: రాజగోపాల్‌రెడ్డి

ఈనాడు, హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ మంచి భవిష్యత్తును ఆశించే తాను అలాంటి వ్యాఖ్యలు చేశానని, వాటిని పార్టీ వ్యతిరేకమైనవిగా భావించడం సరికాదని కాంగ్రెస్ నేత, మునుగోడు శాసనసభ్యుడు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి పార్టీకి వివరణ ఇచ్చారు. టీపీసీసీ ఇచ్చిన తాఖీదుపై ఆయన క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ కోదండరెడ్డికి వివరణ పంపారు. మూడు పేజీల వివరణలో ఆయన తాను పార్టీ నాయకత్వంపై, నాయకులపై చేసిన ఆరోపణలను సమర్థించుకున్నట్లు విశ్వసనీయ సమాచారం. పార్టీ బాగుండాలనే ఉద్దేశంతో తాను నిర్మొహమాటంగా చెప్పే విషయాలలో వాస్తవమెంతో ఆలోచించి సరిదిద్దుకోకుండా.. ఏది మాట్లాడినా వ్యతిరేకంగా ఆలోచిస్తున్నారని అసంతృప్తి వ్యక్తం చేసినట్లు సమాచారం. ఎన్నికల్లో ఓటమికి నైతిక బాధ్యత వహిస్తూ ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో టీపీసీసీ అధ్యక్ష పదవికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు రాజీనామా చేయడం లేదని ప్రశ్నించడంలో తప్పేముందని ప్రశ్నించినట్లు తెలిసింది. 2018లో కూడా తాను ఇదే తరహాలో వ్యాఖ్యలు చేసినప్పుడు షోకాజ్ నోటీసులు ఇచ్చారని, దానికి వివరణ కూడా ఇచ్చానన్నారు. అప్పుడు తాను చేసిన ఆరోపణలను పార్టీ అధిష్ఠానం నిజమని విశ్వసించినందునే తనకు ఎమ్మెల్యే అభ్యర్థిగా బి ఫారం ఇచ్చిందని పేర్కొన్నారు. ఇప్పుడు అలాంటి వ్యాఖ్యలు ఎలా తప్పవుతాయని ప్రశ్నించారు. భాజపాలో చేరతానని ఇప్పటికే ప్రకటించిన రాజగోపాల్‌రెడ్డి వ్యూహాత్మకంగానే వివరణ ఇచ్చినట్లు తెలిసింది. శాసనసభ సభ్యత్వం రద్దుకాకుండానే భాజపాలో చేరాలని భావిస్తున్నారని అందుకోసమే వివరణ ఇచ్చారని కాంగ్రెస్ వర్గాలు భావిస్తున్నాయి. రాజగోపాల్‌రెడ్డి వివరణను ఏఐసీసీకి పంపిస్తామని, తదుపరి నిర్ణయం అధిష్ఠానం తీసుకుంటుందని పీసీసీ క్రమశిక్షణసంఘం ఛైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.

## విలువల పరిరక్షకులు రచయితలే

### ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు

ఈనాడు, దిల్లీ: దేశ సంస్కృతి, సంప్రదాయాలు, విలువల పరిరక్షణ బాధ్యత రచయితలు, కవులపై ఉందని ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. ఆ మేరకు విజ్ఞానవంత సమాజాన్ని రూపొందించాల్సిన కర్తవ్యం వారిదేనని, అందుకే సాహితీకృషి కొనసాగాలని ఆకాంక్షించారు. వివిధ సామాజిక అంశాలపై తాను రచించిన 101 శతకాల పుస్తకాలను కొత్తగూడెం ప్రాంతానికి చెందిన చిరుమామిళ్ల శ్రీనివాస్ గురువారం ఆయనకు అందజేశారు. ఆ సందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, తెలుగువారికి మాత్రమే సొంతమైన పద్యప్రక్రియలో పట్టు సాధించారంటూ రచయితను అభినందించారు.

## సీఎం వ్యవసాయ క్షేత్రంలో నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన

ఈనాడు, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ వ్యవసాయ క్షేత్రమైన ఎర్రవల్లిలో నూతన భవన నిర్మాణానికి గురువారం శంకుస్థాపన జరిగింది. ఉదయం తొమ్మిది గంటలకు శాస్త్రోక్తంగా వేదపండితులు భూమిపూజ నిర్వహించారు. సీఎం కేసీఆర్, సతీమణి శోభ, మనవడు హిమాన్షు పాల్గొన్నారు. వ్యవసాయ క్షేత్రంలో ప్రస్తుతం ఉన్న భవనాన్ని పడగొట్టి కొత్తగా మరో భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిసింది.

## ఇంటర్ మృతుల కోసం 6న 'భిక్షాటన'

ఈనాడు, హైదరాబాద్: పరీక్షా ఫలితాల్లో అవకతవకల కారణంగా తెలంగాణలో బలవన్మరణాలకు పాల్పడిన ఇంటర్ అభ్యర్థుల కుటుంబాలను ప్రభుత్వమే ఆర్థికంగా ఆదుకోవాలని అఖిలపక్ష సమావేశం డిమాండ్‌చేసింది. మఖ్దూం భవన్‌లో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో చాడ వెంకట్‌రెడ్డి(సీపీఐ), రావుల చంద్రశేఖరరెడ్డి(తెదేపా), వినోద్‌రెడ్డి(కాంగ్రెస్), కోదండరాం(తెజస) పాల్గొన్నారు. డిమాండ్ సాధనకు వచ్చే నెల 6వ తేదీన అన్ని పార్టీల నేతల ఆధ్వర్యంలో భిక్షాటన కార్యక్రమాన్ని చార్మినార్ నుంచి నిర్వహిస్తామన్నారు.

## పంచాయతీరాజ్ ప్రతినిధుల వేతన బకాయిలు విడుదల

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పంచాయతీరాజ్ సంస్థల ప్రతినిధులకు వేతన బకాయిలు త్వరలోనే అందనున్నాయి. ఈమేరకు జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచుల వేతన బకాయిల చెల్లింపుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ. 84.33 కోట్లను విడుదల చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజాప్రతినిధులకు గత నవంబరు నుంచి వేతనాలు నిలిచిపోయాయి. వరంగల్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ప్రజాప్రతినిధులతో ఇటీవల తెరాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలిసి బకాయిల విషయం వివరించి, వాటి విడుదలకు వినతిపత్రం సమర్పించారు. దీనిని కేటీఆర్ ముఖ్యమంత్రి కేసీఆర్, పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. సీఎం స్పందించి బకాయిల విడుదలకు ఆదేశించగా... పంచాయతీ రాజ్ శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు వేతన బకాయిల విడుదలపై ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి సీఎం కేసీఆర్, మంత్రి ఎర్రబెల్లి, కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. వేతనాల విడుదలపై జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు హర్షం వ్యక్తం చేశారు.

## 'కాళేశ్వరానికి జాతీయ హోదా ఇవ్వాలి'

ఈనాడు, దిల్లీ: తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని కాంగ్రెస్ ఎంపీ ఎంఏ ఖాన్ డిమాండ్ చేశారు. గురువారం రాజ్యసభలో ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లోని పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించారని.. ఒక్కో రాష్ట్రాన్ని ఒక్కో విధంగా చూడడం సరికాదన్నారు. తెలంగాణలో జిల్లాలు పెరిగాయని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు.

### ఆదివాసీలను కాపాడండి: సోయం బాపురావు

తెలంగాణలోని ఆదివాసీలను కాపాడాలని భాజపా ఎంపీ సోయం బాపురావు కోరారు. గురువారం లోక్‌సభ శూన్యగంటలో ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీలను అడవుల నుంచి తరిమేయాలని తెలంగాణ ప్రభుత్వం యోచిస్తోందన్నారు.

## కన్నెపల్లి పంప్‌హౌస్‌లో పంపునకు పరీక్ష

కాళేశ్వరం, న్యూస్‌టుడే: కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కన్నెపల్లి పంపుహౌస్‌లోని ఆరో పంపును మరో సారి పరీక్షించినట్లు తెలిసింది. ఈ నెల 21న ముఖ్యమంత్రి కేసీఆర్ చేతుల మీదుగా ఆరో పంపును ప్రారంభించగా గురువారం కాళేశ్వరం బ్యారేజీ ఇంజనీర్లు, సంస్థ ప్రతినిధులు మరోసారి అదే పంపును పరీక్షించినట్లు సమాచారం. అయిదు నిమిషాల పాటు నీటిని ఎత్తిపోసే విధంగా పంపును నడిపించారు. అదే విధంగా పంపుహౌస్ లోపలి భాగంలో 11 పంపులను బిగించగా, వరస క్రమంలో ఒకటి నుంచి అయిదు వరకు గల వాటికి ఒకటి రెండు రోజుల్లో పలు దఫాలుగా ట్రయల్ రన్ నిర్వహిస్తారని తెలిసింది.

## సీఎం క్యాంపు కార్యాలయానికి భూమి పూజ!

కన్నెపల్లి పంపుహౌస్ సమీపంలో ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నిర్మాణానికి కాళేశ్వరం బ్యారేజీ ఇంజనీర్లు గురువారం లాంఛనంగా భూమి పూజ నిర్వహించినట్లు తెలిసింది.

## ప్రవాహం పెరిగి... తెగిన అడ్డుకట్ట

కాళేశ్వరం, న్యూస్‌టుడే: గోదావరిలో నీటి ప్రవాహం పెరగడంతో కాళేశ్వరం ప్రాజెక్టు వెట్‌రన్ సందర్భంగా పంపుహౌస్ అప్రోచ్ కాలువ వద్ద నదిలో వేసిన తాత్కాలిక అడ్డుకట్ట తెగి నీరు దిగువకు వెళ్తోంది. కన్నెపల్లి పంపుహౌస్ పంపులకు వెట్‌రన్ నిర్వహించేందుకు గత నెలలో గోదావరి, ప్రాణహిత నదుల ప్రవాహానికి అడ్డుకట్ట వేయడంతో నేరుగా జలాలు అప్రోచ్ కాలువ, హెడ్ రెగ్యులేటర్ దాటుకుంటూ ఫోర్‌బే ద్వారా పంపుహౌస్‌లోకి వెళ్లాయి. దీంతో ఇటీవల ముఖ్యమంత్రి కేసీఆర్ పంపుహౌస్‌లోని ఆరో పంపునకు ప్రారంభోత్సవం చేయగా గోదావరి జలాలు కిలోమీటర్ దూరంలో ఉన్న డెలివరీ ఛానల్ వద్ద రెండు పైపుల ద్వారా గ్రావిటీ కాలువలోకి వెళ్లాయి. మహారాష్ట్రలో కురిసిన వర్షాలకు కొద్దిగా ప్రాణహిత నది ప్రవాహం పెరగడంతో అడ్డుకట్ట తెగింది.



గోదావరి ప్రవాహానికి అడ్డుగా వేసిన కట్ట చివరన తెగిపోవడంతో కిందకు వెళ్తున్న నీరు

## ఏ భాషనూ బలవంతంగా రుద్దం

### కేంద్రం వెల్లడి

ఈనాడు, దిల్లీ: ఏ రాష్ట్రంపై ఏ భాషను బలవంతంగా రుద్దబోమని కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ నిశాంక్ తెలిపారు. దక్షిణాది ప్రజల మనోభావాలకు విరుద్ధంగా హిందీని మూడో భాషగా రుద్దుతారా అని రాజ్యసభ సభ్యుడు టి.జి.వెంకటేశ్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు.

EDUCATION
★ ADMISSION : BVSC (VETERINARY) MBBS, ✆ 9885087123

The Institute of Chartered Accountants of India (ICAI)
Head Office: ICAI Bhawan, Indraprastha Marg, New Delhi-100002
Centre of Excellence (CoE): ICAI Bhawan, Plot No.10&11, Financial District, Nanakramguda, Gachibowli, Hyderabad-500032
Landline:040-39893989 Cell: 09515378026, Email Id:coehyd@icai.in
Notice Inviting Tender
ICAI Invites separate sealed tenders in two bid system (Technical and Financial bid) from experienced and reputed contractors for Repair and Renovation of Centre of Excellence Building at the abovementioned address. The detailed terms and conditions are available at www.icai.org and www.coeicai-hyd.com. Last date of Bid Submission is Upto 13.07.2019 at 14.00 hrs
Acting Secretary,ICAI

Eenadu epaper



అధికారులతో మాట్లాడుతున్న శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి

## పట్టాలు ఉన్న రైతుల జోలికి వెళ్లొద్దు

### అటవీ అధికారులతో సభాపతి పోచారం

**ఈనాడు, హైదరాబాద్:** పట్టాల తాలూకా అధికారిక పత్రాలు ఉన్న రైతుల జోలికి వెళ్లొద్దని శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డి అటవీ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. అడవి మధ్యలో కొందరికి రెవెన్యూ శాఖ ఇచ్చిన పట్టాలు ఉన్నాయని అధికారులు ప్రస్తావించిన సందర్భంలో ఈ మేరకు మార్గదర్శనం చేశారు. "ప్రభుత్వం, అధికారులు పత్రాలు ఇచ్చారు. ఇందులో లబ్ధిదారుల తప్పేం లేదు కదా? ఆర్‌ఓఎఫ్‌ఆర్ పత్రాలు ఉన్న రైతులను ఏమీ అనవద్దు. కొత్తగా అడవులను ఆక్రమించిన వారి విషయంలో మాత్రం అవసరమైన చర్యలు తీసుకోండి" అని స్పష్టం చేశారు. శాసన సభాపతి పోచారం శ్రీనివాస్‌రెడ్డితో గురువారం అటవీశాఖ ఉన్నతాధికారులు సమావేశమయ్యారు. జులైలో ప్రారంభమయ్యే ఐదో విడత హరితహారం, అటవీ జంతువుల రక్షణ, అటవీ భూములను కాపాడటం వంటి అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా సభాపతి అటవీ అధికారులకు పలు సూచనలు చేశారు. అడవులు తరిగిపోతుండటంతో..పర్యావరణ సమస్యలు పెరుగుతున్నాయని, నీటి ఇబ్బందులు అధికం అవుతున్నాయని, అడవి విచ్ఛిన్నం కాకుండా అరికట్టాలని ఆదేశించారు. ఎమ్మెల్యేలతో వీలైనంత త్వరగా పర్యావరణ, వన్యప్రాణుల సంరక్షణ కమిటీని ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో అటవీ సంరక్షణ ప్రధాన అధికారి(పీసీసీఎఫ్) ప్రశాంత్‌కుమార్‌ఝా, అటవీ అభివృద్ధి కార్పొరేషన్ ఎండీ రఘువీర్ తదితరులు పాల్గొన్నారు.

## రైల్వేలో కాగిత రహిత కార్యాలయాలు

### ఈ-డాస్‌తో సరికొత్త డిజిటల్ చొరవ

**ఈనాడు, హైదరాబాద్:** కాగిత రహిత కార్యాలయాల నిర్వహణ దిశలో దక్షిణమధ్య రైల్వే మరో అడుగు ముందుకు వేసింది. డిజిటల్ చొరవలో భాగంగా ఈ-డాస్ (డ్రాయింగ్ అప్రూవల్ సిస్టమ్)ను రూపొందించింది. ఎనిమిది రైల్వేజోన్లకు చెందిన ఇంజినీరింగ్ విభాగాల అధికారులతో సికింద్రాబాద్‌లోని రైల్‌నిలయంలో ప్రారంభమైన రెండురోజుల సమావేశాల్లో భాగంగా గురువారం ఈ-డాస్ బుక్‌లెట్‌ను ద.మ.రైల్వే జీఎం గజానన్ మల్యా ఆవిష్కరించారు. రైల్వే ప్రాజెక్టులకు సంబంధించిన పనులకు టెండర్లు పిలిచే క్రమంలో భాగంగా.. సరైన అంచనాల వివరాలతో డ్రాయింగ్‌ను రూపొందించడంతోపాటు, త్వరితగతిన పరిశీలించి, ఆమోదించేందుకు ఈ-డాస్ ఉపయోగపడుతుందని.. డ్రాయింగ్‌లను ఆమోదించే క్రమంలో వివిధ దశల్లో జవాబుదారీతనం కూడా పెరుగుతుందని ద.మ.రైల్వే అధికారులు ఈ సందర్భంగా వివరించారు. భారతీయ రైల్వేలోనే ఇది మొదటి డిజిటల్ చొరవని అధికారులు పేర్కొన్నారు. ఈ-ఆఫీస్, ఉమీద్, కైజాల వంటి ఆన్‌లైన్ సేవలతో పాటు తాజాగా ఈ-డాస్‌ను అందుబాటులోకి తెచ్చామని జీఎం గజానన్ మల్యా పేర్కొన్నారు.

## బాధ్యతలు చేపట్టిన టంకశాల అశోక్

తెలంగాణ ప్రభుత్వ అంతర్ రాష్ట్ర సంబంధాల నూతన సలహాదారు టంకశాల అశోక్ గురువారం సచివాలయంలో బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వం డి-బ్లాక్‌లో కార్యాలయాన్ని కేటాయించింది. బీసీ కమిషన్ ఛైర్మన్ బీఎస్ రాములు ఇతర నేతలు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.

## సోనియా, రాహుల్ క్షమాపణలు చెప్పాలి

### పీవీ మనవడు సుభాష్ డిమాండ్

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** మాజీ ప్రధాని, దివంగత పీవీ నరసింహారావు పట్ల అవమానకరంగా వ్యవహరించినందుకు కాంగ్రెస్ అధినేత్రి సోనియాగాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ క్షమాపణలు చెప్పాలని పీవీ మనవడు సుభాష్ డిమాండ్ చేశారు. పార్టీకి విధేయుడిగా ఉన్న పీవీని నెహ్రూ- గాంధీ కుటుంబం ఘోరంగా అవమానించిందని ఆరోపించారు. ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి.. పీవీపై చేసిన పలు ఆరోపణల నేపథ్యంలో సుభాష్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. అనేక సందర్భాలలో కాంగ్రెస్ పార్టీకి, నెహ్రూ- గాంధీ కుటుంబీకులకు పీవీ సలహాలు, సూచనలు ఇచ్చేవారన్నారు. కానీ కాంగ్రెస్ పార్టీ పీవీని అవమానించిందని, చివరకు ఆయన భౌతిక కాయాన్ని సైతం దిల్లీలోని పార్టీ కార్యాలయంలోపలికి అనుమతించలేదన్నారు. బాబ్రీ మసీదు కూల్చివేత వల్లే ముస్లింలు కాంగ్రెస్‌కు దూరమయ్యారని, అందుకే గాంధీ కుటుంబం పీవీని పక్కనపెట్టిందని చిన్నారెడ్డి చేసిన ఆరోపణల్లో వాస్తవం ఎంత? అని సుభాష్ ప్రశ్నించారు. బాబ్రీ కూల్చివేతతో కాంగ్రెస్‌కు ముస్లింలు దూరమైతే 2004 నుంచి 2014 వరకు పార్టీ ఎలా అధికారంలోకి వచ్చిందని నిలదీశారు. పార్టీ విజయం సాధిస్తే అది గాంధీ- నెహ్రూ కుటుంబం గొప్పతనంగా, ఓడిపోతే పీవీని కారణంగా చూపడం కాంగ్రెస్‌కు పరిపాటైందని విమర్శించారు.

## ఆ వ్యాఖ్యలకు చింతిస్తున్నా: చిన్నారెడ్డి

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** పీవీ నరసింహారావు, ప్రణబ్ ముఖర్జీలపై చేసిన ఆరోపణల విషయంలో ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి వివరణ ఇచ్చారు. పీవీ, ప్రణబ్ అంటే తనకు అపారమైన గౌరవముందన్నారు. కాంగ్రెస్ పీవీని అవమానించిందని భాజపా పదేపదే ఆరోపిస్తుందని, తమ పార్టీ విషయాలు భాజపాకు ఎందుకని ప్రశ్నించారు. పీవీ, ప్రణబ్‌లపై చేసిన వ్యాఖ్యలు పార్టీలో వివాదాస్పదం కావడంతో చిన్నారెడ్డి గురువారం ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. ఎవరినీ అవమానించాలనే ఉద్దేశం తనకు లేదని, తన వ్యాఖ్యలతో ఎవరైనా బాధ పడితే చింతిస్తున్నానన్నారు.

## పీవీపై వ్యాఖ్య బాధాకరం: దత్తాత్రేయ

**ఈనాడు, హైదరాబాద్:** మాజీ ప్రధాని-దివంగత నేత పీవీ నరసింహారావుపై ఏఐసీసీ కార్యదర్శి చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్య అనుచితం, బాధాకరం, రాజకీయ ప్రేరేపితమని కేంద్ర మాజీ మంత్రి బండారు దత్తాత్రేయ అన్నారు. ఆర్థికంగా దెబ్బతిన్న తరుణంలో సంస్కరణల ద్వారా దేశాన్ని గట్టెక్కించిన పీవీని విమర్శించడం సరికాదని గురువారం ప్రకటనలో పేర్కొన్నారు. తెలుగుబిడ్డ పీవీ మరణించినప్పుడు నాటి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీ కనీస మర్యాద ఇవ్వలేదని, పదేళ్లు కేంద్రంలో అధికారంలో ఉన్నా కనీసం స్మారక నిర్మాణమైనా ఏర్పాటుచేయలేదని ఆయన నిరసన వ్యక్తంచేశారు.

## ఏఐసీసీ అధ్యక్షుడిగా రాహులే కొనసాగాలి: మర్రి

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ(ఏఐసీసీ) అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీయే కొనసాగాలని మాజీ మంత్రి మర్రి శశిధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఎన్నికల్లో పార్టీ విజయం సాధించాలని రాహుల్‌గాంధీ విశేషంగా కృషి చేశారన్నారు. రాహుల్ ఒకవేళ అధ్యక్ష బాధ్యతల నుంచి తప్పుకుంటే ఆయన స్థానంలో ప్రియాంక గాంధీని ఏఐసీసీ అధ్యక్షురాలిగా నియమించాలని సోనియాగాంధీని కోరారు.

## తెలుగు రాష్ట్రాల్లో 3392 గ్రామాలకు చరవాణి సేవల్లేవు

**ఈనాడు, దిల్లీ:** ఆంధ్రప్రదేశ్‌లో 2745, తెలంగాణలో 647 గ్రామాలకు చరవాణి సేవలు అందుబాటులో లేవని కమ్యూనికేషన్ల శాఖ మంత్రి రవి శంకర్ ప్రసాద్ తెలిపారు. మారుమూల గ్రామాల్లో మొబైల్ సేవల లభ్యతపై రాజ్యసభ సభ్యులు టి.జి.వెంకటేశ్, ధర్మపురి శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. దశలవారీగా ఈ గ్రామాలకు సేవలు అందజేస్తామని పేర్కొన్నారు.

★ లంబసింగిలో శ్రీ అల్లూరి సీతారామరాజు, హైదరాబాద్‌లో రాంజీ గోండు పేరుతో గిరిజన మ్యూజియాలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ మంత్రి అర్జున్ ముండా తెలిపారు.

# సాగుబాట మా బిడ్డలకు వద్దు

- వారసులు వ్యవసాయంలో కొనసాగటానికి ఇష్టపడని రైతులు
- గిట్టుబాటు ధరలు లభించటంలేదని ఆవేదన
- వాతావరణ మార్పులూ అతిపెద్ద సవాలే
- గ్రామీణులకు ప్రభుత్వ రుణ పథకాలు బహుదూరం
- 59 శాతం మందికి అసలు వాటి గురించే తెలియదు
- 'గావ్ కనెక్షన్' సర్వే నివేదిక వెల్లడి

**దిల్లీ:** కరవులు, వరదలు, అతివృష్టి, అనావృష్టిలతో పోరాడుతూ పంటలు పండించే రైతన్నలకు చివరకు మిగిలేది రెక్కల కష్టం! మహా అయితే అప్పుల భారం! ఈ పరిస్థితుల్లో తరతరాలుగా జీవనాధారంగా వస్తున్న వ్యవసాయ వృత్తిలో తమ బిడ్డలను కొనసాగనివ్వబోమని రైతు కుటుంబాలు ఆవేదనతో చెబుతున్నాయి. దేశంలో దాదాపు 48 శాతం మంది వ్యవసాయదారులు ఇదే అభిప్రాయంతో ఉన్నారని గ్రామీణ సమాచార వేదికైన 'గావ్ కనెక్షన్' అనే సంస్థ తన నివేదికలో వెల్లడించింది. రైతుల కోసం ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న రాయితీ రుణ పథకాలు గ్రామీణ వ్యవసాయదారులకు పూర్తిస్థాయిలో చేరటంలేదని, దాదాపు 59 శాతం మందికి వాటి గురించిన సమాచారమే తెలియటంలేదని తెలిపింది. అప్పుల భారం, సరైన గిట్టుబాటు ధరలు రాకపోవటంతో పాటు వాతావరణ మార్పులూ తమకు ఎదురవుతున్న పెద్ద సవాళ్లని రైతులు అభిప్రాయపడ్డారు. సర్వేలో భాగంగా ఉత్తర్‌ప్రదేశ్, బిహార్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, పంజాబ్, పశ్చిమ బెంగాల్, తెలంగాణ సహా 19 రాష్ట్రాల్లో 18000 మంది గ్రామీణ రైతులను కలిసి అభిప్రాయాలను సేకరించింది. గ్రామీణుల సంపాదనలో అత్యధిక భాగం కుటుంబ వేడుకలకే ఖర్చయిపోతోందని, 10శాతం మంది మాత్రమే డబ్బు పొదుపు చేయగలుగుతున్నారని నివేదిక పేర్కొంది. మరో వారంలో కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న నేపథ్యంలో గ్రామీణ సమస్యలను ప్రతిబింబిస్తూ నివేదికను వెల్లడించింది. గ్రామీణుల మనసులో ఏముందో తెలిపే విశ్వసనీయమైన సాధనాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వద్ద లేవని, తమ సర్వే గ్రామీణుల వాస్తవ ప్రాధాన్యాలను తెలుసుకొనే యత్నం చేసిందని 'గావ్ కనెక్షన్' వ్యవస్థాపకుడు నీలేశ్ మిశ్ర తెలిపారు.



| రైతుల అభిప్రాయాలిలా.. | ఎంత మంది (శాతాల్లో) |
|---|---|
| రుణ పథకాల గురించి తెలియదు | 59 |
| రూ.50వేల లోపు రుణం తీసుకున్నవారు | 25 |
| రూ.5లక్షల లోపు రుణాలు పొందినవారు | 15 |
| రుణ భారమే పెద్ద సమస్యన్న వారు | 13 |
| వాతావరణంలో ఆకస్మిక మార్పులే పెద్ద సవాలు | 19 |
| సాగునీటిని అందిస్తే చాలా సమస్యలు తీరుతాయి | 41 |
| పంటల విక్రయ ధరలను రైతులే నిర్ణయించుకోవాలి | 62 |
| గిట్టుబాటు ధరలు సరిగాలేవు | 43.6 |
| ప్రస్తుత పంటల ధరల విధానం సంతృప్తికరమే | 30 |
| పెట్టుబడుల ఖర్చులు విపరీతంగా పెరుగుతున్నాయి | 17 |
| పెరిగిపోతున్న డీజిల్ ధరలు ఇబ్బందిపెడుతున్నాయి | 20 |
| సామాజిక మాధ్యమాలు వినియోగిస్తున్న రైతులు | 38 |
| సమాచారం కోసం ఇంటర్నెట్‌పై ఆధారపడుతున్న వారు | 30 |
| ఆండ్రాయిడ్ సెల్‌ఫోన్ లేనివారు | 15 |
| గ్రామాల్లో చేతి పంపుల ద్వారా నీరు పొందుతున్నాం | 61 |
| గొట్టపు మార్గాల ద్వారా నీటి సరఫరా | 8 |
| నీటి కోసం సగటున అర కిలోమీటరు నడుస్తున్నామని ప్రతి ముగ్గురు మహిళల్లో ఒకరు తెలిపారు | |
| వైద్యం కోసం ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లేవారు | 44% |
| ప్రైవేటు డాక్టర్‌ను ఆశ్రయించేవారు | 36% |
| పోలీసుల విధులపై సంతృప్తి చెందినవారు | 35 |
| పోలీసులు అధికార దుర్వినియోగానికి పాల్పడుతున్నారని అన్నవారు | 26.1 |



# 'జోసా' తొలి విడత సీట్ల కేటాయింపు

- ప్రథమ ర్యాంకర్ ముంబయి.. రెండో ర్యాంకర్ దిల్లీ
- హైదరాబాద్ ఐఐటీలో బీటెక్ 'కృత్రిమ మేధ'కు డిమాండ్

**ఈనాడు, హైదరాబాద్:** జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మొదటి ర్యాంకు పొందిన మహారాష్ట్రకు చెందిన విద్యార్థి గుప్తా కార్తికేయ ఐఐటీ ముంబయిలో; యూపీలోని అలహాబాద్‌కు చెందిన 2వ ర్యాంకర్ చంద్రేష్ ఐఐటీ దిల్లీలోని కంప్యూటర్ సైన్స్ ఇంజినీరింగ్‌లో సీట్లు సాధించారు. ఏటా మాదిరిగానే ఈసారి కూడా ఉత్తమ ర్యాంకర్లు అధికంగా ఐఐటీ ముంబయిలోనే ప్రవేశం పొందారు. దాదాపు అన్ని ఐఐటీల్లో ఉత్తమ ర్యాంకర్లు కంప్యూటర్ సైన్స్‌కే ప్రాధాన్యమిచ్చారు. ఏ ఐఐటీలో, ఏ కోర్సులో ప్రారంభ, ముగింపు ర్యాంకులను చూసినా స్పష్టమయ్యే అంశం అదే. జాయింట్ సీట్ అలొకేషన్ అథారిటీ(జోసా).. మొదటి విడత సీట్లను గురువారం కేటాయించింది. జేఈఈ మెయిన్, అడ్వాన్స్‌డ్ ర్యాంకుల ఆధారంగా దేశవ్యాప్తంగా 107 విద్యాసంస్థల్లో ప్రవేశం పొందేందుకు కౌన్సెలింగ్ నిర్వహించారు. వాటిల్లో 23 ఐఐటీలు, 31 ఎన్ఐటీలు, 25 ట్రిపుల్ ఐటీలతో పాటు 28 కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో నడిచే సంస్థలు(జీఎఫ్‌టీఐ) ఉన్నాయి. ఈ విద్యాసంవత్సరమే ఐఐటీ హైదరాబాద్.. బీటెక్‌లో దేశంలోనే తొలిసారి కృత్రిమ మేధ కోర్సు ప్రారంభించింది. మొత్తం 21 సీట్లు ఉన్నాయి. ఈ కోర్సులో 478 నుంచి 657 ర్యాంకుతో జనరల్ కేటగిరీ సీట్లు భర్తీ అయ్యాయి. కంప్యూటర్ సైన్స్ తర్వాత ఉత్తమ ర్యాంకర్లు ఈ కోర్సునే ఎంచుకున్నారు. మరో 6 విడతల కౌన్సెలింగ్ జరగనుంది.

### 'సర్కారు' విద్యార్థినికి ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చేసిన ఎస్.పవిత్ర ఐఐటీ ధన్‌బాద్‌లో సీటు పొందారు. ఎటువంటి కోచింగ్ లేకుండా.. అధ్యాపకుల బోధన, స్వయంకృషితో ఆమె ఎస్సీ విభాగంలో 2954 ర్యాంకు సాధించారు. జోసా గురువారం కేటాయించిన సీట్లలో ఆమెకు ధన్‌బాద్‌లోని బీటెక్ మైనింగ్ ఇంజినీరింగ్ బ్రాంచీలో సీటు దక్కింది. ఆమెను తెలంగాణ ప్రభుత్వ జూనియర్ అధ్యాపకుల సంఘం అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి అభినందించారు.

**కొన్ని ఐఐటీల్లో సీఎస్ఈకి ప్రారంభ, ముగింపు ర్యాంకు (జనరల్ కేటగిరీ)**

| ఐఐటీ | ప్రారంభ ర్యాంకు | ముగింపు ర్యాంకు |
|---|---|---|
| ముంబయి | 1 | 63 |
| దిల్లీ | 2 | 93 |
| మద్రాస్ | 90 | 188 |
| హైదరాబాద్ | 203 | 603 |
| తిరుపతి | 2741 | 3367 |

## కాంగ్రెస్‌లో 'విధేయుల ఫోరం'

### సీనియర్ నేతల నిర్ణయం

**హైదరాబాద్, న్యూస్‌టుడే:** కాంగ్రెస్‌లో పార్టీ విధేయుల ఫోరం ఏర్పాటు చేయాలని సీనియర్ నేతలు నిర్ణయించారు. గురువారం నిజాం క్లబ్‌లో సీనియర్ నేతలు వీహెచ్, మర్రి శశిధర్‌రెడ్డి, ఎం.కోదండరెడ్డి, సంభాని చంద్రశేఖర్, శ్యామోహన్, కమలాకర్‌రావు, జి.నిరంజన్ తదితరులు ప్రత్యేకంగా భేటీ అయ్యారు. తాజా రాజకీయ పరిస్థితులు, వలసలు తదితర అంశాలపై చర్చించారు. ప్రధానంగా కాంగ్రెస్‌లో నెలకొన్న తాజా పరిస్థితుల కారణంగా పార్టీ శ్రేణులు ఆత్మస్థైర్యం కోల్పోయాయని, వారిలో తిరిగి ఆత్మవిశ్వాసం నింపాలంటే ఏం చేయాలనే అంశం చర్చకు వచ్చింది. తెరాస, భాజపాలను సమర్థంగా ఎదుర్కొనేలా పార్టీని బలోపేతం చేయాలని నిర్ణయించారు. అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల సందర్భంగా సీనియర్లను విస్మరించి, కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్లు ఇచ్చారని, విధేయులుగా పని చేస్తున్న వారికి తగిన గుర్తింపు లభించడం లేదని నేతలు ఆవేదనకు గురైనట్లు తెలిసింది. పార్టీకి విధేయులుగా ఉన్నవారితో మరో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. త్వరలోనే విధేయుల ఫోరం ఏర్పాటు చేస్తామని సమావేశంలో పాల్గొన్న నాయకుడొకరు తెలిపారు.

## ఏఎఫ్‌ఆర్‌సీ ఛైర్మన్‌గా మళ్లీ జస్టిస్ స్వరూప్‌రెడ్డి

- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
- ఇతర సభ్యుల నియామకం

**ఈనాడు, హైదరాబాద్:** తెలంగాణ ప్రవేశాలు, రుసుముల నియంత్రణ కమిటీ(టీఏఎఫ్‌ఆర్‌సీ) ఛైర్మన్‌గా జస్టిస్ పి.స్వరూప్‌రెడ్డి మళ్లీ నియమితులయ్యారు. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్ రెడ్డి గురువారం జీవో జారీ చేసినట్లు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య తుమ్మల పాపిరెడ్డి తెలిపారు. ఈ కమిటీలో మరో 10 మంది సభ్యులు ఉంటారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి అయిన స్వరూప్‌రెడ్డి 2015 జులై 22 నుంచి 2018 జులై 21వ తేదీ వరకు మూడేళ్లపాటు ఈ కమిటీ ఛైర్మన్‌గా పనిచేశారు. ఆయన పదవీకాలం ముగిసిన నాటి నుంచి ఛైర్మన్ పదవి ఖాళీగా ఉంది.

### సభ్యులు వీరే...

1. ఆచార్య మంజూర్ హుస్సేన్(జేఎన్‌టీయూ, సాంకేతిక విద్య నిపుణుడు) 2.డాక్టర్ విమలా థామస్(గాంధీ ఆసుపత్రి, వైద్య విద్య నిపుణురాలు) 3. జీవీ లక్ష్మణ్‌రావు(ఆర్థిక నిపుణుడు), 4.కె.రవీందర్ రెడ్డి(న్యాయ నిపుణుడు) 5. జేఎన్‌టీయూహెచ్/ఓయూ/కాళోజీ వైద్య విశ్వవిద్యాలయాల ఉపకులపతులు 6. రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రతినిధి 7. తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్, 8. ఏఐసీటీఈ/ఎంసీఐ/బీసీఐ ప్రతినిధి 9. ఛైర్మన్ ఆహ్వానం మేరకు ప్రత్యేక ఆహ్వానితుడు 10. విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శులు

### గందరగోళం నేపథ్యంలో...

వచ్చే మూడు సంవత్సరాలకు ఇంజినీరింగ్, మెడికల్, ఎంబీఏ, బీఈడీ, లా, ఫార్మసీ తదితర వృత్తి విద్యా కోర్సులకు వార్షిక రుసుములను నిర్ణయించాల్సి ఉండటం... పలు కళాశాలలు హైకోర్టును ఆశ్రయించడం... ఫీజుల వ్యవహారం గందరగోళంగా మారిన నేపథ్యంలో ప్రభుత్వం మళ్లీ స్వరూప్‌రెడ్డిని ఛైర్మన్‌గా నియమించింది. ప్రైవేటు ఇంజినీరింగ్ కళాశాలలు ప్రతిపాదించిన రుసుములను విద్యార్థుల నుంచి వసూలు చేసుకోవచ్చని హైకోర్టు తీర్పునిచ్చిన నేపథ్యంలో డివిజన్ బెంచ్‌కు అప్పీల్‌కు వెళ్లాలని నిర్ణయించిన క్రమంలో ఈ నియామకం జరిగినట్లు భావిస్తున్నారు. ఉత్తర్వుల్లో ఎక్కడా పదవీకాలం ఎంతన్నది పేర్కొనకపోవడం గమనార్హం.

# బాల నేరస్థుడికి జీవితఖైదు

- బాలుడిపై హత్యాచారం కేసులో సంచలన తీర్పు
- దేశంలో తొలిసారి అని పోలీసుల వెల్లడి

**కేశవగిరి, న్యూస్‌టుడే:** ఆడుకుందామని పిలిచి పదేళ్ల బాలుడిపై లైంగిక దాడికి పాల్పడడంతోపాటు దారుణంగా హతమార్చిన బాల నేరస్థుడికి న్యాయస్థానం జీవితఖైదు విధించింది. ఈ మేరకు నాంపల్లిలోని మొదటి అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి, పోక్సో ట్రయల్ కేసుల ప్రత్యేక న్యాయమూర్తి కుంచల సునీత గురువారం తీర్పు వెలువరించారు. పోక్సో చట్టం కింద నమోదైన కేసులో జీవిత ఖైదు (కఠిన కారాగార శిక్ష), రూ.1000 జరిమానా, ఐపీసీ 364 సెక్షన్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా, 377 సెక్షన్‌కు పదేళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.1000 జరిమానా, 302 సెక్షన్‌కు జీవితఖైదు, రూ.1000 జరిమానా, 201 సెక్షన్‌కు 7 ఏళ్ల కఠిన కారాగారశిక్ష, రూ.1000 జరిమానా విధించారు. లైంగిక దాడి, హత్య కేసులో బాల నేరస్థుడికి జీవితఖైదు విధిస్తూ తీర్పు ఇవ్వడం దేశంలో తొలిసారి అని పోలీసులు తెలిపారు. కేసును విచారించిన అప్పటి ఏసీపీ సయ్యద్ ఫయాజ్‌కు నగర పోలీసు కమిషనర్ అంజనీకుమార్ రూ.20 వేల రివార్డు ప్రకటించారు. కేసును పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజేశ్వర్‌రావు వాదించారు.



ప్రభుత్వ పాఠశాల భవనంపై హత్య జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న అధికారులు (పాతచిత్రం)

### ఆడుకోవడానికి వెళ్లి అంతమైన బాలుడు

చాంద్రాయణగుట్ట పోలీసుస్టేషన్ పరిధి బార్కస్ బడీ మసీదు ప్రాంతంలో నివసించే 4వ తరగతి చదివే బాలుడు 2017 జూన్ 28న ఆడుకోవడానికి వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. చుట్టుపక్కల గాలించినా ఆచూకీ లభ్యం కాకపోవడంతో తల్లిదండ్రులు మరసటిరోజు చాంద్రాయణగుట్ట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ కేసును సవాలుగా తీసుకున్న పోలీసులు సుమారు వంద సీసీ కెమెరాలను జల్లెడ పట్టారు. చివరకు ఏడో రోజు బార్కస్ బడీమసీదు వద్ద ఉన్న సీసీ కెమెరాలో ఓ కుర్రాడితో బాలుడు వెళ్లినట్లు గుర్తించారు. అతన్ని విచారించగా దారుణం బయట పడింది. "ఆడుకుందామంటూ బాలుడిని పిలిచిన నిందితుడు(అప్పుడు 17 ఏళ్లు) సమీపంలోని కులీకుతుబ్‌షా ప్రభుత్వ ఉన్నత పాఠశాల భవనంపైకి తీసుకెళ్లాడు. భయపెట్టి లైంగిక దాడికి పాల్పడ్డాడు. రూ.50 ఇస్తానని చెప్పినా బాలుడు ఏడుపు మానకపోవడం, విషయాన్ని తండ్రికి చెబుతానని చెప్పడంతో ఆందోళనకు గురయ్యాడు. మరో నాలుగు రోజుల్లో సోదరి పెళ్లి ఉండడం, విషయం బయటపడితే పరువు పోతుందని భావించి అతన్ని హతమార్చాలనే నిర్ణయానికొచ్చాడు. చొక్కా, తాళ్లతో బాలుడి చేతులు, కాళ్లు విరిచికట్టి..సిమెంటు పైపుతో తలపై విచక్షణ రహితంగా కొట్టి హతమార్చి వెళ్లిపోయాడు". తన సోదరి పెళ్లి జరిగిన రోజున నిందితుడు బాలుడి తల్లిదండ్రులకు బిర్యానీ ఇచ్చి మరీ వారిని ఓదార్చాడు. ఈ ఉదంతం అప్పట్లో సంచలనమైంది. చరవాణుల్లో అశ్లీల చిత్రాలను చూసి ఉన్మాదిగా మారిన నిందితుడు మరికొంత మంది బాలురపైనా లైంగిక దాడికి పాల్పడినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. రెండేళ్ల పాటు కొనసాగిన విచారణ అనంతరం న్యాయమూర్తి నిందితుడికి శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు.

## వచ్చే నెలాఖరుకు ఓడీఎఫ్ రాష్ట్రంగా తెలంగాణ

### 'స్వచ్ఛ భారత్' స్వీకర్తకు సీఎస్ ప్రశంస

**ఈనాడు డిజిటల్, హైదరాబాద్:** రానున్న జులై చివరినాటికి బహిరంగ మలవిసర్జన రహిత (ఓడీఎఫ్) రాష్ట్రంగా తెలంగాణను ప్రకటించుకుంటామని రాష్ట్రప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి తెలిపారు. స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) పథకంలో భాగంగా గత జనవరిలో నిర్వహించిన 'స్వచ్ఛ సుందర్ శౌచాలయ' పోటీలో రాష్ట్రం ఐదు పురస్కారాలు కైవసం చేసుకోవడం విదితమే. ఈ సందర్భంగా సచివాలయంలో అవార్డు స్వీకర్త- రాష్ట్ర మిషన్ ప్రాజెక్టు డైరెక్టర్ నీతూకుమారి ప్రసాద్‌ను సీఎస్ అభినందించారు. 32 జిల్లాలకుగాను ఇప్పటిదాకా 16 జిల్లాలను ఓడీఎఫ్‌గా ప్రకటించామన్నారు.

## దభోల్కర్‌ను కాల్చింది నేనే: కలాస్కర్

**బెంగళూరు:** ప్రముఖ హేతువాది నరేంద్ర దభోల్కర్‌ను తాను తల వెనుక ఒకసారి, కంటిపైన మరోసారి కాల్చానని ఆయన హత్యకేసులో ప్రధాన నిందితుడు శరద్ కలాస్కర్ కర్ణాటక పోలీసుల వద్ద ఒప్పుకొన్నాడు. మరో హేతువాది గోవింద్ పన్సారే, పాత్రికేయురాలు గౌరీ లంకేశ్‌ల హత్యలతోనూ తనకు సంబంధం ఉందని అతడు అంగీకరించాడు. పాల్ఘర్ జిల్లాలో తుపాకుల తయారీ కేంద్రంతో సంబంధం ఉందని మహారాష్ట్ర ఉగ్రవాద నిరోధక బృందం (ఏటీఎస్) గత నవంబరులో కలాస్కర్‌ను అరెస్టుచేసింది. విచారణలో అతడు వెల్లడించిన వివరాలు చూసి పోలీసులే నివ్వెరపోయారు. వీరేంద్ర తావ్డే అనే వ్యక్తి తనకు శిక్షణ ఇచ్చి హత్యలు చేయించినట్లు కలాస్కర్ చెప్పాడు. తావ్డేను సీబీఐ ఇప్పటికే అరెస్టుచేసింది.

## 11 మంది విద్యార్థుల మృతి

### జమ్మూకశ్మీర్‌లో ఘోర ప్రమాదం

**శ్రీనగర్:** వాళ్లంతా కంప్యూటర్ కోర్సులో శిక్షణ తీసుకుని ఇళ్లకు తిరిగి వస్తున్నారు. మరికాసేపు ఉంటే గమ్యస్థానాలకు చేరుకునేవారే. అంతలో వారు ప్రయాణిస్తున్న మినీబస్సు లోయలో పడిపోయింది. అందులో ఉన్న 9 మంది బాలికలు సహా 11 మంది మరణించారు. మరో ఏడుగురు విద్యార్థులు గాయపడ్డారు. ఈ దారుణ ఘటన జమ్మూకశ్మీర్‌లోని షోపియాన్ జిల్లాలో గురువారం జరిగింది. పూంఛ్‌లోని కంప్యూటర్ శిక్షణ సంస్థ నుంచి విద్యార్థులతో వెళ్తున్న ఈ బస్సు మొఘల్ రోడ్డులోని పీర్ కీ గలీ వద్ద అదుపుతప్పి లోయలో పడిపోయింది. విద్యార్థుల మృతిపట్ల జమ్మూకశ్మీర్ గవర్నర్ సత్యపాల్ మాలిక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వాళ్ల కుటుంబాలకు రూ. 5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.

## స్విస్ బ్యాంకుల్లో తగ్గిన భారతీయుల సొమ్ము

**జ్యూరిక్/దిల్లీ:** స్విస్ బ్యాంకుల్లో భారతీయులు, భారత్ కేంద్రంగా పనిచేస్తున్న శాఖలు సహా మన దేశ సంస్థలు దాచిన డబ్బు గత ఏడాది 6 శాతం మేర తగ్గింది. రెండు దశాబ్దాల్లో ఇది రెండో భారీ తగ్గుదలని స్విస్ నేషనల్ బ్యాంకు (ఎస్ఎన్‌బీ) తాజాగా విడుదల చేసిన గణాంకాలు చెబుతున్నాయి. స్విస్ బ్యాంకుల్లో మొత్తం విదేశీయులు దాచిన సొమ్ము కూడా 4 శాతం మేర తగ్గింది.

- గత ఏడాది భారతీయులు దాచిన సొమ్ము రూ. 6,757 కోట్లుగా ఉంది. విదేశీయులందరి సొమ్ము రూ.99 లక్షల కోట్లు.
- ఇవన్నీ బ్యాంకులు నివేదించిన అధికారిక గణాంకాలు. భారతీయులు దాచుకున్న నల్లధనం పరిమాణాన్ని ఇది సూచించడంలేదు. భారతీయులు, ఎన్నారైలు... వివిధ దేశాల్లోని సంస్థల పేరుతో స్విస్ బ్యాంకుల్లో దాచిన సొమ్ము ఇందులో లేదు.

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu



మా చిరునామా: రయ్ రయ్..
ఈనాడు ప్రధాన కార్యాలయం,
రామోజీ ఫిల్మ్‌సిటీ,
హైదరాబాద్ - 501512

autopage@eenadu.in

**పొగబారిన ప్రయాణం స్వచ్ఛమైపోవాలి...**
**శబ్ద కాలుష్యానికి నిశ్శబ్దంగా చెక్ పెట్టేయాలి...**
**పర్యావరణహితమూ కోరుకోవాలి...**
**ఇలా.. అందరి ఆశలు నెరవేర్చే మార్గం ఎలక్ట్రిక్ వాహనాలు...**
**దీనికి ప్రభుత్వ ప్రోత్సాహం ఇంధనంలా పని చేస్తోంది...**
**ఈ ఊపులో బ్యాటరీ వాహనాల వాడకం పెరిగిపోతోంది...**
**అందులోనూ ఈ-స్కూటర్లు అధికసంఖ్యలో అందుబాటులోకి వచ్చేశాయి...**
**వాటిలో మేటివేంటి? బండి కొనేముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి?**

బ్యాటరీ వాహనాల మొదటి లక్ష్యం కాలుష్య నివారణ, ఇంధన, నిర్వహణ ఖర్చులు తగ్గించడం. తయారీదారులు దీనికే పరిమితం కావడం లేదు. స్టైలిష్ డిజైన్లతో ఆకట్టుకుంటున్నారు. సంప్రదాయ ఇంధనాలతో నడిచే స్కూటీలకు దీటుగా ఫీచర్లు అందిస్తున్నారు. ప్రయాణానికి అనువుగా ఉంటే చాలనుకునే దశ నుంచి చూడగానే నచ్చేసే స్థాయికి తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నారు. ఇన్‌బిల్ట్ నావిగేషన్, స్మార్ట్‌ఫోన్‌తో అనుసంధానం చేసుకునే వెసులుబాటు, కస్టమైజ్డ్ రైడింగ్ మోడ్‌లు, చోరీకి గురైనా ఎక్కడుందో తెలుసుకునే టెక్నాలజీ, డిజిటల్ కన్సోల్.. ఇలా ఎన్నో హంగులు అద్దుతున్నారు. బ్యాటరీ వాహనాల ఛార్జింగ్ కష్టాలు తీర్చడానికి కొన్ని కంపెనీలైతే ఎంపిక చేసిన నగరాల్లో ఏకంగా ఛార్జింగ్ పాయింట్లే ప్రారంభిస్తున్నాయి. ఇన్ని సానుకూలతలుంటే ఈ- పరుగు ఆగుతుందా?

# రహదారిపై విద్యుల్లతలు

ప్రమాదాల్లో ప్రాణాలు కాపాడే ఎయిర్‌బ్యాగ్‌లు.. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే మనల్ని తీవ్ర ఇబ్బందులపాలు చేస్తాయి. ఒక్కోసారి వీటితో ప్రాణాపాయం కూడా! ఆపదల్లో ఆదుకునే ఈ రక్షణ కవచాలు ప్రతికూలంగా మారకుండా ఏం చేయాలంటే..

**స్టీరింగ్‌కి దూరంగా:** కొంతమంది వాహనాలు నడిపేటప్పుడు స్టీరింగ్‌కు దగ్గరగా వంగి ఉంటారు. ఇది ప్రమాదకరం. వాహన చోదకుడికి, స్టీరింగ్‌కు మధ్య కనీసం పది నుంచి పన్నెండు సెంటీ మీటర్ల దూరం ఉండాలి. ప్రమాదం జరిగినప్పుడు ఎయిర్‌బ్యాగ్ సెకనులో నలభయ్యో వంతు వేగంతో తెరుచుకుంటుంది. ఒకరకంగా దీన్ని విస్ఫోటం అనొచ్చు. ఆ సమయంలో ఎనిమిది నుంచి తొమ్మిది సెంటీమీటర్లు వ్యాకోచిస్తుంది. స్టీరింగ్‌కి దగ్గరగా ఉంటే ముఖం, మెడ, ఛాతీ భాగాలకు తీవ్ర గాయాలవుతాయి. ఒక్కోసారి ఊపిరాడక మరణం సంభవించవచ్చు.

**సీటుబెల్టు తప్పదు:** వాహనం నడిపే వ్యక్తి రోడ్డును, ఎదురుగా వచ్చే వాహనాలను గమనిస్తూ అప్రమత్తంగా ఉంటాడు. పక్కసీటు ప్యాసింజర్ మాత్రం పరాకుగా ఉంటాడు. అనుకోని ప్రమాదం జరిగినపుడు ప్యాసింజర్ డాష్‌బోర్డుకు ఢీకొట్టుకుంటాడు. అదే సమయంలో ఎయిర్‌బ్యాగ్ వేగంగా తెరుచుకుంటుంది. దీంతో ఆ వ్యక్తి ఏకకాలంలో రెండు వ్యతిరేక బలాలకు లోనై తీవ్ర గాయాలపాలయ్యే అవకాశముంది. డ్రైవర్‌తో పాటు ప్యాసింజరూ సీటు బెల్టు కచ్చితంగా పెట్టుకోవాలి.

## ఎయిర్‌బ్యాగ్.. ప్రాణం తీయొచ్చు!



**విశ్రాంతి అశాంతి:** విశ్రాంతి కోసం కొందరు డాష్‌బోర్డ్‌పై కాళ్లు పెడుతుంటారు. ఈ సమయంలో ఏదైనా ప్రమాదం జరిగి ఎయిర్‌బ్యాగ్‌లు తెరుచుకుంటే అవి వేగంగా కాళ్లను ఢీకొంటాయి. మడమలు, మోకాళ్లు, తుంటి ఎముక, వెన్నెముకపై తీవ్ర ప్రభావం పడుతుంది. కొన్ని కార్లలో ఎయిర్‌బ్యాగ్‌లు సీటు పక్కభాగాల్లో ఉంటాయి. ఇలాంటి సీట్లకు కవర్లు వేయొద్దు. అలాచేస్తే ప్రమాద సమయంలో అవి తెరుచుకోవు.

**పిల్లలతో బహుపరాక్:** డ్రైవర్ పక్కన కూర్చున్నవారు పిల్లల్ని డాష్‌బోర్డు ముందు నిల్చోబెడుతుంటారు లేదా ఒళ్లో కూర్చోబెట్టుకుంటారు. అదేసమయంలో ఏదైనా దుర్ఘటన జరిగి ఎయిర్‌బ్యాగ్ వేగంగా తెరుచుకుంటే పిల్లలకు గాయాలయ్యే అవకాశం ఉంది. కారు వెనక సీటులో కూర్చోబెడితే ఇలాంటి ప్రమాదాలను నివారించవచ్చు. చిన్నారుల కోసం మార్కెట్లో దొరికే బేబీ సీట్లను కొని అమర్చుకోవాలి. సీటుబెల్టులు ధరించాలి.

### ఇలా పని చేస్తుంది

ఎయిర్‌బ్యాగ్‌లో ఎసిలిరోమీటరు, ఇన్‌ఫిలేటర్, ఎయిర్‌బ్యాగ్ కంపార్ట్‌మెంట్ అనే మూడు భాగాలుంటాయి. ఎసిలిరోమీటరులో ఒక గుండ్రటి బంతి ఉంటుంది. ఇది కారు గమనానికి అనుగుణంగా అటూఇటూ ఊగుతుంటుంది. దీన్ని ఓ అయస్కాంతం కదుపుతూ ఉంటుంది. కారు దేన్నైనా ఢీకొన్నప్పుడు ఎసిలిరోమీటరులో ఉన్న గుండ్రటి బంతి దగ్గరల్లో ఉన్న రెండు పిన్నులను కలుపుతుంది. అంటే ఆఫ్‌లో ఉన్న స్విచ్ ఆన్ అవుతుందన్నమాట. స్విచ్ఛాన్ కాగానే ఇన్‌ఫిలేటర్ చిన్న నిప్పురవ్వను విడుదల చేస్తుంది. వెంటనే కంపార్ట్‌మెంట్‌లో ఉండే పేలుడు రసాయనం మండిపోయి వాయువుగా మారుతుంది. ఇది ఎయిర్‌బ్యాగ్ అంతా నిండి మనకు రక్షణ కల్పిస్తుంది. ఇదంతా రెప్పపాటులోనే జరుగుతుంది.

-ఎం.డి.దస్తగిర్

### ఇవి టాప్

ప్రస్తుతం మార్కెట్లో పదుల సంఖ్యలో ఈ-స్కూటర్లు అందుబాటులో ఉన్నాయి. అందులో అత్యధికంగా అమ్ముడవుతున్నవీ, మంచి ఫీచర్లున్నవి కొన్ని.

### ఆథర్ 450

ధర: రూ.1.24లక్షలు



మార్కెట్లో లభ్యమవుతున్న మంచి సామర్థ్యం ఉన్న ఎలక్ట్రిక్ స్కూటర్లలో ఇదొకటి. స్టైలిష్ డిజైన్‌తోపాటు చెప్పుకోదగ్గ ఫీచర్లెన్నో ఉన్నాయి. 2.4కిలోవాట్ల లిథియం-అయాన్ బ్యాటరీతో పని చేస్తుంది. ఒక్కసారి ఛార్జింగ్ చేస్తే 75కిలోమీటర్ల వరకు ప్రయాణించొచ్చు. టాప్ స్పీడ్ 80కిమీ/గంటకి. నాలుగు సెకన్లలో నలభై కిలోమీటర్ల వేగం అందుకుంటుంది.

### ట్వంటీ టూ ఫ్లో

ధర: రూ.75 వేలు



కిమ్‌కో-ట్వంటీ టూ కంపెనీ సంయుక్త భాగస్వామ్యంతో ఈ స్కూటర్ తయారు చేశారు. ఛార్జింగ్ పాయింట్లలో బ్యాటరీలు మార్చుకోగల వెసులుబాటు ఉండటం ఈ బండి ప్రత్యేకత. దీనికోసం అయోనిక్స్ బ్యాటరీ వ్యవస్థ ఉపయోగించారు. ఇలా చేయడం వల్ల గంటలకొద్దీ ఛార్జింగ్ పెట్టే ప్రయాస తప్పి ఎంతో సమయం ఆదా అవుతుంది.

### అవాన్ మోటార్స్ క్సీరో ప్లస్

ధర: రూ.47వేలు



ఈమధ్యే భారతీయ మార్కెట్లో అడుగుపెట్టింది. సింగిల్, డబుల్ బ్యాటరీ వేరియంట్లలో లభిస్తోంది. డబుల్ ప్యాక్ అవాన్ క్సీరో ప్లస్ బ్యాటరీని ఒక్కసారి ఛార్జ్ చేస్తే 120కిమీల వరకు వెళ్తుంది. నూటా యాభై కిలోల బరువును సైతం అవలీలగా మోస్తుంది.

### ఓకినావా ప్రైయిజ్

ధర: రూ.60వేలు

ప్రస్తుతం అందుబాటులో ఉన్న ప్రీమియం విద్యుత్తు స్కూటర్లలో ముందుండే పేరు ఓకినావా ప్రైయిజ్. స్టైలిష్ రూపం, మంచి పనితీరు దీని సొంతం. సైడ్ స్టాండ్ సెన్సర్, కీలెస్ ఎంట్రీ, ఫైండ్ మై స్కూటర్ ఫంక్షన్, యాంటీ థెఫ్ట్ మెకానిజం.. తదితర ఫీచర్లున్నాయి. వెయ్యి వాట్ల ఎలక్ట్రిక్ మోటార్ 3.35 బీహెచ్‌పీ శక్తిని విడుదల చేస్తుంది. అత్యధిక వేగం 75కిమీ/గంటకి.

### కొనేముందు జాగ్రత్త..

ఎన్ని సానుకూలతలున్నా బ్యాటరీ స్కూటర్లలో కొన్ని ప్రతికూలాంశాలూ లేకపోలేదు. బండి కొన్న తర్వాత సమస్యలు ఎదుర్కొనే బదులు ముందే కొన్ని విషయాల పట్ల జాగ్రత్తగా ఉంటే మన ప్రయాణం సాఫీగా సాగుతుంది.

**రేంజ్:** ఈ-వెహికిల్లు ఛార్జింగ్‌కి ఎక్కువ సమయం తీసుకుంటాయి. తక్కువ దూరం ప్రయాణిస్తాయి. అందుకే బండి కొనేముందు దాని రేంజ్ ఎంతో చూడాలి. ఒకసారి పూర్తిస్థాయిలో ఛార్జింగ్ చేస్తే అరవై నుంచి రెండు వందల కిలోమీటర్ల వరకు ప్రయాణించేవి అందుబాటులో ఉన్నాయి. మనం డెబ్భై, ఎనభై కిలోమీటర్లకు మించి రేంజ్ ఉన్నవే ఎంచుకోవాలి.

**అత్యధిక వేగం:** బ్యాటరీ స్కూటర్లను పట్టణ, నగర ప్రాంతాల్లోని వినియోగదారులే ఎక్కువగా ఉపయోగిస్తుంటారు. ట్రాఫిక్‌లో యాక్సిలరేటర్, బ్రేక్‌ల వాడకం ఎక్కువ. ఈ అవసరాలను దృష్టిలో ఉంచుకొని మంచి పికప్, అత్యధిక వేగం ఉన్న వాహనాలు కొనాలి.

**బ్యాటరీల మన్నిక:** బ్యాటరీల్లో లిథియం-అయాన్, లెడ్ యాసిడ్ రకాలుంటాయి. వీటిలో మొదటివే నమ్మశక్యమైనవి, పనితీరు బాగుంటుంది. ఖరీదూ ఎక్కువే. మన్నికైన, అత్యధిక కాలం వారంటీ ఇచ్చే స్కూటీలకే ఓటేయాలి.

**టైర్ల సంగతి:** మోటార్‌సైకిళ్లు, స్కూటర్లతో పోలిస్తే బ్యాటరీ స్కూటర్ల చక్రాలు చిన్నవి. మరీ తక్కువ పరిమాణం ఉన్న వాటితో ఇబ్బందులెక్కువ. గోతుల్లో దిగబడిపోతాయి. ప్రయాణం సౌకర్యంగా ఉండదు. పన్నెండు అంగుళాల్లోపు చక్రాలున్న వాహనం తీసుకోవద్దు.

**బ్రేకులు:** ఈ-స్కూటీల్లో ఎలక్ట్రిక్, డిస్క్, డ్రమ్ బ్రేక్‌లవి అందుబాటులో ఉన్నాయి. ఎలక్ట్రిక్ బ్రేక్‌ల నిర్వహణ తేలిక, పెద్దగా ఖర్చుండదు. కానీ బ్రేక్ వేసినపుడు తొందరగా పని చేయవు. డ్రమ్, డిస్క్ బ్రేక్‌లు సమర్థంగా పని చేస్తాయి. త్వరగా పాడయ్యే అవకాశం ఉంది. నిర్వహణ ఖర్చులు ఎక్కువ. రోజువారీ ఉపయోగానికి అనుగుణంగా ఎంపిక ఉండాలి.

**బాడీ నాణ్యత:** పెట్రోల్ స్కూటర్లతో పోలిస్తే విద్యుత్తు స్కూటర్ల తయారీ ఖర్చు ఎక్కువ. ఇతర మార్గాల్లో ఖర్చు తగ్గించుకోవాలనే ఉద్దేశంతో కంపెనీలు బాడీ నాణ్యతలో రాజీపడుతుంటాయి. ఎక్కువ బరువున్న వ్యక్తులకు ఇవి సరిపోవు. ప్రమాదం జరిగినపుడు తీవ్రత ఎక్కువ ఉంటుంది. అందుకే బిల్ట్ క్వాలిటీ బాగున్న వాటినే తీసుకోవాలి. పేరున్న కంపెనీ వాహనాలే కొనాలి.



### హీరో ఎలక్ట్రిక్ ఫోటాన్



ధర: రూ.87 వేలు

మేటి ఫీచర్లు, శక్తిమంతమైన పనితీరుతో అమ్మకాల్లో ముందుంది ఎలక్ట్రిక్ ఫోటాన్. ఎకానమీ, పవర్ అనే రైడింగ్ మోడ్‌లున్నాయి. పవర్ మోడ్‌లో ఒక్కసారి ఛార్జింగ్‌తో యాభై కిలోమీటర్లు ప్రయాణిస్తే, ఎకానమీలో 80కిలోమీటర్ల వరకు వెళ్లొచ్చు. పాలీకార్బోనేట్ హెడ్‌ల్యాంప్, టెలిస్కోపిక్ ఫ్రంట్ ఫోర్క్స్, డిస్క్‌బ్రేక్.. దీని ప్రత్యేకత.

### యో ఎలక్ట్రాన్ ఈఆర్

తక్కువ బడ్జెట్‌లో ఈ-స్కూటర్ కావాలనుకునేవారి ఛాయిస్. బరువు తక్కువ. 250వాట్ల హబ్ మోటార్‌తో పని చేస్తుంది. 24ఏహెచ్ బ్యాటరీ ఛార్జింగ్ కావడానికి ఎనిమిది గంటల సమయం పడుతుంది. డెబ్భై కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. అత్యధిక వేగం 25కిమీలు. వృద్ధులు, మహిళలకు అనుకూలం.

ధర: రూ.37వేలు

### మళ్లీ వస్తున్న చేతక్



ధర: రూ.1.1లక్షలు.

'హమారా బజాజ్' అంటూ మన మనసుల్ని కట్టిపడేసిన ఆనాటి చేతక్ స్కూటర్ వాణిజ్య ప్రకటనని మనం ఎలా మర్చిపోగలం? అదే పేరుతో బజాజ్ అర్బనైట్ కంపెనీ ఎలక్ట్రిక్ స్కూటర్ రూపొందించింది. ఈమధ్యే పుణెలో టెస్ట్‌డ్రైవ్ చేశారు. ఏప్రాన్ మౌంటెడ్ టర్న్ ఇండికేటర్లు, హ్యాండిల్‌బార్ ఎల్ఈడీ హెడ్‌ల్యాంప్‌లు, పన్నెండు అంగుళాల అలాయ్ చక్రాలు, డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ కన్సోల్, స్టోరేజీ కంపార్ట్‌మెంట్, ముందు డిస్క్‌బ్రేక్, వెనక డ్రమ్ బ్రేక్.. ఇతర వివరాలు. ఇంజిన్ వివరాలు గోప్యంగా ఉంచారు.

# రేసర్ జాన్




జాన్ అబ్రహం.. పేరున్న హీరోనే కాదు మోటార్‌సైకిళ్లపై జోరుగా రైడింగ్ చేసే బైకర్ కూడా. ధూమ్ సినిమాలో సూపర్‌బైక్‌ని పరుగులు పెట్టించి తన సత్తా ఏంటో చూపించాడు. మరోసారి అదే ఫీట్ చేయబోతున్నాడు. ఈసారి మాత్రం పూర్తిస్థాయి నిడివి ఉన్న రేసింగ్ చిత్రంలో నటిస్తున్నాడు. సినిమా అయినా జాన్ దీన్నేం ఆషామాషీగా తీసుకోవడం లేదు. ప్రొఫెషనల్ రేసర్‌లా కనిపించడానికి ఇంగ్లండ్‌లోని కెంట్‌లో అంతర్జాతీయ రేసింగ్ ట్రాక్‌పై సాధన చేస్తున్నాడు. దీనికోసం పీటర్ డ్యూక్ అనే శిక్షకుడిని నియమించుకున్నాడు. తను ఆరుసార్లు రేసింగ్ ఛాంపియన్ అయిన పీటర్ జెఫ్‌కి గురువు, తండ్రి. జాన్ సాధన చేస్తుంది కూడా అచ్చంగా ట్రాక్‌లో వాడే సుజుకీ హయబుసా, కావాసాకీ నింజా జడ్ఎక్స్-14, హోండా సీబీఆర్ 1000ఆర్, డుకాటీ 1098ఎస్‌లాంటి అత్యధిక సీసీ మోటార్‌సైకిళ్లపైనే. చూడాలిక మనం బాలీవుడ్‌లోనూ ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్ లాంటి థ్రిల్‌నిచ్చే సినిమా కోసం!

**తక్కువ ధరలో ఎక్కువ సీట్లున్న వాహనం...**
**ఎంపీవీ సెగ్మెంట్‌లో ఎస్‌యూవీ ఫీచర్లు...**
**మేటి హంగులు..**
**ఆకట్టుకునే డిజైన్...**
**మార్కెట్లోకి కొత్తగా వచ్చిన రెనాల్ట్ ట్రైబర్ ప్రత్యేకతలివి...**
**పూర్తి వివరాల్లోకి వెళ్తే...**

# ఏడు లక్షల్లో ఏడు సీట్ల బండి

ఇప్పుడు అన్ని ఆటోమొబైల్ కంపెనీల దృష్టి నాలుగు మీటర్లలోపు కార్లపైనే. భవిష్యత్తు డిమాండ్‌ని దృష్టిలో ఉంచుకొని ఆ విభాగంలో ట్రైబర్‌తో బరిలోకి దిగింది రెనాల్ట్. యువ కొనుగోలుదారులే లక్ష్యంగా వచ్చిన ట్రైబర్ ఐస్‌కూల్ వైట్, మూన్‌లైట్ సిల్వర్, ఎలక్ట్రిక్ బ్లూ, ఫియరీ రెడ్, ఆరెంజ్ పెయింట్ అనే ఐదు రంగుల్లో లభిస్తోంది.

**డిజైన్:** ఇండియా, ఫ్రాన్స్‌ల్లోని డిజైన్ సెంటర్లలో దీన్ని మలిచారు. మూలల్లో క్రోమ్ మెరుగులు.. ముందూ, వెనకా స్కఫ్ ప్లేట్లు, వీల్ ఆర్చ్‌లకి క్లాడింగ్‌లు, రూఫ్ రెయిల్స్, పొడవాటి టెయిల్‌ల్యాంప్‌లు, ప్రీమియం కార్లకు వాడే డోర్ హ్యాండిళ్లు.. ఈ ప్రత్యేకతలన్నీ ట్రైబర్‌కి ఎస్‌యూవీ లుక్‌ని తీసుకొచ్చాయి.

**ఆకర్షణీయం:** మ్యాట్ టెక్చర్లు, సమ్మిళిత రంగులతో ఇంటీరియర్‌ని తీర్చిదిద్దారు. డాష్‌బోర్డ్ మీద మెటాలిక్ ఫినిష్, క్రోమ్ అద్దకం లోపలంతా ఆకర్షణీయంగా ఉంది. ఎనిమిది అంగుళాల తాకేతెర ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ వినోదం పంచుతుంది. ఇది ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లేలతో పని చేస్తుంది. మరోవైపు 3.5 అంగుళాల ఇన్‌స్ట్రుమెంటల్ క్లస్టర్ డిజిటల్ ఎల్‌సీడీ తెరలో టాకోమీటర్, ఫ్యుయెల్ లెవల్, ఇంజిన్ టెంపరేచర్ చూసుకోవచ్చు. మూడు వరుసల సీట్లలో మొదటి రెండు వరుసల్ని సౌకర్యవంతంగా ముందుకీ, వెనక్కీ జరుపుకోవచ్చు. అన్నింట్లోనూ ఏసీ వెంట్‌లు చల్లదనం వెదజల్లుతాయి. రెండు గ్లోవ్‌బాక్స్‌లు అందులో ఒకదాంట్లో ప్రత్యేకంగా శీతలపానీయాలు పెట్టుకునేలా రూపొందించారు.

**ఫీచర్లు:** క్రోమ్ గ్రిల్, ప్రొజెక్టర్ హెడ్‌ల్యాంప్‌లు, ఎల్ఈడీ డీఆర్ఎల్‌లు, యాంటీ లాక్ బ్రేకింగ్ వ్యవస్థ (ఏబీఎస్), ఈబీడీ, రివర్స్ పార్కింగ్ సెన్సర్లు, రివర్స్ పార్కింగ్ కెమెరా, ఎయిర్‌బ్యాగ్‌లు, ఛార్జింగ్ సాకెట్లు, పుష్‌బటన్ స్టార్ట్/స్టాప్, పవర్ విండోలు, 15 అంగుళాల అలాయ్ చక్రాలు చెప్పుకోదగ్గ ఫీచర్లు.

**ఇంజిన్:** 5స్పీడ్ మాన్యువల్ గేర్‌బాక్స్, ఆటోమేటిక్ ట్రాన్స్‌మిషన్, టర్బోఛార్జ్డ్, 1.0లీటర్ల త్రీ సిలిండర్ ఇంజిన్, 72హెచ్‌పీ సామర్థ్యం (6,250ఆర్‌పీఎం మీద).

బూట్ స్పేస్:
620 లీటర్లు
గ్రౌండ్ క్లియరెన్స్:
182ఎంఎం
మైలేజీ:
20.5కిమీ/లీ
ధర: రూ.5లక్షల నుంచి రూ.7 లక్షలు (ఎక్స్ షోరూం).




Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

ఈనాడు సినిమా



# బహుముఖ ప్రజ్ఞాశాలి







'మచ్చరేఖై'లో విమల, నిర్మల

నటిగా, దర్శకురాలిగా, నిర్మాతగా బహుముఖ ప్రతిభ చూపిన విజయనిర్మల స్థానం అద్వితీయం. ప్రపంచంలోనే అత్యధిక చిత్రాలు తెరకెక్కించిన దర్శకురాలిగా రికార్డు సృష్టించి, చిత్ర పరిశ్రమపై ప్రత్యేకమైన ముద్ర వేసిన విజయనిర్మల (73) బుధవారం రాత్రి తిరిగిరాని లోకాలకి వెళ్లిపోయారు. 200 పైచిలుకు చిత్రాల్లో నటన... 44 చిత్రాలకి దర్శకత్వం... 15 చిత్రాల నిర్మాణం చేసి విజయాల్ని సొంతం చేసుకున్నారు. సమర్ది రామ మోహనరావు, శకుంతలాదేవి దంపతులకి 1946 ఫిబ్రవరి 20న మద్రాసులో జన్మించారు విజయనిర్మల. ఆమె అసలు పేరు నిర్మల. ఆమెకి ఒక అన్న, ఇద్దరు తమ్ముళ్లు. తండ్రి వాహినీ స్టూడియోలో చీఫ్ ఆపరేటర్‌గా పనిచేసేవారు. ప్రముఖ గాయని రావు బాలసరస్వతిదేవి విజయనిర్మల మేనత్త కూతురే. ఆమె పెదనాన్న మనవరాలు జయసుధ. బాలనటిగా విజయనిర్మల 'మచ్చరేఖై'' (1953) అనే తమిళ సినిమాతో తొలిసారి కెమెరా ముందుకొచ్చారు. విజయా సంస్థ తెలుగులో విజయవంతమైన 'గుణసుందరి కథ'ని తమిళంలో తీసినప్పుడు ఆమె పేరును విజయ నిర్మలగా మార్చారు. తెలుగులో ఆమె తొలి చిత్రం 'పాండురంగ మహాత్మ్యం'. 1964లో మలయాళంలో రూపుదిద్దుకున్న తొలి హారర్ చిత్రం 'భార్గవి నిలయం'తో కథానాయికగా పరిచయమయ్యారు. తెలుగులో కథానాయికగా పరిచయమైంది 'రంగులరాట్నం'తో. 'కవిత' అనే మలయాళ చిత్రంతో ఆమె తొలిసారి మెగాఫోన్ చేతపట్టారు. ఆపై తెలుగులో కృష్ణ కథానాయకుడిగా 'మీనా' తెరకెక్కించారు. విజయకృష్ణ పేరుతో నిర్మాణ సంస్థని ప్రారంభించిన ఆమె 15 చిత్రాలు నిర్మించారు. 'బంగారు గాజులు', 'టక్కరిదొంగ - చక్కని చుక్క', 'ఆత్మీయులు', 'బుద్ధిమంతుడు', 'విచిత్ర దాంపత్యం', 'మోసగాళ్లకి మోసగాడు', 'బుల్లోడు బుల్లెమ్మ', 'పండంటి కాపురం', 'తాత మనవడు', 'అల్లూరి సీతారామరాజు', 'పాడిపంటలు', 'కురుక్షేత్రం', 'హేమాహేమీలు', 'గండిపేట రహస్యం' తదితర చిత్రాలు నాయికగా విజయ నిర్మలకి తిరుగులేని పేరు తెచ్చిపెట్టాయి. కృష్ణ - విజయనిర్మల వివాహం 1969 మార్చి 24న తిరుపతిలో జరిగింది. అప్పటికే విజయనిర్మలకి కృష్ణమూర్తితో వివాహమైంది. వారిద్దరికి కలిగిన సంతానమే వి.కె.నరేష్. కథానాయకుడిగా పలు విజయాలు అందుకున్న నరేష్, ప్రస్తుతం క్యారెక్టర్ నటుడిగా కొనసాగుతున్నారు. మనవడు నవీన్ విజయకృష్ణ కూడా హీరోగా ఇటీవలే పరిచయమయ్యారు. అత్యధిక చిత్రాలు తెరకెక్కించిన మహిళగా 2000లో గిన్నిస్ రికార్డు అందుకున్నారు విజయ నిర్మల. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం విజయ నిర్మలని 2010లో ప్రతిష్ఠాత్మక రఘుపతి వెంకయ్య పురస్కారంతో సత్కరించింది. విజయనిర్మల మరణం తెలుగు చిత్రసీమని దిగ్భ్రాంతికి గురిచేసింది. ఆమె పార్థివ దేహాన్ని ఆస్పత్రి నుంచి గురువారం ఉదయం నానక్‌రామ్‌గూడలోని సొంత నివాసానికి తీసుకొచ్చారు. పలువురు సినీ, రాజకీయ ప్రముఖులతో పాటు అభిమానులు నివాళులర్పించారు. శుక్రవారం ఉదయం వ్యవసాయ క్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.



కన్నీటి పర్యంతమవుతున్న కృష్ణ

## ఎన్టీఆర్‌తో ఆత్మీయంగా

బాలనటిగా తొలి తెలుగు చిత్రంలోనే ఎన్టీఆర్‌తో కలసి నటించారు విజయ నిర్మల. 'పాండురంగ మహాత్మ్యం'లో బాలకృష్ణుడిగా కనిపించారామె. ఈ చిత్రం ఆమెకు మధురానుభూతుల్ని మిగిల్చింది. 11 నిమిషాల నిడివి ఉన్న 'జయ కృష్ణా ముకుందా మురారీ..' పాటను 15 రోజులు చిత్రీకరించారు. ఆ సమయంలో ఎన్టీఆర్‌తో అనుబంధం ఏర్పడింది. బాలకృష్ణుడిగా విజయ నిర్మల హావభావాలు చూసి మురిసిపోయిన ఎన్టీఆర్ సెట్లోనే ఆమెకు దిష్టి తీశారు. అంతేకాదు... ఆ తరవాత విజయ నిర్మల ఎప్పుడు కనిపించినా 'కృష్ణా' అనే పిలిచేవారు. ఈవిషయాన్ని గుర్తు చేసుకొని ఎంతో సంబరపడేవారు విజయనిర్మల. "మేకప్ విషయంలో ఎన్టీఆర్ చాలా జాగ్రత్తలు తీసుకొనేవారు. సినిమాలో నాది కృష్ణుడి పాత్రనేమో 'కృష్ణా' అని పిలిచేవారు. నేను నవ్వకుండా కూర్చొంటే 'కృష్ణా కొంచెం నవ్వరా' అనేవారు. అందుకే 'కృష్ణ' అనే మాటతో నాకు అనుబంధం ఎక్కువ" అనేవారు విజయనిర్మల.

## శ్రీకృష్ణ విజయం



'సాక్షి'

కృష్ణ - విజయ నిర్మల... ఈ పేర్లు పక్క పక్కనే ఉంటాయి. ఇద్దరినీ జంటగా చూడకపోతే కళ్లు సైతం కసురుకుంటాయి. వెండితెరపై 'సూపర్ హిట్' జోడీ అనిపించుకుని, ఆ అన్యోన్యతని నిజ జీవితంలోనూ పండించారు. దాదాపు 50 చిత్రాల్లో జంటగా మెరిశారిద్దరూ. ఓ జోడీ ఇన్ని చిత్రాల్లో కలసి నటించడం ప్రపంచ రికార్డేనేమో. విజయ నిర్మల గిన్నిస్ ఎక్కేంత ఖ్యాతి గడించారంటే, అందులో సగం వాటా కృష్ణకీ ఇవ్వాలి.

'సాక్షి'.. వీరిద్దరూ కలసి నటించిన తొలి సినిమా. ఆ సినిమానే వీళ్ల అనుబంధానికి బీజం వేసింది. అప్పట్లోనే దర్శకత్వంపై విజయ నిర్మలకున్న అభిరుచిని కనిపెట్టారు కృష్ణ. అయితే "ఇప్పుడే దర్శకత్వం ఎందుకు? కథానాయికగా కొన్ని సినిమాలు చేయ్. ఆ తరవాతే మెగాఫోన్ పట్టు" అని సలహా ఇచ్చారు. దాంతో వంద సినిమాలు పూర్తయ్యాకే విజయ నిర్మల కెప్టెన్ కుర్చీలో కూర్చున్నారు. తొలి చిత్రం 'కవిత'ని తెలుగులో తీద్దామనుకుంటే మలయాళంలో అయితే ఖర్చు తక్కువ అవుతుందని ఆ భాషలోనే తొలిఅడుగు వేసేలా ప్రోత్సహించారు. విజయ నిర్మల 44 సినిమాలు తీస్తే... దాదాపు అన్నింట్లోనూ కథానాయకుడు కృష్ణనే.

'సాక్షి' సినిమా కోసం పులిదిండిలోని ఓ దేవాలయంలో 'అమ్మ కడుపు చల్లగా' పాటని తెరకెక్కించారు. ఆ పాటలో నటిస్తున్న కృష్ణ, విజయ నిర్మలను పెళ్లి దుస్తుల్లో చూసిన హాస్య నటుడు రాజబాబు 'నిజ జీవితంలోనూ ఇదే జరుగుతుందం'టూ జోస్యం చెప్పారు. ఆయన మాటే నిజమైంది.

నిజ జీవితంలో అర్ధాంగిగానూ విజయనిర్మలకు నూరు మార్కులు పడిపోతాయి. కృష్ణ వెన్నంటే ఉంటూ ఆయనలో సగం అయిపోయారామె. కృష్ణకు ఆమె వంటలంటే ప్రాణం. సెట్లో ఉన్నా సరే... ఇంటి నుంచి క్యారియర్ రావాల్సిందే. కృష్ణ ఇంటికి ఎవరైనా వస్తే.. కడుపు నిండా భోజనం పెట్టి పంపాల్సిందే. ఇప్పుడు కృష్ణ - విజయ నిర్మల జంటగా కనిపించరు. కానీ.. తెలుగువారి మనసులో మాత్రం అర్ధనారీశ్వరుల్లా ఆ రూపం ఎప్పుడూ నిలిచిపోయే ఉంటుంది.

## 'అలనీల గగనాల'... విజయనిర్మల

'రంగుల రాట్నం'.. నిర్మాత, దర్శకుడు బి.ఎన్.రెడ్డికి అది దాదాపుగా ముగింపు దశ కాగా, కథానాయిక విజయనిర్మలకు ఆరంభ దశ. తర్వాతి చిత్రంతోనే బి.ఎన్.రెడ్డి శాశ్వతంగా తప్పుకోవడం, తదనంతర కాలంలో విజయనిర్మల నటన నుంచి నిర్మాణ, దర్శకత్వాల వైపు ఎదిగి రికార్డులు సృష్టించడం యాదృచ్ఛికం.

'రంగుల రాట్నం'లో విజయనిర్మలకి చెప్పుకోదగ్గ వేషమే లభించింది. మనిషి అందంగానూ కనిపించింది. 'కనరాని దేవుడే కనిపించినాడే..', 'కోయిల కోయని పిలిచినది..', 'మనసు మనసు కలిసే వేళా..' లాంటి పాటల్లో బాగా చేసిందని ప్రేక్షకులు మెచ్చుకున్నారు! ఆ తరవాత విజయనిర్మలకి పాత్రలైతే వచ్చాయి గానీ, అవన్నీ అమాయకత్వం, సాత్వికత ఉట్టిపడుతూ అందంగా కనిపించే పాత్రలు. ఎక్కువగా చెల్లెలు, కూతురు పాత్రలు! బహుశా తొలి చిత్రంలో 'మాస్ అపీల్'కు భిన్నంగా కుటుంబ ప్రేక్షకుల మెప్పు పొందడం అందుకు కారణమేమో!

**అందిపుచ్చుకుని..:** తన మీద పడ్డ ముద్రను సానుకూలంగానే తీసుకుని అంది వచ్చిన అవకాశాల్ని విజయనిర్మల సద్వినియోగం చేసుకున్నారు. 'పిన్ని' లాంటి చిత్రాల్లో నటిస్తూ నిలదొక్కుకున్నారు. అప్పుడు వచ్చింది బాపు-రమణల 'సాక్షి'. ఆ చిత్రానికి వాణిజ్యపరమైన విజయం లభించకపోయినా విజయనిర్మలకి మంచి పేరు వచ్చింది. ఆ చిత్రంలో 'అమ్మ కడుపు చల్లగా..' పాట మైలు రాయిగా నిలిచిపోయింది.



కృష్ణ, విజయనిర్మల

పెద్ద హీరోయిన్ అనిపించుకోవాలంటే అగ్రశ్రేణి హీరోల సరసన నటించాల్సిన రోజులవి. విజయనిర్మలకు పెద్ద హీరోలతో చిత్రాలు వచ్చాయి గానీ అవి చెట్టపట్టాలు వేసుకుని యుగళ గీతాలు పాడే పాత్రలు కావు. 'భామా విజయం'లో ఎన్టీఆర్ పక్కన దేవకన్యగా చిన్న పాత్రలో నటించినా మరీ లేతగా కనిపించిందని జనం చెప్పుకున్నారు. 'పూల రంగడు', 'మంచి కుటుంబం', 'బంగారు గాజులు', 'ఆత్మీయులు'లాంటి చిత్రాల్లో ఏయన్నార్‌తో నటించినా వాటిలో ఒకటి కూతురు కాగా.. మిగిలిన మూడూ చెల్లెలి పాత్రలు. అవి మూస పోసినట్లు కాకుండా వైవిధ్యంతో ఉండటం విశేషం.

**యువత రానికి జంటగా..:** శోభన్ బాబు, కృష్ణ, చంద్ర మోహన్ లాంటి కొత్త తరం హీరోలకు జోడీగా గ్లామరస్‌గా కనిపిస్తూ, పాటల్లో నటిస్తూ, కథనంలో కీలకమైన పాత్రలు కావడం విజయనిర్మలకు కలిసొచ్చింది. ముఖ్యంగా 'చిగురులు వేసిన కలలన్నీ..', 'నీవురావు నిదురరాదు..' (పూల రంగడు) 'నీలో ఏముందో ఏమో..', 'ఎవరూ లేని చోట' (మంచి కుటుంబం), 'చిలిపి నవ్వుల నిను చూడగానే..' (ఆత్మీయులు) లాంటి పాటల్లో గ్లామర్, 'అన్నయ్య సన్నిధీ...', 'చెల్లాయీ పెళ్ళికూతురాయెనే' (బంగారు గాజులు) పాటల్లో అనురాగం విజయనిర్మలకు అభిమానుల్ని సంపాదించి పెట్టాయి. ఆ పరంపరలో బాపు-రమణల 'బంగారు పిచిక' వచ్చింది. చిత్రం విజయం సాధించకపోయినా అవకాశం వస్తే విజయనిర్మల ప్రధాన నాయిక పాత్రలో ఒదిగి పోగలదని యువతరం నమ్మింది. ఆ నమ్మకాన్ని ఆసరాగా తీసుకుని కాబోలు బాపు-రమణలు మరో సాహసం చేశారు. ఏయన్నార్ పక్కన కూతురుగా, చెల్లెలిగా చేసిన విజయనిర్మలను 'బుద్ధిమంతుడు'లో ఆయనకు జోడీగా ఎంపిక చేశారు. 'తోటలోకి రాకురా..', 'హవ్వారే హైలెస్సో..', 'గుట్టమీద గువ్వా..' లాంటి పాటల్లో విజయనిర్మలను అభిమాన ప్రేక్షకులు కోరుకునే విధంగా చూపించారు.

**మరో మలుపు..:** కృష్ణతో జోడీగా విజయ నిర్మల నటించిన చిత్రాలు, ఆయనతో కుదిరిన జీవిత భాగస్వామ్యం ఆమెపై ఉన్న మునుపటి ముద్రను తొలగించాయి. 'విచిత్ర కుటుంబం'లో 'కాచుకో చూసుకో..' 'టక్కరి దొంగ చక్కని చుక్క'లో 'నీ నడలు చూస్తే..', 'ఓ కలలు గనే కమ్మని చిన్నారీ..'లాంటి పాటలు మెప్పించాయి. తర్వాతి కాలంలో వారిద్దరి జీవిత భాగస్వామ్యం చిత్ర నిర్మాణం వైపు దారి తీయడం అదో మలుపు! తొలిప్రయత్నం 'అగ్ని పరీక్ష' విఫలమైనా ఆ జంట సాహసంతో అడుగు ముందుకేసి 'మోసగాళ్లకు మోసగాడు'తో విజయానికి పునాదులు వేయడం అదో మెరుపు! మొదట జేమ్స్ బాండ్ తరహా చిత్రం ద్వారా దర్శకత్వం వైపు మొగ్గు చూపిన విజయనిర్మల ఆరుద్ర సలహా మేరకు 'మీనా'లాంటి కుటుంబ చిత్రంతో శ్రీకారం చుట్టి దర్శకురాలిగా రికార్డు సృష్టించడం ఆ తర్వాతి చరిత్ర!

– ఓలేటి శ్రీనివాసభాను

## ఆమె కోసం ఎస్వీఆర్‌నే తీసేశారు

విజయనిర్మల కోసం ఎస్వీ రంగా రావునే సినిమాలోంచి తీసేసిన సంఘటనను ఊహించగలమా. కానీ అప్పట్లో జరిగింది. తెలుగులో విజయం సాధించిన 'షావుకారు' చిత్రాన్ని తమిళంలో 'ఎంగవీటి పెన్'గా తీశారు. ఇందులో ఎస్వీఆర్ కోడలి పాత్ర విజయనిర్మలకు దక్కింది. విజయ నిర్మలను చూసి 'ఈ అమ్మాయి ఏంటి ఇంత సన్నగా ఉంది... వద్దు మార్చండి' అన్నారట ఎస్వీఆర్. 'ఇంత మంచి సంస్థలో అవకాశం వచ్చినట్టే వచ్చి చేజారిపోయింది' అనుకుంటూ ఏడుస్తూ తన గదికి వెళ్లిపోయారట విజయ నిర్మల. రేపు తనను షూటింగ్‌కు పిలవరు అనుకున్నారట. కానీ తర్వాత రోజు ఆమె కోసం చిత్ర నిర్మాత నాగిరెడ్డి కారు పంపించారట. తీరా సెట్‌కి వెళ్లి చూస్తే రంగారావు స్థానంలో ఎస్వీ సుబ్బయ్యగారు ఉన్నారట. "ఈ అమ్మాయి ఇంత బాగుంటే ఈయన వద్దంటున్నాడు ఏమిటి.. ఆయన్నే మారిస్తే పోతుంది' అని నాగిరెడ్డి అనుకొని ఉంటారు. అప్పట్లో నిర్మాతలకు సినిమాపైనా, నటీనటుల ప్రతిభ పైనా అంత పట్టు ఉండేది" అని ఓ సందర్భంలో విజయ నిర్మల ఈ విషయాన్ని గుర్తు చేసుకున్నారు. ఆ తర్వాత ఓ వేడుకలో ఎస్వీ రంగారావు, విజయనిర్మల కలుసుకున్నప్పుడు 'చూడండి నన్ను వద్దన్నారు...ఎప్పటికైనా మీతో నటిస్తా" అన్నారట విజయ నిర్మల. అన్నట్టుగానే ఎస్వీఆర్‌తో కలసి 'మామకు తగ్గ కోడలు'లో నటించారామె.



## దర్శకురాలిగా విజయ ప్రస్థానం

డైరెక్టర్... కెప్టెన్ ఆఫ్ ది షిప్. ఓ సినిమాలో నటించడం వేరు... అదే సినిమాకి దర్శకత్వ బాధ్యతలు నిర్వర్తించి విజయ తీరాలు చేరుకోవడం వేరు. అంతర్లీన సృజనతో తన పేరులోని విజయానికి తన చిత్రాల ద్వారా శాశ్వతత్వాన్ని ఆపాదించిన కళాకారిణి విజయ నిర్మల. పురుషాధిపత్యమే ఎక్కువగా ఉన్న చిత్ర పరిశ్రమలో అగ్ర కథానాయకులనూ డైరెక్ట్ చేసి విజయాలు చవి చూడడమే కాదు... అత్యధిక సినిమాలకు దర్శకత్వం వహించిన మహిళగా గిన్నిస్ బుక్‌లో తన పేరు నమోదు చేసుకుని అరుదైన గౌరవాన్ని అందుకున్న ఘనత కూడా విజయ నిర్మల సొంతం.

**బాపు స్ఫూర్తి:** తెలుగువారు గర్వించదగ్గ గొప్ప దర్శకుడు బాపు స్ఫూర్తితో విజయనిర్మల దర్శకురాలిగా మారారు. ఆయన దర్శకత్వం వహించిన 'సాక్షి' సినిమాలో నటిస్తున్నప్పుడే మెగాఫోన్‌పై ప్రేమ కలిగింది. తాను కూడా దర్శకురాలిగా మారాలన్న తపనతో బాపు దర్శకత్వ ప్రతిభను ఆసక్తి, అనురక్తితో దగ్గరిగా పరిశీలించారు. ఇతివృత్తం దగ్గర నుంచి చిత్రానువాదం వరకూ అన్ని విషయాల్లోనూ అవసరమైన అధ్యయనం చేశారు. బాపు దర్శకత్వంలో 'సాక్షి'తో పాటు 'బంగారు పిచిక', 'బుద్ధిమంతుడు' సినిమాల్లోనూ నటించడంతో... ఆయన దర్శకత్వ పాఠశాలలో ఏకలవ్య శిష్యురాలిగా మారిపోయారు.



'బెజవాడ బెబ్బులి'

**తెలుగులో 'మీనా'తో మెగాఫోన్:** విజయ నిర్మల తెలుగులో తెరకెక్కించిన మొదటి చిత్రమే నవలా చిత్రం. నవలలు చదివే అభిరుచి ఉన్న విజయ నిర్మల తొలి చిత్రంగా నవలా రాణి యద్దనపూడి సులోచనారాణి నవల 'మీనా'ని తెరకెక్కించారు. తరువాత కూడా విజయ నిర్మల కొన్ని నవలలని చిత్రాలుగా మలిచారు. 'శంఖు తీర్థం', 'సూర్య చంద్ర', 'సంఘం చెక్కిన శిల్పాలు'... ఆ కోవలోనివే. రూ.మూడు లక్షల ఖర్చుతో మలయాళంలో తన తొలి చిత్రాన్ని రూపొందించారు.

**పని రాక్షసి:** 'మీనా' చిత్రీకరణ సమయంలో రోజుకు మూడు నాలుగు సన్నివేశాలు చకచకా చిత్రీకరిస్తుంటే గుమ్మడి అయోమయంతో అసహనాన్ని వ్యక్తం చేశారట. 'ఇలా తీస్తే సినిమా దెబ్బ తింటుంది. రష్ చూశాకగానీ సినిమాలో నటించన'ంటూ మేకప్ తీసేసి వెళ్లి పోయారట. కానీ అంతవరకూ తీసిన సన్నివేశాల్ని ఎడిట్ చేసి చూపించిన తరువాత మెచ్చుకుని 'పని రాక్షసి' అంటూ ప్రశంసించారని విజయ నిర్మల చెప్పేవారు. ఇదే చిత్రంలో చంద్రకళ మీద 'శ్రీ రామనామాలు శతకోటి...ఒక్కొక్క పేరు బహు తీపి' అనే పాట చిత్రీకరిస్తే... పంపిణీదారులు ఆ పాట వద్దన్నారు. కానీ ఆ పాట ఉంది తీరాల్సిందేనని పట్టుపట్టారట విజయ నిర్మల. ఆ పాట ప్రేక్షకాదరణ పొందడం తెలిసిందే.

**ర్యాగింగ్ తప్పలేదు:** నటిగా ప్రసిద్ధురాలైనా... తొలి చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నప్పుడు సూర్యకాంతం లాంటి వారి వల్ల ర్యాగింగ్ తప్పలేదని ఆనాటి జ్ఞాపకాలను తలచుకునేవారు విజయ నిర్మల. సన్నివేశం చెప్పి కెమెరా ముందుకు రమ్మంటే...నటించి చూపించమని మొండికేసేవారని ఆమె గుర్తు చేసుకునేవారు. అయినా... వారందరూ అంతబాగా నటించినందువల్లే... 'మీనా' ఆశించిన విజయాన్ని అందుకుందని సంబరపడేవారు.

**సాహసమే ఊపిరి:** తన భర్త కృష్ణ లాగానే... విజయ నిర్మల కూడా ప్రయోగాలు చేయడంలో సాహసం ప్రదర్శించేవారు. అక్కినేని, సావిత్రి నటించిన 'దేవదాసు' అంటే ఆమెకి ప్రాణం. ప్రేక్షకుల మదిలో ఓ క్లాసిక్‌గా నిలిచిపోయిన 'దేవదాసు'ను మళ్లీ రూపొందించాలనే ఆలోచనే సాహసం. కానీ అది చేసి విజయనిర్మల సంచలనం సృష్టించారు. 'దేవదాసు'గా కృష్ణ, పార్వతిగా విజయ నిర్మల నటించారు. ఆమే తెరకెక్కించారు. అయితే, ఆశించిన ఫలితం దక్కలేదు. కానీ దర్శకురాలిగా విజయ నిర్మల సినీ ప్రముఖుల ప్రశంసలు పొందారు. ఎల్.వి.ప్రసాద్ ఈ సినిమా మాట్నీ చూసి వెంటనే ఫస్ట్ షో కూడా చూసారు. తరువాత విజయ నిర్మలకి ఫోన్ చేసి మరీ ఇప్పటి నుంచి 'నేను నీ అభిమానిని' అంటూ మనస్ఫూర్తిగా మెచ్చుకున్నారట.



'దేవదాసు'

**అక్కినేని అభినందన:** 'దేవదాసు' సినిమా తీసిన తరువాత అక్కినేని, కృష్ణతో కలసి 'హేమాహేమీలు' సినిమాకి విజయనిర్మల దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో కూడా ఆమె రోజుకు మూడు, నాలుగు సన్నివేశాలు చిత్రీకరిస్తుంటే అక్కినేని 'కెమెరాలో ఫిల్మ్ ఉందా?' అని చమత్కరించారు.

**ఇంకా ఏమైనా తీసేదుందా?.. ఎన్టీఆర్:** ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాత ఆయన మీద వ్యంగ్యాస్త్రాలు సంధిస్తూ విజయ నిర్మల 'సాహసమే నా ఊపిరి' తీశారు. ఆ సినిమా ఎన్టీఆర్ మీద వచ్చిన రాజకీయ సినిమాలన్నిటిలోకెల్లా సూపర్ హిట్ అయిందని చెప్పేవారు. ఈ సినిమా విడుదల తరువాత ఓసారి ఆమెకు ఎదురైన ఎన్టీఆర్ 'ఇంకా ఏమైనా తీసేదుందా?' అని అడిగారట.

**44 చిత్రాలకు దర్శకత్వం:** 'దేవదాసు' తరువాత నైరాశ్యానికి లోనైన విజయ నిర్మల దర్శకత్వం చేయకూడదని నిర్ణయించుకున్నారు. జయాపజయాలు పట్టించుకోకుండా దర్శకత్వం చేయాల్సిందిగా కృష్ణ సూచించడంతో ఆమె మళ్లీ మెగా ఫోన్ పట్టారు. 44 చిత్రాలకు దర్శకత్వం వహించారు. మరో ఆరు చిత్రాలను తెరకెక్కిస్తే యాభై చిత్రాలను పూర్తి చేసినట్లు ఉంటుందని అనుకున్నా ఆ కోరిక నెరవేరలేదు. 1971లో 'మీనా'తో మొదలుపెట్టి 'దేవుడే గెలిచాడు', 'పంచాయితీ', 'రౌడీ రంగమ్మ', 'మూడు పువ్వులు ఆరు కాయలు','రామ్ రాబర్ట్ రహీం', 'ఖైదీ కాళిదాసు', 'సిరిమల్లె నవ్వింది', 'భోగీ మంటలు', 'అంతం కాదిది ఆరంభం', 'డాక్టర్ సినీ యాక్టర్', 'బెజవాడ బెబ్బులి', 'ముఖ్యమంత్రి', 'ముక్కోపి', 'లంకె బిందెలు' 'కలెక్టర్ విజయ', 'అజాత శత్రువు', 'ప్రజల మనిషి', 'వదిన మాట', 'మొగుడూ పెళ్ళాల దొంగాట', 'ఎస్ నేనంటే నేనే', 'పుట్టింటి గౌరవం', 'నేరము శిక్ష' లాంటి సినిమాలు తెరకెక్కించారు.



'హేమాహేమీలు'

– పి.వి.డి.ఎస్. ప్రకాష్

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

# వసుంధర

ఫ్యాషన్ ఫ్యాషన్

అందమైన కుసుమాలు, బంగారు తీగలు... మనసు దోచుకునే గళ్లు... కలగలసిన ఈ టస్సర్ చీరలు వనితల హృదయాలను దోచుకుంటున్నాయి. ముదురు, లేత వర్ణాల్లో... రకరకాల డిజైన్లలో లభిస్తోన్న వీటిని సందర్భానుసారంగా ఎంచుకుంటే నలుగురిలో అదుర్స్ అనిపిస్తారు.

## టస్సర్...తళుక్స్

నగలు, దుస్తులు: KALANJALI
www.kalanjali.com
www.facebook.com/kalanjaliworld

◆ ఈ చీరలు విజయవాడలోని కళాంజలి షోరూమ్‌లో మాత్రమే లభ్యమవుతాయి.



ముదురు ఆకుపచ్చ చీరపై అందంగా పరుచుకున్న పెద్ద పెద్ద పూలు.... వీటికి జతగా సన్నటి జరీ అంచు, కొంగుపై జరీ గీతలు... చీర అందాన్ని పెంచేస్తున్నాయి కదూ!

ఆకుపచ్చ, క్రీమ్, నలుపు వర్ణాలు మేళవించిన టస్సర్ చీరపై... మామిడి పిందెల మోటిఫ్‌లు, కాంతా ఎంబ్రాయిడరీ గీతల అందాలు... కట్టుకుంటే ఆధునికంగా కనిపిస్తారు.

గోధుమరంగు చీరంతా పరుచుకున్న పైస్లీ మోటిఫ్‌లు... నీలం రంగు పల్లూ... ఎంచుకుంటే ట్రెండీ లుక్ సొంతం.

ఆలివ్ గ్రీన్ టస్సర్ కోకపై కలంకారి పనితనంతో మయూరాల ప్రింట్లు... పూల డిజైన్‌లు ఆకట్టుకుంటే... పాంపాం టాజిల్స్ కొంగుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

గులాబీ, ఎరుపు వర్ణాలు మేళవించిన టస్సర్ చీరపై అక్కడక్కడా రెట్రో తరహాలో ఆకుల మోటిఫ్‌లు, నారింజ రంగు అంచు, కొంగు... మగువల మనసులు దోచేస్తాయి.

ఆవ, నారింజ, బూడిద రంగులు మేళవించిన టస్సర్ చీరంతా... జామెట్రికల్ గళ్లు పరచుకుంటే, మీనాకారి పైస్లీ మోటిఫ్‌లతో ఆ అందం రెట్టింపు అయ్యింది.

ఫొటోలు: దండా శ్రీనివాసరావు
మోడల్: ప్రియాంక

## బ్రెడ్ పోహా కట్‌లెట్

అమ్మచేత కమ్మగా



**కావల్సినవి:** ఉడికించిన బంగాళాదుంప ముద్ద - కప్పు, అటుకులు - అరకప్పు, బ్రెడ్‌స్లైసులు - రెండు, పల్లీలు - పావు కప్పు, ఉల్లిపాయ ముక్కలు - అరకప్పు, అల్లం, పచ్చిమిర్చి తరుగు - చెంచా చొప్పున, కొత్తిమీర తరుగు- మూడు చెంచాలు, నిమ్మరసం - రెండు చెంచాలు, ఉప్పు - తగినంత, నూనె - వేయించేందుకు సరిపడా.

**తయారీ:** అటుకుల్ని పావు గంట సేపు నీటిలో నానబెట్టి నీళ్లు పిండి ఓ గిన్నెలోకి తీసుకోవాలి. ఇందులో నూనె తప్ప మిగిలిన పదార్థాలన్నీ వేసి ముద్దలా కలపాలి. చేతికి కొద్దిగా నూనె రాసుకుని ఈ మిశ్రమాన్ని కట్‌లెట్‌ల మాదిరి చేసుకోవాలి. పొయ్యిమీద బాణలి పెట్టి వేయించేందుకు సరిపడా నూనె వేయాలి. అది వేడయ్యాక ఈ కట్‌లెట్‌లను రెండు చొప్పున వేసి వేయించి తీసుకుంటే చాలు.

## నజరానా

ఫ్లవర్ వాజులో పూలు ఎక్కువరోజులు తాజాగా ఉండాలంటే... ఆ నీటిలో రెండు చెంచాల వెనిగర్, చెంచా చక్కెర కలపండి. రెండు రోజులకోసారి ఆ కాడలు అంగుళం చొప్పున కత్తిరించండి.



# పటాస్‌తో జబర్దస్తుగా!



**చిన్నప్పటి నుంచీ ఎదుటివారిని పరిశీలించడం, వారిని అనుకరించడం అలవాటైన ఆ అమ్మాయికి అదే కెరీర్ అయ్యింది. ప్రముఖుల ప్రశంసలూ తెచ్చిపెట్టింది. నటీనటులు, రాజకీయ ప్రముఖులు... ఇలా ఎవరి గొంతునైనా ఇట్టే అనుకరించడం ఆమెకు వెన్నతో పెట్టిన విద్య. ఓ వైపు టీవీ షోలల్లో గలగలా మాట్లాడేస్తూ, మరో వైపు మిమిక్రీ చేస్తూ బిజీబిజీగా ఉండే ఆమే ఉదయశ్రీ బైరోజు. ఇటీవల జబర్దస్త్‌లో కనిపించి మరింత మంది అభిమానుల్ని సొంతం చేసుకున్న ఆమె తన గురించి చెప్పుకొచ్చిందిలా.**

మాది మధ్యతరగతి కుటుంబం. అమ్మ జయప్రద గృహిణి. నాన్న రమేష్‌బాబు చారి మెకానిక్ షెడ్ నడుపుతారు. తమ్ముడు సాయికిరణ్. నేను పుట్టి పెరిగిందంతా హైదరాబాద్‌లోనే. ఇంటరు, డిగ్రీ ఇక్కడే పూర్తిచేసి, ఎంబీఏ ఎదులాబాద్ ఒమేగాలో చదివా. చిన్నప్పటి నుంచి అందరినీ ఏకాగ్రతగా పరిశీలించడం, తరువాత వారిని అనుకరించడం నాకు ఇష్టం. అది నా అభిరుచిగా మార్చుకున్నా. అవకాశం వచ్చినప్పుడల్లా ఇంట్లో, స్కూల్లో స్నేహితుల ముందు అనుకరణ చేసేదాన్ని. స్కూల్‌లోనూ పలు కార్యక్రమాల్లో పాల్గొనేదాన్ని. ఎలాంటి శిక్షణా లేకుండా నాకు నేనే నేర్చుకున్న కళ ఇది. ఎప్పటికప్పుడు సినీ, రాజకీయ ప్రముఖులను పరిశీలిస్తూ... ఇంట్లో అద్దంలో నన్ను నేను చూసుకుంటూ సాధన చేస్తా.

### యాంకరింగ్‌తో మొదలు...



అప్పుడు నేను ఇంటరు చదువుతున్నా. ఓ రోజు కాలేజీ నుంచి వచ్చి ఇంట్లో టీవీ చూస్తున్నా. ఈ-టీవీలో 'స్టార్ మహిళ'కు ఆడిషన్ జరుగుతోందని, ఆసక్తి ఉన్నవాళ్లు సంప్రదించమంటూ ఫోన్ నంబరు కనిపించింది. చిన్నప్పటి నుంచి బుల్లితెరపై కనిపించాలనే నా ఆసక్తికి అదే సరైన సమయం అనిపించింది. ఏ మాత్రం ఆలోచించకుండా ఆడిషన్‌కు వెళితే, వెంటనే ఎంపికయ్యా. అలా ఇంటరులోనే నా కెరీర్ ప్రారంభమైంది. టీ న్యూస్‌లో 'ధూం-ధాం ముచ్చట్లు'లో మల్లీశ్వరిగా పక్కా తెలంగాణ యాసలో నేను చదివే వార్తలు', ఈటీవీ ప్లస్‌లో 'పటాస్' కార్యక్రమానికి ఎప్పటికప్పుడు ప్రశంసలు వస్తూనే ఉన్నాయి. డబ్‌స్మాష్‌లు, టిక్‌టాక్‌లు, మిమిక్రీ... అన్నీ నాకు గుర్తింపు తెచ్చినవే.

### సాధనతోనే సాధ్యం...

నా షోలు చూసి ప్రముఖ దర్శకుడు పూరి జగన్నాథ్ 'నా నువ్వే' చిత్రంలో నటించే అవకాశం ఇచ్చారు. ఇప్పుడు 'సంత-మట్టి మనుషుల ప్రేమకథ' చిత్రంలో నటించా. నేను నటీనటులను అనుకరిస్తూ చేసిన షోలను చూసిన హైపర్ ఆది ఓసారి నాకు ఫోను చేసి తనతో కలిసి జబర్దస్త్ కార్యక్రమం చేయమన్నారు. ఈ మధ్య జబర్దస్త్‌లోని ఓ స్కిట్‌లో పాల్గొన్నా. కథానాయికలను అనుకరించిన విధానానికి నాగబాబు, రోజా ఇచ్చిన అభినందనలు మరవలేను. ఆ కార్యక్రమం చూసిన కొందరు తెలుగు దర్శకులు 'చాలా బాగా చేశావు' అంటూ అభినందించారు. ఎవరినైనా అయిదు నిమిషాలు చూస్తే వారిలా మాట్లాడగలను. ఇదెలా సాధ్యమని చాలామంది అడుగుతుంటారు. వాళ్లను గమనించాక కొంత సాధన చేస్తా అంతే. తమన్నా, సమంత, కాజల్‌లా మాట్లాడగలను. వాళ్లే కాదు, మరికొందరు నటులు, రాజకీయ నాయకుల్లా మాట్లాడగలను. సమయం ఉంటే జర్నలిజం చదవాలని ఉంది. నాకు ఇంత గుర్తింపు రావడం వెనుక అమ్మ, నాన్న అందిస్తున్న సహకారం ఎంతో ఉంది.

# స్ట్రెచ్‌మార్క్స్ పోయేదెలా?

నాకు ఇరవై ఐదేళ్లు. హాస్టల్‌లో ఉంటా. సరిగా ఆరని దుస్తులు వేసుకోవడం వల్ల కొన్నాళ్ల కిందట కాళ్ల మీద ఫంగల్ ఇన్‌ఫెక్షన్ వచ్చింది. మందుల దుకాణంలో అడిగి ఏదో క్రీమ్ రాసుకున్నా. సమస్య తగ్గింది కానీ...ఆ ప్రదేశంలో స్ట్రెచ్‌మార్క్స్ వచ్చాయి. డాక్టర్ దగ్గరికి వెళితే స్టిరాయిడ్ క్రీమ్ వాడటం వల్లే అలా జరిగిందని చెప్పారు. అవి పోయే మార్గం లేదా? – ఓ సోదరి

హాస్టల్‌లో ఉండేవారే కాదు ఎవరైనా సరే... ఫంగల్ ఇన్‌ఫెక్షన్ల బారిన పడకుండా ఉండాలంటే కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. దుస్తులు పరిశుభ్రంగా ఉంచుకోవడం, పొడిగా ఉన్నవి మాత్రమే ధరించడం, స్నానం చేశాక శరీరాన్ని పూర్తిగా తుడుచుకున్నాకే దుస్తులు వేసుకోవడం వంటి నియమాలు పాటించాలి. మీరు చేసిన పొరపాటు సొంతంగా ఏదో ఒక క్రీమ్ రాసుకోవడమే. కొన్ని రకాల మందుల్లో స్టిరాయిడ్లు ఉంటాయి. వైద్యుల సలహా లేనిదే వాటిని వాడకూడదు. వాటివల్ల అనేక తాత్కాలిక, దీర్ఘకాలిక దుష్పరిణామాలు ఎదురయ్యే ప్రమాదం ఉంది. స్టిరాయిడ్ మోతాదు ఎక్కువగా ఉండి దాన్ని దీర్ఘకాలం వాడితే చర్మంలో ఉండే ఎలాస్టిక్ ఫైబర్‌లు బలహీనపడతాయి. ఈ క్రీమ్‌లు రాసుకున్న వెంటనే చర్మం ఎర్రగా మారి, పొలుసులా వస్తుంది. ఒక్కోసారి బొబ్బలు వస్తాయి. చర్మం పలుచగా మారుతుంది. కొన్నిసార్లు ఆ స్టిరాయిడ్స్ శరీరంలోకి చేరి కడుపులో తిప్పడం, మంట, తలనొప్పి, కళ్లు తిరగడం, నెలసరి క్రమం తప్పడం, బరువు పెరగడం, అవాంఛిత రోమాలు వంటి ఎన్నో సమస్యలు కనిపించొచ్చు. మీ చర్మంపై ఇప్పటికే స్ట్రెచ్‌మార్క్స్ వచ్చాయి. వాటిని పూర్తిగా నయం చేయడం కుదరదు. క్రమం తప్పకుండా మాయిశ్చరైజర్ రాసుకోవడం లేదా బాదం, ఆలివ్, కోకోబటర్, హైడ్రోలిక్ యాసిడ్ క్రీమ్ వంటివాటితో మర్దన చేయాలి. రెటినాయిడ్ క్రీమ్‌లు వాడినా ఫలితం ఉంటుంది. సిలికాన్ జెల్స్‌తో మర్దన చేయడం, మైక్రో డెర్మాబ్రేషన్‌తో పాలిష్, కెమికల్ పీల్స్, లేజర్ చికిత్సలతో ప్రయోజనం ఉంటుంది. పరిస్థితిని బట్టి ప్లేట్‌లెట్ రిచ్‌ప్లాస్మా ఇంజెక్షన్ చేస్తారు. విటమిన్ ఎ, సి ఎక్కువగా ఉండే చిలగడ దుంప, క్యారెట్ తీసుకోవాలి. కొద్దిగా చక్కెర తీసుకుని కొబ్బరినూనె, నిమ్మరసం చేర్చి ఆ ప్రదేశంలో రాసి, కడిగితే సమస్య కొంతవరకు అదుపులోకి వస్తుంది.

డియర్ వసుంధర



డా॥ శైలజ సూరపనేని
కాస్మెటిక్ స్కిన్‌కేర్ ఫిజీషియన్

– మీ సందేహాలను vasubeauty@eenadu.net కు పంపించగలరు.

## బంగారం-వెండి



27న ముగింపు-క్రితం

| | ముగింపు | క్రితం |
|---|---|---|
| **హైదరాబాద్** | | |
| బంగారం (24క్యా) | 34,970 | 35,270 |
| ఆర్నమెంట్ | 32,670 | 32,890 |
| వెండి (కిలో) | 38,600 | 38,750 |
| **విజయవాడ** | | |
| బంగారం (24క్యా) | 35,230 | 35,180 |
| ఆర్నమెంట్ | 32,650 | 32,600 |
| వెండి (కిలో) | 38,900 | 38,900 |
| **ప్రొద్దుటూరు** | | |
| బంగారం (24క్యా) | 33,950 | 34,000 |
| ఆర్నమెంట్ | 31,570 | 31,480 |
| వెండి (కిలో) | 38,800 | 38,800 |
| **రాజమహేంద్రవరం** | | |
| బంగారం (24క్యా) | 35,100 | 35,140 |
| ఆర్నమెంట్ | 32,390 | 32,470 |
| వెండి (కిలో) | 38,700 | 38,800 |
| **విశాఖపట్నం** | | |
| బంగారం (24క్యా) | 34,940 | 34,980 |
| ఆర్నమెంట్ | 32,500 | 32,530 |
| వెండి (కిలో) | 39,500 | 39,500 |
| **తమిళనాడు** | | |
| బంగారం ఆర్నమెంట్ (గ్రా) | 3,239 | 3,247 |
| వెండి (గ్రా) | 40.60 | 40.80 |

(రూ. లలో)

# చిక్కేందుకు చిట్కాలు!

ఎన్ని ప్రయత్నాలు చేస్తున్నా... ఎంతకీ తగ్గరు కొందరు. దానికి ఈ పొరపాట్లు కారణమేమో గమనించుకోండి.



● సన్నబడాలంటే.. పిండి పదార్థాలు మానేస్తే చాలనుకుంటారు కొందరు. ఇది అపోహే. శరీరానికి శక్తి కావాలంటే... పిండిపదార్థాలూ అవసరమే. ముఖ్యంగా వ్యాయామం చేయడానికి ముందు ఎంతో కొంత పిండి పదార్థాలు తీసుకోవాలి. వాటివల్ల రోజంతా చురుగ్గానూ ఉంటారు. అలాగని రోజంతా తినకూడదు. మధ్యాహ్నం నుంచి వాటిని పూర్తిగా తగ్గించి ఇతర పోషకాలు అందేలా చూసుకోవాలి.

● కొవ్వు పదార్థాలు తింటే బరువు పెరుగుతామనుకోవడం తప్పు. శరీరం చురుగ్గా పనిచేయాలంటే అన్నిరకాల పోషకాలు కావాలి. వాటిల్లో కొవ్వు పదార్థాలూ ఉండాలి. తీసుకోవాల్సిందల్లా మేలుచేసే కొవ్వు పదార్థాలే. నట్స్, ఆలివ్‌నూనె, అవిసెగింజలు వంటివన్నీ ఆ కోవలోకే వస్తాయి.

● అన్నిరకాల వ్యాయామాలు చేస్తే సన్నబడే మాట ఎలా ఉన్నా... శరీరం అలసిపోతుందని మరవకూడదు. ఒకేసారి జీరోసైజ్‌కి వచ్చేసి, కండరాల్ని పెంచుకునే ప్రయత్నం చేస్తుంటారు కొందరు. రెండూ ఒకేసారి సాధ్యం కాదు. ముందు బరువు తగ్గి, తరువాత కండరాల కోసం కష్టపడాలి.

● అనుకున్న ఫలితం రావాలనుకుంటే... కనీసం ఎనిమిది గంటలు నిద్రపోవడమూ అవసరమే. ఒత్తిడిని అధిగమిస్తూ, అవకాశం వచ్చినప్పుడల్లా విశ్రాంతి తీసుకునేలా చూసుకోవాలి.

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu



# మేఘాలలో.. మాథెరాన్

రుతురాగాల వేళ..

అక్కడికి చేరుకోగానే..
చిరుజల్లులు స్వాగతం పలుకుతాయి
ఇంకో నాలుగు అడుగులు వేయగానే..
పచ్చని పర్వతాలు మమ్మల్ని
చూడండంటాయి
ఆ కొండ వాలుల్లోకి వెళ్లగానే..
మేఘమాలికలు మీ చేతికందుతాయి
అక్కడ నడవండి..
కొండలెక్కండి..
అద్భుతాలను ఆస్వాదించండి..



## వానల్లో.. కోనల్లో.. | మాథెరాన్

సహ్యాద్రి పర్వత శ్రేణుల్లో సముద్ర మట్టానికి 2,650 అడుగుల ఎత్తులో ఉంటుంది మాథెరాన్. చల్లని గాలులు, ప్రశాంతమైన రాత్రులు.. అందరికీ ఆహ్వానం పలుకుతాయి. వారమంతా పనితో సతమతమయ్యే ముంబైకర్లు.. వీకెండ్ వచ్చిందంటే చాలు మాథెరాన్‌లో వాలిపోతారు. పుణెవాసులూ వారాంతపు వినోదానికి ఇక్కడికి చేరుకుంటారు. కొండవాలులో చకచక అడుగులు వేస్తారు. పిల్ల కాల్వలను దబుక్కున దాటేస్తారు. జలపాతాల జోరులో హుషారెక్కుతారు.

ఏడాదంతా ఇలాగే ఉంటుందిక్కడ. అందుకే ఎక్కడెక్కడి నుంచో పర్యాటకులు మాథెరాన్‌కు వెళ్తుంటారు. వర్ష రుతువులో అయితే మరీనూ! రోజూ వర్షం పలకరిస్తుంది. కొండల నుంచి జలధారలు ఉప్పొంగుతుంటాయి. నేలంతా మెత్తబడి అడుగులకు మడుగులొత్తుతుంది. పర్యాటకులు వర్షంలోనే కొండ అంచుకు చేరుకుంటారు. గరం గరం చాయ్ తాగుతూ.. కేరింతల స్వరం పెంచుతారు. కొండల చుట్టూ ఉన్న కోనల సోయగాలు చూస్తూ పరవశిస్తారు. మాథెరాన్ చుట్టుపక్కల 38 వ్యూ పాయింట్లు ఉన్నాయి. వన్‌ట్రీ హిల్ పాయింట్, హనీమూన్ హిల్, అలెగ్జాండర్ పాయింట్, పనోరమా పాయింట్, లూసియా పాయింట్ ఇలా రకరకాల వ్యూ పాయింట్లు మాథెరాన్ సౌందర్యాన్ని 360 డిగ్రీల కోణంలో ఆవిష్కరిస్తాయి.

అడ్వెంచర్ డెస్టినేషన్‌గా మాథెరాన్‌కు పేరుంది. ఇక్కడి పరిసరాల్లో ట్రెక్కింగ్, ర్యాపెలింగ్, క్యాంప్ ఫైర్, రాక్ క్లైంబింగ్ వంటి ఈవెంట్లు సాహసయాత్రికులను అలరిస్తాయి. దోధనీ జలపాతం మనసును కట్టిపడేస్తుంది. చందేరి గుహలు ఆశ్చర్యపరుస్తాయి. ఆద్యంతం ఆనందాల మధ్య సాగే మాథెరాన్ పర్యటన ఎప్పటికీ గుర్తుండిపోతుంది.

### వాహనాలకు నో ఎంట్రీ

మాథెరాన్‌లో వాహనాల రణగొణ ధ్వనులు వినిపించవు. అంబులెన్స్ తప్ప మిగతా ఏ వాహనమూ అక్కడ కనిపించదు. ఎవరు వచ్చినా.. ఆ కొండల పాదాల చెంత వాహనాలు ఆపాల్సిందే. పర్యావరణ పరిరక్షణ కోసం మాథెరాన్‌లో వాహనాలను నిషేధించారు. గుర్రాలపై స్వారీ చేయవచ్చు.

## కోటలో పాగా | ప్రబల్‌గడ్

పుణె సమీపంలో ట్రెక్కింగ్ జోన్‌గా పేరున్న మరో అద్భుతం ప్రబల్‌గడ్. సముద్రమట్టానికి 2,650 అడుగుల ఎత్తులో ఉంటుందీ ప్రాంతం. ఆ కోటపై మొఘలుల పెత్తనం సాగింది. అదిల్‌షాహీల ఆధిపత్యం నడిచింది. మరాఠాల ధ్వజం ఎగిరింది. ఎందరో యోధులు ప్రబల్‌గడ్‌లో అడుగుపెట్టారు. నేటికీ సాహసవంతులు మాత్రమే కోటలో పాగా వేయగలరు. ట్రెక్కింగ్ ప్రియులు క్యూ కడుతుంటారు. వారాంతాల్లో వందల మంది ఇటుగా వస్తారు. సరదాగా కబుర్లాడుకుంటూ.. కొండపైకి చేరుకుంటారు. అక్కడున్న కోట శిథిలావస్థకు చేరినా.. దర్పం మాత్రం తగ్గలేదు. ప్రకృతి సంపదతో అలరారుతున్న ప్రబల్‌గడ్ ట్రెక్కింగ్‌కు అనువైన ప్రదేశం. గిరి అంచు నుంచి కిందికి చూస్తే కళ్లముందు అద్భుతాలు కదలాడుతుంటాయి. మేఘాలు దాటి పైకొచ్చిన అనుభూతి కలుగుతుంది. మబ్బులన్నీ వినువీధులు వీడి.. మనతో దోస్తీకి వచ్చాయా అనిపిస్తుంది. చిరుజల్లుల వేళ ప్రబల్‌గడ్ ట్రెక్కింగ్ మరింత మనోహరంగా ఉంటుంది. కొండవాలులో చిన్నా చితకా జలపాతాలు కళ్లను కట్టిపడేస్తాయి. గంటన్నరలో కొండపైకి చేరుకోవచ్చు. పెద్దగా ఆయాసపడాల్సిన అవసరమూ ఉండదు.

## శిఖరాగ్ర సంతోషం | కళావతి దుర్గ్

ప్రబల్‌గడ్ చెంతనున్న కళావతి దుర్గం ఆకాశమంత ఎత్తుంటుంది. ఒంటిస్తంభం మేడలా ఉన్న శిఖరాన్ని చూస్తే ఆశ్చర్యం కలుగుతుంది. అద్భుతమైన కొండ.. దానిపై కోట. సముద్రమట్టానికి 2,300 అడుగుల ఎత్తులో ఉన్న కళావతి దుర్గం దేశంలోనే అత్యంత ఆసక్తికరమైన ట్రెక్కింగ్ స్పాట్‌గా పేరొందింది. నింగిని చీల్చుతోందా అన్నట్టుండే శిఖరం.. నిండుగా పచ్చదనంతో మరకత లింగాన్ని మరపిస్తుంది. కొండను తొలిచి అతి తక్కువ వాలుతో నిర్మించిన మెట్లు అధిరోహించడం ఒకింత కష్టమే. అయినా.. మేఘాలను దాటి.. రుతురాగాలు వినాలనుకునే సాహసవంతులు వెనకడుగు వేయరు. నేర్పుగా మెట్లు ఎక్కుతారు. ఓర్పుగా పైపైకి సాగుతారు. పట్టుకుందామంటే తాళ్లుండవు. పట్టుజారితే అడ్డుకోవడానికి పిట్టగోడలు ఉండవు. ఏమాత్రం తేడా వచ్చినా.. అంతే సంగతులు. నిపుణుల పర్యవేక్షణలో ఈ ట్రెక్కింగ్‌లు జరుగుతుంటాయి. ఈ సాహస క్రతువు దాదాపు రెండు గంటల పాటు సాగుతుంది. పైకి చేరిన తర్వాత ఆ కష్టమంతా ఇట్టే మరచిపోతారంతా. కారుమబ్బులు కమ్ముకొచ్చినప్పుడు.. సినిమాల్లో గ్రాఫిక్స్‌లా ఉంటుందా ప్రాంతం. చుట్టూ ఎటు చూసినా.. మబ్బులు పరుపుల్లా పరుచుకున్నట్టు అనిపిస్తుంది. మేఘాలు చెదిరిపోయిన వేళ.. చెంతనే ఉన్న ప్రబల్‌గడ్ కోట సిసలైన ఠీవి కంటపడుతుంది. మాథెరాన్ సౌందర్యం కనిపిస్తుంది. మహాబలేశ్వర్ కొండలు, కల్యాణ్, పాన్వెల్ కోటల దృశ్యాలూ చూడొచ్చు.

### చేరుకునేదిలా

- మాథెరాన్ ముంబయ్ నుంచి 90 కి.మీ, పుణె నుంచి 120 కి.మీ దూరంలో ఉంది. ఈ రెండు ప్రాంతాల నుంచి బస్సుల్లో, ప్రైవేట్ ట్యాక్సీల్లో మాథెరాన్ పర్వతం పాదాల చెంతనుండే నెరల్‌కు చేరుకోవచ్చు. అక్కడి నుంచి మాథెరాన్ వెళ్లొచ్చు.
- హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం నుంచి కర్జత్‌కు రైళ్లున్నాయి. అక్కడి నుంచి నెరల్ మీదుగా మాథెరాన్ వెళ్లొచ్చు.
- కర్జత్ నుంచి రోడ్డు మార్గంలో ప్రబల్‌గడ్ బేస్‌క్యాంప్ ఠాకూర్‌వాడికి (27 కి.మీ.) చేరుకోవచ్చు.

### కొండల మీదుగా..

**మాథెరాన్ దిగువన నెరల్ జంక్షన్ ఉంటుంది. అక్కడి నుంచి కొండపైకి రైలుమార్గం అందుబాటులో ఉంది. 21 కిలోమీటర్ల దూరం.. టాయ్ ట్రైన్‌లో భలేగా సాగుతుంది. కొండలు, గుట్టల నడుమ రెండుగంటల పాటు సాగే రైలు ప్రయాణం మరచిపోలేని అనుభూతినిస్తుంది.**

### క్యాంప్‌లో సందడి

ప్రబల్‌గడ్, కళావతి దుర్గం ట్రెక్కింగ్ ఈ కొండల సమీపంలో ఉన్న ఠాకూర్‌వాడి నుంచి మొదలవుతుంది. పలు అడ్వెంచర్ క్లబ్‌లు ఠాకూర్‌వాడి, ప్రబల్‌మాచిల్లో క్యాంప్‌లు నిర్వహిస్తాయి. అక్కడి నుంచి ఉదయాన్నే ట్రెక్కింగ్ మొదలవుతుంది. సాయంత్రానికి మళ్లీ కిందికి చేరుకుంటారు. బేస్‌క్యాంప్ దగ్గర టెంట్‌హౌస్‌లు ఉంటాయి. నైట్‌ఫైర్ క్యాంప్‌లు నిర్వహిస్తారు. రాత్రంతా ఆటపాటలుంటాయి. క్యాంప్ నిర్వాహకులే భోజన వసతి కల్పిస్తారు. చిన్న చిన్న హోటళ్లూ ఉంటాయి.







## రెండు రోజుల్లో తిరుమల యాత్ర

పర్యాటకులకు పసందైన వినోదాన్ని అందించడానికి ఇండియన్ రైల్వే క్యాటరింగ్ టూరిజం కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఆర్‌సీటీసీ) కొత్త కొత్త ప్యాకేజీలు ప్రకటిస్తూనే ఉంటుంది. హైదరాబాద్ నుంచి తిరుమలకు విమాన ప్యాకేజీ నిర్వహిస్తోంది.

**ఎప్పుడు:** జులై 12, 19, 26, ఆగస్టు 9, 16, 23, సెప్టెంబరు 6, 13, 20

**ఎన్ని రోజులు:** ఒకరాత్రి-రెండు పగళ్లు

**ఏమేం చూపిస్తారు:** తిరుపతి, కాణిపాకం, శ్రీనివాస మంగాపురం, శ్రీకాళహస్తి, తిరుచానూరు, తిరుమల

**ప్యాకేజీలో..** విమాన టికెట్లు, వసతి, భోజన సదుపాయం, రోడ్డు ప్రయాణ సౌకర్యం (ఏసీ వాహనం), బస, ప్రయాణ బీమా, గైడు సర్వీసు



**ప్యాకేజీ ధర:** రూ. 9,970 నుంచి రూ. 11,250 (పెద్దలకు)

రూ. 9,520 నుంచి రూ. 9,390 (2-11 సం॥లోపు పిల్లలకు)

మరిన్ని వివరాలకు www.irctc-tourism.com వెబ్‌సైట్‌ని చూడండి.

## కలిసి సాగుదాం..

వారాంతాల్లో నచ్చిన చోటికి వెళ్లిపోదాం అనుకుంటున్నారా? కొండల్లో, కోనల్లో ట్రెక్కింగ్ చేయాలని ఉందా? మీ అభిరుచికి తగ్గ వారితో విహరించాలని ఉందా? అయితే మీటప్ (Meetup) అప్లికేషన్ డౌన్‌లోడ్ చేసుకోండి. మిలీనియల్స్ పర్యాటక వేదికగా పేరున్న మీటప్ సేవలు యాప్‌లో పొందవచ్చు. యాప్ ద్వారా వారాంతాల్లో ఏఏ విహారాలున్నాయో తెలుసుకోవచ్చు. నచ్చిన ప్రదేశానికి వెళ్లిపోవచ్చు.

మీరు కూడా ఈవెంట్ నిర్వహించవచ్చు. బృందాన్ని ఏర్పాటు చేయవచ్చు. అంతేకాదు మన పరిసరాల్లో ఉన్న పర్యాటక కేంద్రాల వివరాలు తెలుసుకోవచ్చు. వాటిపై ఇతర సభ్యులు రాసిన రివ్యూలను చదివేయొచ్చు.




## రాఫ్టింగ్ చల్తా నహీ!

హిమసీమల సౌందర్యం చూసి తరించాలి.. సాహస క్రీడలతో కాలాన్ని మరచిపోవాలి.. కశ్మీర్‌లో పర్యటించే వాళ్లు కోరుకునేవి ఇవే! సాహస విన్యాసాల్లో భాగంగా.. ఉరకలేసే నదుల్లో రాఫ్టింగ్ చేయకుండా ఉండలేరు. కానీ, కశ్మీర్‌లో రాఫ్టింగ్‌పై నిషేధం విధించారు. ఇటీవల పహల్గామ్, సోన్‌మార్గ్ ప్రాంతాల్లో రాఫ్టింగ్‌లో అపశ్రుతులు దొర్లాయి. ముగ్గురు యాత్రికులు ప్రాణాలు కోల్పోయారు. సరైన రక్షణ చర్యలు తీసుకోకపోవడమే దీనికి కారణమని భావించిన పర్యాటక శాఖ రాఫ్టింగ్‌కు కళ్లెం వేసింది. రాఫ్టింగ్ ఈవెంట్లు నిర్వహించే సంస్థలు తగినన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు అధికారులు. భద్రతపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నారు. వాటి అమలుపై సంతృప్తి కలిగినప్పుడే.. రాఫ్టింగ్‌పై నిషేధం ఎత్తేస్తామని చెబుతున్నారు.



Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

# బడుల హేతుబద్ధీకరణపై అధ్యయనం

- 3న రాజస్థాన్‌కు విద్యాశాఖ బృందం
- అక్కడి పరిస్థితులను తెలుసుకోనున్న అధికారులు

ఈనాడు – హైదరాబాద్

స్థానికులు అంగీకారం తెలిపితే సర్కారు బడులను హేతుబద్ధీకరణ చేయాలని భావిస్తున్న విద్యాశాఖ.. ఆ అంశంపై లోతుగా అధ్యయనం చేసేందుకు కసరత్తు జరుపుతోంది. పాఠశాలల విలీనాన్ని రెండు మూడు సంవత్సరాల క్రితమే పూర్తి చేసిన రాజస్థాన్‌లో తదనంతర పరిస్థితులు, లాభనష్టాల గురించి సమగ్రంగా తెలుసుకునేందుకు విద్యాశాఖఉన్నతాధికారుల బృందం ఆ రాష్ట్రంలో పర్యటించనుంది. వచ్చే నెల 3వ తేదీన విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టి.విజయకుమార్ తదితరులు ఆ రాష్ట్రానికి వెళ్లనున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తగ్గిపోతున్నందున పిల్లల సంఖ్యను బట్టి హేతుబద్ధీకరణ చేస్తే పలు విధాల ప్రయోజనం ఉంటుందని విద్యాశాఖ గత కొద్ది సంవత్సరాల నుంచి ఆలోచన చేస్తోంది. అంతర్గతంగా అక్కడక్కడ అదే పని చేస్తోంది. అధికారికంగా మాత్రం అలాంటిదేమీ లేదని చెబుతూ వస్తోంది. ఇటీవల మాత్రం కొందరు డీఈవోలు లిఖిత పూర్వక ఆదేశాలు ఇవ్వడం చర్చనీయాంశమైంది. హేతుబద్ధీకరణ వల్ల రెండు మూడు పాఠశాలల పిల్లలు ఒకచోటకు చేరతారని...విద్యార్థుల సంఖ్య ప్రకారం ఉపాధ్యాయులను మంజూరు చేస్తున్నందున వారి సంఖ్య కూడా పెరుగుతుందని అధికారులు అంతర్గతంగా చర్చించుకుంటున్నారు. రాజస్థాన్ రాష్ట్రంలో మొత్తం 80 వేల పాఠశాలలు ఉండగా...15 మంది విద్యార్థుల కంటే తక్కువ ఉన్న వాటిని కొన్ని కొలమానాల ప్రకారం విలీనం చేశారు. దాంతో 20 వేల పాఠశాలలు మూతపడ్డాయి. ఈ ప్రక్రియను 2014లోనే ఆ రాష్ట్రం ప్రారంభించింది. విద్యా హక్కు చట్టం నిబంధనలు పాటించాలని, వాగులు, వంకలు, కొండలు లేని చోట్ల బడులను ఉంచాలని తదితర నిబంధనలతో అక్కడి విలీన ప్రక్రియను పూర్తి చేశారు. అదే విధంగా మిగిలిన రాష్ట్రాలు చేసుకోవాలని కేంద్ర మానవ వనరుల శాఖ సైతం రెండేళ్ల క్రితం సూచించింది. పాఠశాలల విలీనాన్ని నీతి ఆయోగ్ సైతం సమర్థించింది. ప్రభుత్వ పాఠశాలలను క్రమబద్ధీకరించాలని 2018 డిసెంబరులో విడుదల చేసిన వ్యూహ పత్రంలో పేర్కొంది. 'రాజస్థాన్‌లో బడులను విలీనం చేశారు. పిల్లలకు రవాణా సౌకర్యం కల్పించారు. దాని వల్ల ఉపాధ్యాయ ఖాళీలు 60 శాతం నుంచి 33 శాతానికి తగ్గాయి. ఒక్క ఏడాదిలోనే విద్యార్థుల సంఖ్య 6 శాతం పెరిగింది.' అని తెలిపింది. అయితే బడుల విలీనం వల్ల పాఠశాలలు దూరమై బడి మానేసిన వారి సంఖ్య పెరిగిందని అక్కడి సామాజిక కార్యకర్తలు వాదిస్తున్నారు. ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్లీ పాఠశాలలను తెరిచేందుకు ప్రయత్నాలు ప్రారంభించడం గమనార్హం. మొత్తానికి అక్కడి పరిస్థితులను తెలుసుకునేందుకు బృందం రాజస్థాన్‌కు వెళ్లనుంది.

### రాష్ట్రంలో 4 వేల పాఠశాలలు...

బడుల్లో 10 మంది, ఆలోపు విద్యార్థులున్న వాటిని సమీపంలోని పాఠశాలల్లో విలీనం చేస్తే తెలంగాణలో దాదాపు 4 వేల వరకు మూతపడే అవకాశం ఉందని అంచనా. 2017-18 జిల్లా పాఠశాల విద్యా సమాచారం ప్రకారం 0-10 మంది పిల్లలున్న పాఠశాలలు 2,337 ఉన్నాయి. 2,615 మంది ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. 2018-19లో ఈ సంఖ్య 4 వేల వరకు చేరి ఉంటుందని చెబుతున్నారు. హేతుబద్ధీకరణ జరిపితే 10 వేల మంది టీచర్లు మిగులు ఉంటారని అధికార వర్గాల అంచనా.

**2017-18 లో తెలంగాణలో ఇదీ పరిస్థితి**

| విద్యార్థుల సంఖ్య | పాఠశాలలు |
|---|---|
| 0 | 793 |
| 1 | 38 |
| 2 | 74 |
| 3 | 93 |
| 4 | 135 |
| 5 | 161 |
| 6 | 178 |
| 7 | 182 |
| 8 | 200 |
| 9 | 185 |
| 10 | 298 |
| మొత్తం | 2,337 |

# దలైలామా హత్యకు ఉగ్ర కుట్ర

- ఛేదించిన కర్ణాటక పోలీసులు



బెంగళూరు, న్యూస్‌టుడే: కర్ణాటకలోని దొడ్డబళ్లాపురలో పోలీసులకు చిక్కిన బంగ్లాదేశ్ ఉగ్రవాది హబీబుర్ రెహమాన్ (30) రహస్య కార్యకలాపాలను అధికారులు గురువారం వెలుగులోకి తెచ్చారు. అజ్ఞాతవాసం గడుపుతూ, అనేక నేరపూరిత ప్రణాళికల అమలుకు ఉగ్రవాది సిద్ధమైనట్లు గుర్తించారు. ప్రముఖ బౌద్ధ గురువు దలైలామా హత్యకు కుట్ర పన్నిన విషయం కూడా బయటపడింది. రహస్య జీవనం సాఫీగా సాగడానికి అవసరమైన డబ్బుల కోసం రెహమాన్ బెంగళూరులోని వివిధ ప్రాంతాల్లో దారి దోపిడీలకు పాల్పడినట్లు అధికారులు వివరించారు. జమాత్ ఉల్ ముజాహిదీన్ బంగ్లాదేశ్ (జేఎంబి) సభ్యులందరూ ఇలానే దారి దోపిడీలు, దొంగతనాలు చేసేవారని విచారణలో రెహమాన్ వివరించినట్లు సమాచారం. ఆనేకల్ సమీపంలోని ఒక బిల్డర్ ఇంట్లోకి గతంలో తన సహచరులతో కలిసి చొరబడిన నిందితుడు తుపాకీ, మారణాయుధాలు చూపించి దోపిడీ చేశాడు. కోల్‌కతా, బిహార్‌లలో విచారణ అనంతరం బెంగళూరులో అతన్ని ఎన్ఐఏ అధికారులు గురువారం నుంచి విచారించడం ప్రారంభించారు.

### మైసూరులో హత్యకు ప్రణాళిక

మైసూరు జిల్లా పిరియా పట్టణ పరిధి బైలుకుప్ప ధార్మిక కేంద్రం, మైసూరు హెజ్జాళ సమీపంలోని శిక్షణ సంస్థకు అప్పుడప్పుడు వచ్చే దలైలామాను హత్య చేసేందుకు జేఎంబీ సభ్యులు పక్కా ప్రణాళిక సిద్ధం చేశారు. బుద్ధగయలో 2013లో, పశ్చిమ బెంగాల్‌లో 2014లో పేలుళ్లకు పాల్పడిన అనంతరం రెహమాన్ కర్ణాటకకు చేరుకున్నట్లు గుర్తించారు. నిందితులు వస్త్ర వ్యాపారం, కూలి పనులు చేసుకుంటూ తొలినాళ్లలో జీవనం సాగించారు. వైట్‌ఫీల్డ్‌లో కొందరు దళారుల సాయంతో ఆధార్ కార్డునూ పొందడం విస్మయం కలిగించే విషయం. పోలీసులకు దొరక్కుండా సహచరులతో మాట్లాడుకునేందుకు సంకేత భాషను ఉపయోగించేవాడని అధికారుల దర్యాప్తులో తేలింది. రామనగరలో మునీర్ అనే ఉగ్రవాది వద్ద రెహమాన్ కొన్నాళ్లు ఆశ్రయం పొందాడు. నిరుడు ఆగస్టులో పోలీసులకు మునీర్ చిక్కడంతో రెహమాన్ దొడ్డబళ్లాపురకు చేరుకుని ఓ మసీదులో తలదాచుకున్నాడు.

# విద్యార్థులను తీర్చిదిద్దేందుకు కృషి

- ఎన్టీఆర్ ట్రస్టు ట్రస్టీ నారా భువనేశ్వరి

మొయినాబాద్, న్యూస్‌టుడే: విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దేందుకు ఎన్టీఆర్ ట్రస్టు ఆధ్వర్యంలో విశేష కృషి చేస్తున్నట్లు ట్రస్టీ నారా భువనేశ్వరి పేర్కొన్నారు. సంస్థ విద్యార్థులు లాసెట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించి ఎన్టీఆర్ విద్యాసంస్థల ప్రతిష్ఠను పెంచారని హర్షం వ్యక్తం చేశారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం గండిపేట ఎన్టీఆర్ కుటీరంలోని ఎన్టీఆర్ జూనియర్, డిగ్రీ కళాశాల ఆవరణలో గురువారం ఏపీ, తెలంగాణ లాసెట్, క్లాట్ ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థుల 'సక్సెస్ మీట్' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తమ విద్యార్థులు క్లాట్ పరీక్షల్లో జాతీయస్థాయిలో 3, 11 ర్యాంకులు, ఏపీ, తెలంగాణ లాసెట్ ఫలితాల్లో 3, 6, 8, 9 ర్యాంకులు సాధించినట్లు వెల్లడించారు. ఇందులో అధ్యాపకుల, ఉపాధ్యాయుల పాత్ర చాలా ఉందని అభినందించారు. 2015లో 88 మంది విద్యార్థినులతో కళాశాలను స్థాపించినట్లు పేర్కొన్నారు. ఇంజినీరింగ్, వైద్యవిద్య మాత్రమే జీవితం అనుకునే విద్యార్థులను ఇతర రంగాల వైపు మళ్లించాలనే తలపుతోనే కళాశాలలో లా, సివిల్ సర్వీసెస్ కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఎన్ఎస్ ప్రసాద్, ఎన్టీఆర్ ట్రస్టు సీఈవో రాజేంద్రకుమార్, సీవోవో మోహన్‌రావు, ప్రిన్సిపళ్లు శ్రీనివాస్‌రావు, ఎస్‌జే రెడ్డి, క్యాంపస్ ఇన్‌ఛార్జి సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఓ విద్యార్థినికి ధ్రువపత్రం అందజేస్తున్న నారా భువనేశ్వరి

## గురుకుల ప్రవేశ పరీక్ష వాయిదా

ఈనాడు, హైదరాబాద్: విద్యాశాఖ పరిధిలోని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో(టీఆర్ఈఐఎస్) 2019-20 విద్యా సంవత్సరానికి 6, 7 తరగతుల్లో మిగిలిన ఖాళీల భర్తీకి ఈనెల 29న నిర్వహించతలపెట్టిన ప్రవేశ పరీక్ష వాయిదా పడింది. ఈ పరీక్షను జులై 7వ తేదీన జరుపుతామని కార్యదర్శి ఎ.సత్యనారాయణరెడ్డి ఒక ప్రకటనలోతెలిపారు. అభ్యర్థులు హాల్‌టికెట్లను జులై 5 నుంచి వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చని సూచించారు.

## ఎంసెట్ కౌన్సెలింగ్ ధ్రువపత్రాల పరిశీలన ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: ఎంసెట్ కౌన్సెలింగ్‌లో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా ధ్రువపత్రాల పరిశీలన గురువారం ప్రారంభమైంది. తొలిరోజు 10,016 మంది హాజరయ్యారు. ఈనెల 27వ తేదీ వరకు మొత్తం 48,786 మంది ధ్రువపత్రాల పరిశీలనకు స్లాట్ బుక్ చేసుకున్నారు.

## నేడు పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

ఈనాడు, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రైవేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా రుసుములు వసూలు చేస్తున్నా వాటిని నియంత్రించడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తున్నందుకు నిరసనగా శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో పాఠశాలల బంద్ నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ కేంద్ర కార్యవర్గ సభ్యుడు ప్రవీణ్‌రెడ్డి చెప్పారు. ప్రైవేట్ పాఠశాలలు విద్యా వ్యాపారం చేస్తున్నా ప్రభుత్వం స్పందించడం లేదని ఆయన విమర్శించారు.



బ్రిక్స్ దేశాల ప్రతినిధులతో వరంగల్ నిట్ అధికారులు

# నిట్‌లో బ్రిక్స్ దేశాల సదస్సు

నిట్‌క్యాంపస్ (వరంగల్), న్యూస్‌టుడే: 'శీతోష్ణస్థితిలో వస్తున్న మార్పుల నేపథ్యంలో నీటి వనరుల నిర్వహణ నమూనా' అనే అంశంపై గురువారం వరంగల్ ఎన్ఐటీలో బ్రిక్స్ దేశాల కూటమి ప్రతినిధులతో రెండు రోజుల కార్యశాలను వరంగల్ నిట్ డైరెక్టర్ ఎన్.వి.రమణారావు ప్రారంభించారు. బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, దక్షిణాఫ్రికా(బ్రిక్స్) కూటమిలో పలు పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టుల్లో వరంగల్ ఎన్ఐటీ భాగస్వామిగా చేరింది. ఈ నేపథ్యంలో వరంగల్ నిట్‌లో ఆయా దేశాల ప్రతినిధులతో కలిసి సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా శీతోష్ణస్థితిలో వస్తున్న మార్పులపై బ్రిక్స్ ప్రతినిధులు పాల్గొని పలు నమూనాల గురించి చర్చించారు. నిట్ అంతర్జాతీయ వ్యవహారాల విభాగం డీన్ కె.వి.జయకుమార్ బ్రిక్స్ దేశాల ఆర్‌అండ్‌డీ ప్రాజెక్టు ప్యానల్ సభ్యుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాజెక్టులో భాగంగా సమస్యను పరిశోధించడానికి నిపుణులు బృందాలుగా ఏర్పడి అధ్యయనం ప్రారంభించాలని నిర్ణయం తీసుకున్నారు.

## నర్సింగ్ సేవలకు 'అస్కా సలోమీ'కి అత్యున్నత పురస్కారం



ఈనాడు, హైదరాబాద్: ప్రభుత్వ వైద్యంలో నర్సింగ్ వృత్తిలో విశేష సేవలందించినందుకు అస్కా సలోమీకి అత్యున్నత పురస్కారం లభించింది. నర్సింగ్ వృత్తిలో అత్యంత ప్రతిష్ఠాత్మక పురస్కారంగా భావించే 'జాతీయ ఫ్లోరెన్స్ నైటింగేల్ నర్సెస్ అవార్డు-2019' ఆమెను వరించింది. తెలంగాణ రాష్ట్రం నుంచి వైద్య ఆరోగ్య శాఖ ప్రతిపాదించిన ఈమె పేరును కేంద్ర ఆరోగ్య కుటుంబ మంత్రిత్వశాఖ ఆమోదించింది. ఈ మేరకు గురువారం దేశవ్యాప్తంగా పురస్కార గ్రహీతల జాబితాను విడుదల చేసింది. అస్కా సలోమీ 2009లో గాంధీ నర్సింగ్ కళాశాల నుంచి ప్రధానాచార్యులుగా పదవీ విరమణ పొందారు. ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని పొందిన సలోమీని నర్సింగ్ అసోసియేషన్ అభినందించింది.

# అనుమతిలేని సాంకేతిక విద్యాసంస్థలు 264

- ఆంధ్రప్రదేశ్‌లో 7, తెలంగాణలో 35
- తెలుగు రాష్ట్రాల్లో 8 ఆర్కిటెక్చర్ కళాశాలలకూ అనుమతులు లేవు

ఈనాడు, దిల్లీ: దేశవ్యాప్తంగా యూజీసీ, ఏఐసీటీఈ అనుమతులు లేని విద్యాసంస్థలు 380 ఉన్నాయని కేంద్ర మానవ వనరుల అభివృద్ధిశాఖ మంత్రి రమేష్ పోఖ్రియాల్ తెలిపారు. రాజ్యసభలో గురువారం ఆయన ఓ లిఖితపూర్వక ప్రశ్నకు సమాధానమిచ్చారు. మొత్తం అనుమతులు లేనివాటిలో 264 సాంకేతిక, 116 ఆర్కిటెక్చర్ కాలేజీలున్నట్లు చెప్పారు. ఇందులో ఆంధ్రప్రదేశ్‌లో 7, తెలంగాణలో 35 సాంకేతిక విద్యాసంస్థలు ఉన్నట్లు తెలిపారు. అలాగే రెండు తెలుగురాష్ట్రాల్లో 8 ఆర్కిటెక్ట్ విద్యాసంస్థలకు అనుమతులు లేవన్నారు. వీటి వివరాలు ఏఐసీటీఈ వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు చెప్పారు. సంస్థ ఆదేశాల మేరకు ఈ విద్యాసంస్థలపై సంబంధిత రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏపీ, తెలంగాణల్లో అనుమతిలేని సంస్థల వివరాలు www.eenadu.net లో..

## ఎన్‌సీటీఈ రుసుముల కమిటీ ఛైర్మన్‌గా ఘంటా రమేష్



ఈనాడు, హైదరాబాద్: జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి(ఎన్‌సీటీఈ) రుసుముల కమిటీ ఛైర్మన్‌గా ఆచార్య ఘంటా రమేష్ నియమితులయ్యారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఆయన ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఆచార్యుడిగా ఉన్నారు. ఈ కమిటీలో మరో ముగ్గురు సభ్యులుగా ఉంటారు. దేశంలోని సుమారు 20 వేల బీఈడీ, 16 వేల డీఈడీ కళాశాలల్లో నాణ్యమైన విద్య అందించేందుకు ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ఎంత రుసుం ఉండాలన్న అంశంపై ఈ కమిటీ అధ్యయనం చేసి నివేదిక అందించనుంది. వచ్చే నెలాఖరులోగా నివేదిక సమర్పించాల్సి ఉంది.

## 30న బీసీ జడ్పీ ఛైర్‌పర్సన్లు, ఎంపీపీలకు అభినందన

### రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వెల్లడి

ఈనాడు, హైదరాబాద్: కొత్త జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్లుగా, మండల పరిషత్ అధ్యక్షులుగా, జడ్పీటీసీ సభ్యులుగా ఎన్నికైన బీసీ వర్గాల వారికి ఈ నెల 30న హైదరాబాద్ బేగంపేటలో ఆత్మీయ అభినందన సమావేశం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఈ సమావేశం ప్రారంభమవుతుందని, అన్ని జిల్లాల నుంచి ప్రజాప్రతినిధులు పాల్గొంటారని చెప్పారు. మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, శ్రీనివాస్‌గౌడ్, ఈటల రాజేందర్‌లు ముఖ్య అతిథులుగా హాజరవుతారని వెల్లడించారు.

# కొత్త కోర్సుల అనుమతికి బ్రేక్

- కాలేజీలు సిద్ధమైనా అనుమతించని విద్యాశాఖ
- సర్కారే నిర్ణయించాలన్న జేఎన్‌టీయూహెచ్

ఈనాడు–హైదరాబాద్: రాష్ట్రంలో కొత్తగా ఇంజినీరింగ్ కళాశాలలు వద్దంటున్న విద్యాశాఖ..నూతన కోర్సులు ప్రవేశపెట్టేందుకు యాజమాన్యాలు ముందుకొచ్చినా అనుమతించడం లేదు. జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని నాలుగు ప్రముఖ కళాశాలలు బీటెక్‌లో కృత్రిమ మేధ, కంప్యూటర్ సైన్స్..ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ(సీఎస్ఐటీ), బిజినెస్ అనలిటిక్స్ సంబంధిత కోర్సులను ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రారంభించుకుంటామని కోరాయి. ఈ మేరకు అనుమతి ఇవ్వాలని వీఎన్ఆర్ విజ్ఞానజ్యోతి, సీవీఆర్, అనురాగ్‌తో పాటు మరో కళాశాల జేఎన్‌టీయూహెచ్‌కు దరఖాస్తు చేశాయి. అంతకుముందు అవి అఖిల భారత సాంకేతిక విద్యామండలి (ఏఐసీటీఈ) ఆమోదం పొందాయి. ఇక జేఎన్‌టీయూహెచ్ ఆయా కళాశాలలను తనిఖీ చేసి, ఆ కోర్సులకు తగిన మౌలిక వసతులు ఉన్నాయని పేర్కొంటూ అనుబంధ గుర్తింపు ఇవ్వాలి. అయితే కొత్తగా ఇంజినీరింగ్ కోర్సులు వద్దంటూ గత కొద్ది సంవత్సరాలుగా రాష్ట్రప్రభుత్వం ఏఐసీటీఈకి లేఖ రాస్తోంది. ఈ క్రమంలో కొత్త కోర్సులకు అనుమతిపై ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాలంటూ జేఎన్‌టీయూహెచ్ దస్త్రాన్ని విద్యాశాఖకు పంపింది. ఆ శాఖ ఇంకా తేల్చలేదు. ఒక వైపు ఏఐసీటీఈ నియమించిన బీవీఆర్ మోహన్‌రెడ్డి కమిటీ బీటెక్ స్థాయిలోనే తాజా సాంకేతికతలపై కోర్సులను ప్రవేశపెట్టాలని సూచించిందని, అందుకే ఐఐటీ హైదరాబాద్ బీటెక్ కృత్రిమ మేధ ప్రారంభిస్తోందని, అందుకు భిన్నంగా విద్యాశాఖ వ్యవహరిస్తోందని కొందరు విమర్శిస్తున్నారు. 'యూజీ స్థాయిలో అదీ అనుబంధ కళాశాలల్లో స్పెషలైజేషన్ కోర్సులు పెడితే అందుకు తగిన బోధనా సిబ్బంది దొరకడం కష్టమని, అంతేకాకుండా వాటిపై ప్రభుత్వస్థాయిలో నిర్ణయం తీసుకోవాల్సి ఉందని విద్యాశాఖకు పంపించాం' అని జేఎన్‌టీయూహెచ్ అధికారి ఒకరు తెలిపారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం పరిధిలోని స్టాన్లీ కళాశాల సైతం బీటెక్ కృత్రిమ మేధ కోర్సు ప్రవేశపెట్టేందుకు ఏఐసీటీఈ నుంచి ఆమోదం పొందింది. దానికీ ప్రభుత్వం అనుమతి ఇవ్వలేదు. అందువల్ల ఆ కోర్సులను ఎంసెట్ కౌన్సెలింగ్‌లో చేర్చడం లేదు.

## న్యాయసేవాధికార సంస్థ కార్యాలయం ప్రారంభం

ఈనాడు, హైదరాబాద్: హైకోర్టు ఆవరణలో గురువారం తెలంగాణ రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థ కార్యాలయాన్ని ప్రధాన న్యాయమూర్తి- సంస్థ ప్యాట్రన్ ఇన్ చీఫ్ జస్టిస్ ఆర్.ఎస్.చౌహాన్ ప్రారంభించారు. దీంతో ఇప్పటివరకు సిటీ సివిల్ కోర్టు ఆవరణలో కొనసాగుతున్న సంస్థను హైకోర్టు ప్రాంగణంలోని భవనంలోకి తరలించినట్లయింది. ఇక్కడ మీడియేషన్ సెంటరుతో పాటు సమావేశ మందిరాలన్నింటినీ సమకూర్చారు. సీజే ఈ కార్యాలయాన్ని ప్రారంభించిన అనంతరం పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ ఎగ్జిక్యూటివ్ ఛైర్మన్ జస్టిస్ పి.వి.సంజయ్‌కుమార్‌తో పాటు న్యాయమూర్తులు ఎం.ఎస్.రామచంద్రరావు, ఎ.రాజశేఖర్‌రెడ్డి, షమీమ్ అక్తర్, అమర్‌నాథ్‌గౌడ్, సంస్థ సభ్యకార్యదర్శి సంతోష్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ బి.ఎస్.ప్రసాద్, న్యాయవాదులు, రిజిస్ట్రార్లు పాల్గొన్నారు.




కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న సీజే చౌహాన్. చిత్రంలో న్యాయమూర్తులు సంజయ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి, షమీమ్ అక్తర్

# ఎంఫిల్ కోర్సు రద్దు

- జాతీయ నూతన విద్యావిధానం ముసాయిదాలో ప్రతిపాదన
- కేంద్రీయ విశ్వవిద్యాలయాలపై అధిక ప్రభావం

ఈనాడు, హైదరాబాద్: మాస్టర్ ఆఫ్ ఫిలాసఫీ(ఎంఫిల్) కోర్సు రద్దు కానుంది. జాతీయ నూతన విద్యా విధానంపై నియమించిన కస్తూరి రంగన్ కమిటీ ఈ ప్రతిపాదన చేసింది. దేశవ్యాప్తంగా కొన్నేళ్లుగా ఎంఫిల్ కోర్సును వివిధ విశ్వవిద్యాలయాలు అందించడం తగ్గించాయి. పలు కేంద్రీయ విశ్వవిద్యాలయాలు మాత్రం అందిస్తున్నాయి. సైన్స్ కోర్సుల్లో దశాబ్దం క్రితమే రద్దు చేశారు. మానవీయ శాస్త్రాల్లో కొనసాగిస్తున్నారు. నాలగేళ్ల డిగ్రీని ప్రవేశపెడుతుండటం... పీజీలోనూ పరిశోధనపై కేంద్రీకరిస్తుండటం వల్ల ఈ కోర్సు అవసరం లేదని కమిటీ ప్రతిపాదించింది. ఎంఫిల్ కాలవ్యవధి ఏడాది. అది పూర్తయిన తర్వాత పీహెచ్‌డీలో ప్రవేశించవచ్చు. ప్రస్తుతం రాష్ట్ర విశ్వవిద్యాలయాల్లో ఒక్క తెలుగు వర్సిటీలో మాత్రమే ఆ కోర్సు నడుస్తోంది. కేంద్రీయ విశ్వవిద్యాలయాలైన హెచ్‌సీయూ, ఇఫ్లూ, ఉర్దూ విశ్వవిద్యాలయాల్లో కొనసాగుతోంది. హెచ్‌సీయూలో ఆర్ట్స్, హ్యుమానిటీస్ విభాగాల్లో ఏటా దాదాపు 100 సీట్లు భర్తీ చేస్తారు. గడువులో పూర్తిచేసే వారు 15 శాతం మంది కంటే ఎక్కువ ఉండరని ఉపకులపతి ఆచార్య అప్పారావు పొదిలె చెప్పారు. తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య ఎస్వీ సత్యనారాయణ మాట్లాడుతూ ఎంఫిల్ ద్వారా పరిశోధనపై కొంత అవగాహన పెంపొందించుకుంటారని, ఇంకా ఆసక్తి ఉన్నవారు పీహెచ్‌డీ చేయడానికి ముందుకు వస్తారని చెప్పారు. తాము ఈ విద్యా సంవత్సరం కూడా ఎంఫిల్ కొనసాగిస్తామన్నారు.

## ఒకే కుటుంబంలో నలుగురు యువతుల ఆత్మహత్యాయత్నం

జడ్చర్ల గ్రామీణం, న్యూస్‌టుడే: ఒకే కుటుంబంలోని నలుగురు యువతులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలో గురువారం ఈ ఘటన చోటు చేసుకుంది. జడ్చర్ల మండలం పరిధిలోని గ్రామానికి చెందిన ఓ కుటుంబంలో ఆరుగురూ ఆడపిల్లలే ఉన్నారు. ఎవరికీ వివాహం కాలేదు. ఆరుగురిలో అయిదో అమ్మాయి బుధవారం నుంచి కనిపించకుండా పోయింది. ఆమె గురించి వెతకగా ఓ యువకుడితో వెళ్లినట్లు తెలిసింది. తమకన్నా చిన్నది ఇంటి నుంచి వెళ్లిందని, కుటుంబం పరువు పోయిందని మనస్తాపానికి గురైన ఆమె అక్కలు నలుగురు క్రిమి సంహారక మందు తాగారు. ఈ సమయంలో వారిని అడ్డుకోకుండా అందరిలో చిన్నదైన అమ్మాయిని, తల్లిని గదిలో ఉంచి గడియపెట్టారు. తల్లి, చిన్న అమ్మాయి తప్పించుకుని బయటకు వచ్చి కేకలు వేయటంతో గ్రామస్థులు నలుగురిని స్థానిక బాదేపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మహబూబ్‌నగర్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలిపారు.

# ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సహకరిస్తాం

- పనివేళల మార్పు, ఇతర సూచనలను పాటిస్తాం
- జీహెచ్ఎంసీ ప్రతిపాదనపై ఐటీ సంస్థల స్పందన



సమావేశంలో మాట్లాడుతున్న జీహెచ్ఎంసీ కమిషనర్ దానకిషోర్. చిత్రంలో శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హరిచందన, సైబరాబాద్ పోలీసు కమిషనర్ సజ్జనార్ తదితరులు

ఈనాడు, హైదరాబాద్: హైటెక్‌సిటీ రహదారులపై ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి తమ నుంచి పూర్తి సహకారం ఉంటుందని ఐటీ సంస్థల ప్రతినిధులు పేర్కొన్నారు. వర్ష సూచనలు ఉన్నప్పుడు పనివేళల మార్పు, ఉద్యోగులను దశలవారీగా ఇళ్లకు పంపించాలన్న జీహెచ్ఎంసీ ప్రతిపాదనలు ఆమోదయోగ్యమని స్పష్టం చేశారు. గచ్చిబౌలి, మాదాపూర్, హైటెక్‌సిటీ తదితర ప్రాంతాల్లోని ఐటీ సంస్థల ప్రతినిధులతో జీహెచ్ఎంసీ కమిషనర్ ఎం.దానకిషోర్, సైబరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్ గురువారం సమావేశం నిర్వహించారు. దానకిషోర్ మాట్లాడుతూ.. వరద నాలాల వ్యవస్థ సామర్థ్యానికి తగ్గట్టు లేకపోవడం వల్ల ఐటీ కారిడార్‌లో చిన్నపాటి వర్షానికే రోడ్లపై నీరు నిలుస్తోందన్నారు. సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామని, ఐటీ సంస్థల సహకారం లేకుండా ట్రాఫిక్ ఇక్కట్లు తీరే పరిస్థితి లేదన్నారు. వర్ష సూచనలున్నప్పుడు పనివేళలను మార్చుకోవాలని కోరారు. సమావేశానికి 50కిపైగా ఐటీ సంస్థల నుంచి 150 మంది ప్రతినిధులు హాజరయ్యారు. వారంతా జీహెచ్ఎంసీ ప్రస్తావించిన అంశాలతో ఏకీభవించారు. సౌకర్యాల కల్పనకు అధికారులు కృషి చేయాలని కోరుతూనే.. ట్రాఫిక్ సమస్యల నుంచి ఐటీ కారిడార్‌ను గట్టెక్కించేందుకు ముందుకెళ్తామని అన్నారు. వర్షం సూచనలు, రహదారులపై ఉన్న రద్దీని గంట ముందుగా తెలియజేస్తే. .తగ్గట్లు నిర్ణయం తీసుకుంటామని సంస్థల ప్రతినిధులు హామీ ఇచ్చారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ హరిచందన, ఇన్‌ఫోపియర్స్ సంస్థ సీఈవో భరణి అరోల్, హైసియా అధ్యక్షుడు మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ అవకాశాలు

VARDHAMAN COLLEGE OF ENGINEERING
(AUTONOMOUS)
(Approved by AICTE, New Delhi, Affiliated to JNTUH & NAAC accredited with 'A' Grade)
SHAMSHABAD, HYDERABAD - 501218.

NOTIFICATION FOR STAFF RECRUITMENT
Applications are invited for the posts of
PROFESSORS / ASSOCIATE PROFESSORS / ASST. PROFESSORS in
♦ Civil Engineering ♦ Mechanical Engineering
♦ Computer Science and Engineering (*Preference will be given to AI, ML, Data Science and Cloud Computing expert faculty)
♦ Electronics and Communication Engineering
♦ Electrical and Electronics Engineering ♦ Information Technology ♦ MBA
♦ Physics, Chemistry, Mathematics, English, Humanities & Social Sciences

Applications are also invited for the following non-teaching posts
1. Assistant Librarians / Library Assistants (Regular mode only)
2. Wardens & Physical Directors (both Male & Female)
3. Trainers : Aptitude / Technical / Soft Skills / Vocational / Foreign Languages (German, Spanish, French etc.)
4. Programmers in CSE & Technical Staff in CE/ME/ECE/EEE/Physics/Chemistry)
5. Web Designers, Data Entry Operators, Office Assistants
6. Company Secretary, Student Counsellors, Steno

NOTE : (1) Qualification, experience and pay scales are as per AICTE. (2) Candidates with Ph.D. degree will be preferred for the teaching posts. (3) Last date to apply online is 04-07-2019. (4) Candidates applied earlier, need not apply.

To apply online : www.vardhaman.org/careers
Date : 28-06-2019 - PRINCIPAL

MRF requires
OPERATIONAL ASSISTANTS FOR SALES DIVISION
MRF is India's largest tyre manufacturer with an annual turnover exceeding Rs.15,000 crores and the only Indian tyre company which is ranked 15th amongst the Top Global Tyre Companies in the world.
Male candidate - Graduate / Post-graduate in Commerce with 50% marks and above, having a minimum of 2 years' accounting experience, willing to work in Sales Offices anywhere in the country.
Age group - 22 to 26 years. Familiarity with computer operations in MS-Office and Tally is essential.
Salary will not be a constraint for the right candidate.
Interested candidates may apply through our website www.mrftyres.com/careers by attaching a detailed resume clearly mentioning current salary, email address and contact number along with a recent passport size photograph within 7 days of this advertisement.
The Human Resources Department,
MRF Limited
114, Greams Road, Chennai - 600 006.
www.mrftyres.com/careers



A for Appointments
ప్రత్యేక ధరకే 'ఈనాడు'లో ఉద్యోగ ప్రకటనలు
ఈనాడు
అలుగునూర్, కరీంనగర్
Cell: 90001 80623

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

ఈనాడు బిజినెస్



# ఎంజీ మోటార్ హెక్టార్

ధరల శ్రేణి రూ.12.18-16.88 లక్షలు

**గురుగ్రామ్:** ఎంజీ మోటార్ ఇండియా తమ స్పోర్ట్స్ వినియోగ వాహనం (ఎస్‌యూవీ) 'హెక్టార్'ను విపణిలోకి విడుదల చేసింది. పరిచయ ధరల శ్రేణిని రూ.12.18-16.88 లక్షలుగా ప్రకటించింది. జులై తొలి వారం నుంచి వినియోగదారులకు ఈ వాహనాలు అందించబోతోంది. భారత్‌లో కంపెనీ విడుదల చేస్తున్న తొలి మోడల్ హెక్టార్ కావడం విశేషం. ఈ ఏడాది చివర్లో విద్యుత్ ఎస్‌యూవీ 'ఈజెడ్‌ఎస్'ను కూడా విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తోంది. వచ్చే ఏడాది కంపెనీ మరో రెండు మోడళ్లను భారత్‌లో విడుదల చేస్తుందని సమాచారం. తాజాగా విడుదల చేసిన హెక్టార్ మోడళ్లకొస్తే 1.5 లీటర్ టర్బోఛార్జ్‌డ్ పెట్రోల్, 2 లీటర్ డీజిల్ ఇంజిన్ మోడళ్లు అందుబాటులో ఉన్నాయి. భారత్ కోసమే ప్రత్యేకించిన 300 రకాల సదుపాయాలున్నాయని సంస్థ తెలిపింది. పెట్రోల్ వేరియంట్‌లో 48 వోల్ట్ హైబ్రిడ్ ఆప్షన్ కూడా ఉంది. 'జూన్ 4 నుంచి ప్రీ బుకింగ్‌లు మొదలుపెట్టాం. ఇప్పటివరకు 10,000కు పైగా వాహనాలను వినియోగదారులు బుకింగ్ చేసుకున్నారు. వచ్చే నెల తొలి వారం నుంచి వారికి డెలివరీ చేస్తామ'ని ఎంజీ మోటార్ ఇండియా ప్రెసిడెంట్, మేనేజింగ్ డైరెక్టర్ రాజీవ్ చాబా వెల్లడించారు. గుజరాత్‌లోని ప్లాంటు సహా దేశీయంగా రూ.2,200 కోట్ల పెట్టుబడి పెట్టామని, నెలకు 2,000 వాహనాలు తయారు చేయగలమని తెలిపారు.

# బీఎండబ్ల్యూ సూపర్‌బైక్‌లు



ధరల శ్రేణి రూ.8.5-22.95 లక్షలు

గురువారం దిల్లీలో విడుదల చేసిన బీఎండబ్ల్యూ కొత్త బైక్‌తో బాలీవుడ్ నటుడు షాహిద్ కపూర్

**దిల్లీ:** జర్మనీకి చెందిన విలాసవంత వాహన తయారీ సంస్థ బీఎండబ్ల్యూ గ్రూపు సంస్థ బీఎండబ్ల్యూ మోటార్డ్ తమ సూపర్‌బైకుల్ని భారత్‌లో గురువారం విడుదల చేసింది. బీఎండబ్ల్యూ ఎస్ 1000 ఆర్ ఆర్ శ్రేణిలో రూపొందిన ఈ బైకుల ధరలు రూ.8.50-22.95 లక్షలని కంపెనీ తెలిపింది. సూపర్‌బైక్‌లపై భారత యువతకు పెరుగుతున్న ఆసక్తిని దృష్టిలో ఉంచుకుని వీటిని ఆవిష్కరించినట్లు కంపెనీ తెలిపింది. 'ఆసియా పసిఫిక్‌లో భారత్ మా అతి పెద్ద మూడో విపణిగా అవతరిస్తుందని అంచనా వేస్తున్నాం. గత ఏడాది ఇది అయిదో స్థానంలో ఉంద'ని బీఎండబ్ల్యూ మోటార్డ్ ఆసియా-పసిఫిక్ చైనా, రష్యా, ఆఫ్రికా అధిపతి డిమిట్రిస్ రాప్టిస్ వెల్లడించారు. ప్రస్తుతం బీఎండబ్ల్యూ మోటార్డ్‌కు విక్రయాల పరంగా చైనా అతి పెద్ద విపణిగా ఉంది. గత ఏడాది భారత విపణిలో కంపెనీ 2,187 వాహనాల్ని విక్రయించింది. ఈ ఏడాది విక్రయాలపై ఇంకా ఎలాంటి అంచనాల్ని ప్రకటించలేదు.

# టోరా క్యాబ్స్ సేవలు ఆరంభం

**ఈనాడు, హైదరాబాద్:** కొరియా సంస్థ భాగస్వామ్యంతో ఏర్పాటైన టోరా క్యాబ్స్ టెక్నాలజీస్ సర్వీసెస్ అనే సంస్థ దేశీయంగా క్యాబ్ సేవల్లోకి అడుగుపెట్టింది. ఈ సంస్థ తాజాగా హైదరాబాద్‌లో కార్యకలాపాలు ప్రారంభించింది. మొబైల్ యాప్ ఆధారిత క్యాబ్ సేవల్లో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టాలనేది తమ లక్ష్యమని గురువారం ఇక్కడ జరిగిన సమావేశంలో సంస్థ డైరెక్టర్ ఎస్‌బీ షిన్, మార్కెటింగ్ డైరెక్టర్ కవితా భాస్కరన్ తెలిపారు. తమ క్యాబ్ డ్రైవర్లు వినియోగదార్ల నుంచి వసూలు చేసే మొత్తంలో తాము ఎటువంటి కమీషన్ తీసుకోవడం లేదని వారు పేర్కొన్నారు. కేవలం తమకు రోజు వారీ చందా రూ.199 చొప్పున నెలలో 25 రోజులకు మాత్రమే చెల్లిస్తే సరిపోతుందని తెలిపారు. దీనివల్ల క్యాబ్ డ్రైవర్లకు ఎక్కువ ఆదాయం ఉంటుందని అన్నారు. అధిక డిమాండ్ ఉన్న సమయంలో అధిక ఛార్జీలు వసూలు చేసే విధానానికి కూడా తాము వ్యతిరేకమని కవితా భాస్కరన్ వివరించారు. ఈ కొత్త పద్ధతుల ద్వారా క్యాబ్ సేవల రంగంలో మార్పులు తీసుకురావాలనేది తమ ఉద్దేశమని చెప్పారు. ఈ నెలలోనే హైదరాబాద్‌లో సేవలు ప్రారంభించిన తమకు ఇప్పటికే 1500 మంది క్యాబ్ డ్రైవర్లు ఉన్నట్లు, ఈ సంఖ్య ఇంకా పెరుగుతోందని వివరించారు.

# ఆ ప్యాకెట్లపై ఎరుపు రంగు హెచ్చరికలు

అధిక మోతాదులో కొవ్వు, చక్కెర, ఉప్పు ఉన్న పదార్థాలకు కొత్త నిబంధనలు

**దిల్లీ:** అధిక మోతాదులో కొవ్వు, చక్కెర, ఉప్పు ఉండే ఆహార పదార్థాలను ప్యాకింగ్ చేసేటప్పుడు, ఆ ప్యాకింగ్ ముందు భాగంలో ఎరుపు రంగు కోడ్‌తో ఒక లేబుల్ అతికించాల్సి ఉంటుంది. ఈ మేరకు కొత్త లేబులింగ్ మార్గదర్శకాలను ఆహార భద్రత, ప్రమాణాల మండలి (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ప్రతిపాదించింది. ఈ మార్గదర్శకాలకు సంబంధించి ముసాయిదా నోటిఫికేషన్ సిద్ధంగా ఉందని వెల్లడించింది. 'ఆహార పదార్థాల్లో ఏయే ముడిసరకు కలిసి ఉందో వినియోగదారులు తెలుసుకోవాలన్నదే కొత్త లేబులింగ్ మార్గదర్శకాల వెనక ఉద్దేశం. ఆ ఆహార పదార్థంలో ఏవేవి ఉన్నాయో తెలుసుకుని, దానిని కొనాలా? వద్దా? అనే విషయంలో వినియోగదారు తన నిర్ణయాన్ని తీసుకునే వీలుంటుంద'ని ఎఫ్ఎస్ఎస్ఏఐ వెల్లడించింది. ప్రతిపాదిత ఆహార భద్రత, ప్రమాణాల (లేబులింగ్, డిస్‌ప్లే) మార్గదర్శకాల ప్రకారం.. ప్యాకేజ్డ్ ఫుడ్ కంపెనీలు ఆహార పదార్థాల్లో కేలరీలు, కొవ్వు, చక్కెర, ఉప్పు ఎంత మేర ఉందనే సమాచారాన్ని ప్యాకేజీ ముందుభాగంలో తెలియజేయాల్సి ఉంటుంది. అధిక పరిమాణంలో కొవ్వు, చక్కెర, ఉప్పు ఉండే ఆహార పదార్థాల ప్యాకేజింగ్‌పై ఎరుపు రంగు లేబులింగ్ తప్పనిసరి. ఈ మార్గదర్శకాలు రాబోయే మూడేళ్లలో దశలవారీగా అమల్లోకి వస్తాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ పేర్కొంది.

## హానర్ ఫోన్లకు ఆండ్రాయిడ్ సేవలు కొనసాగుతాయ్

**దిల్లీ:** హానర్ 20 శ్రేణి సహా అన్ని స్మార్ట్‌ఫోన్లకు గూగుల్ నుంచి ఆండ్రాయిడ్ అప్‌డేట్స్ లభిస్తాయని చైనా స్మార్ట్‌ఫోన్ల సంస్థ హువావే ప్రకటించింది. అన్ని హానర్ స్మార్ట్‌ఫోన్లు, టాబ్లెట్లకు సెక్యూరిటీ ప్యాచ్‌లు, ఆండ్రాయిడ్ అప్‌డేట్‌లు లభించడం కొనసాగుతుందని హానర్ ఇండియా తెలిపింది. భద్రతాపరమైన చిక్కులు వస్తున్నాయన్న ఆరోపణలతో హువావేకు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్ సేవలు అందించరాదని గూగుల్ సహా అన్ని కంపెనీలపై అమెరికా ప్రభుత్వం నిషేధం విధించిన విషయం తెలిసిందే. అమెరికా నిషేధం తర్వాత.. హువావేపై ప్రభుత్వ నిబంధనలను పాటిస్తామని గూగుల్‌కు చెందిన ఆండ్రాయిడ్ వెల్లడించింది. ఇప్పటికే తమ ఫోన్లు వినియోగిస్తున్న వారు, కొత్తగా కొనుగోలు చేస్తున్న వారు గూగుల్ ప్లే, గూగుల్ ప్లే ప్రొటెక్ట్ యాప్‌లను సాధారణంగానే వినియోగించుకోవచ్చని హానర్ స్పష్టం చేసింది.

## ఫోర్డ్‌లో 12000 మంది ఉద్యోగుల తొలగింపు

**ఫ్రాంక్‌ఫర్ట్:** పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఐరోపాలో మొత్తం 12,000 ఉద్యోగాల కోత విధించడానికి సన్నాహాలు చేస్తున్నట్లు అమెరికా వాహన సంస్థ ఫోర్డ్ ప్రకటించింది. ఇప్పటికే జర్మనీలో ప్రకటించిన 5,400 ఉద్యోగాలు, వేల్స్‌లో 1700 ఉద్యోగాల కోత ఈ ప్రణాళికలోనే ఉన్నట్లు తెలిపింది. ఈ ఏడాది, వచ్చే ఏడాదిలో కంపెనీ బ్రిటన్, ఫ్రాన్స్, రష్యా, స్లొవేకియాల్లో ఆరు ప్లాంట్‌లను విక్రయించనున్న నేపథ్యంలో ఉద్యోగాల కోతలను ప్రకటించింది. స్వచ్ఛంద విరమణ కార్యక్రమంలో భాగంగానే ఉద్యోగాల కోత ఉంటుందని ఫోర్డ్ వెల్లడించింది. ఐరోపాలో ఫోర్డ్‌కు 24 ఫ్యాక్టరీలు, దాదాపు 51,000 మంది ఉద్యోగులు ఉన్నారు. వేల్స్‌లో 1, రష్యాలో 3, స్లొవేకియా, ఫ్రాన్స్‌ల్లో ఒక్కొక్కటి చొప్పున ఫ్యాక్టరీలను మూసివేయనుంది.

**బీఏఎస్ఎఫ్.. 6000 ఉద్యోగాలు:** ప్రపంచ వ్యాప్తంగా 2021 నాటికి 6000 ఉద్యోగాల కోత విధించనున్నట్లు జర్మనీ రసాయనాల సంస్థ బీఏఎస్ఎఫ్ ప్రకటించింది. తద్వారా ఏడాదికి లాభాన్ని రెండు బిలియన్ల యూరోలు పెంచుకోవాలని చూస్తోంది. ప్రస్తుతం కంపెనీకి 1,22,000 మంది ఉద్యోగులు ఉన్నారు.

## కాక్స్ అండ్ కింగ్స్ చెల్లింపుల వైఫల్యం

**దిల్లీ:** రూ.150 కోట్ల వాణిజ్య పత్రాల చెల్లింపుల్లో విఫలమైనట్లు ట్రావెల్ అండ్ టూర్ సంస్థ, కాక్స్ అండ్ కింగ్స్ గురువారం ప్రకటించింది. రూ.200 కోట్ల మేర చెల్లింపులు చేయాల్సి ఉండగా, రూ.50 కోట్లు మాత్రమే చెల్లించే స్థితిలో ఉన్నామని, మిగిలిన రూ.150 కోట్ల చెల్లింపుల్లో విఫలమైనట్లు తెలిపింది. తగినంత నగదు నిల్వలు లేకపోవడానికి తోడు రేటింగ్ తగ్గింపుతో పరిస్థితి దారుణంగా తయారైందని పేర్కొంది. అంతర్గత ఆర్జన, ఆస్తుల అమ్మకం ద్వారా నిధులు సమీకరించి తమ ఆర్థిక బాధ్యతలను నెరవేరుస్తామని నియంత్రణ సంస్థలకు సమాచారమిచ్చింది.

'ఈనాడు' ఇంటర్వ్యూ — బజాజ్ అలియంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ ఎండీ అండ్ సీఈఓ **తరుణ్ ఛుగ్**



# ఆర్థిక లక్ష్యాల సాధనకే యులిప్‌లు

- అందుకే ఆదరణ పెరుగుతోంది
- జీవించి ఉన్నప్పుడూ జీవిత బీమా పాలసీల ప్రయోజనాలు
- ఆన్‌లైన్ విక్రయాల్లో మేం ముందున్నాం

**యువత ఆలోచనలు, ప్రాధామ్యాలు, వేగంగా వస్తున్న సాంకేతిక మార్పులను పరిగణనలోకి తీసుకంటే జీవిత బీమా పరిశ్రమ ముున్ముందు ఎంతో ఆకర్షణీయ వృద్ధి నమోదు చేస్తుందని బజాజ్ అలియంజ్ లైఫ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఎండీ అండ్ సీఈఓ తరుణ్ ఛుగ్ అన్నారు. జీవిత బీమా పాలసీ ద్వారా జీవించి ఉన్నప్పుడు కూడా ప్రయోజనాలు అందాలని ప్రస్తుత తరం ఆలోచిస్తోందని, దానికి తగ్గట్లుగా కొత్త పాలసీలను ఆవిష్కరించటానికి పరిశ్రమ చొరవ తీసుకుంటోందని తెలిపారు. యులిప్ (యూనిట్ లింక్డ్ ఇన్సూరెన్స్ ప్లాన్) లకు ఆదరణ పెరుగుతోందని, ప్రజలు తాము నిర్దేశించుకున్న దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలు చేరుకోడానికి ఇవి దోహదపడతాయని విశ్లేషించారు. బీమా పాలసీలు, ముఖ్యంగా యులిప్‌లను ఆన్‌లైన్లో విక్రయించడంలో తాము ఎంతో ముందున్నట్లు 'ఈనాడు'కు ఇచ్చిన ఇంటర్వ్యూలో వివరించారు. ముఖ్యాంశాలివీ..**

**? జీవిత బీమా పరిశ్రమ తీరుతెన్నులు సమీప భవిష్యత్తులో ఎలా ఉండబోతున్నాయి**

పరిశ్రమ స్థిర వృద్ధి సాధిస్తోంది. ప్రైవేటు రంగ సంస్థలు అధిక వ్యాపారాన్ని నమోదు చేస్తున్నాయి. గత ఏడాదిలో పరిశ్రమ 10-11 శాతం వృద్ధి నమోదు చేసింది. జీవిత బీమా ప్రాధాన్యాన్ని ఎక్కువ మంది గుర్తించడమే ఈ వృద్ధికి ప్రధాన కారణం. యువత ఆలోచనలు-ప్రాధామ్యాల్లో మార్పు రావటం, కొత్త తరహా పాలసీల ఆవిష్కరణ, ఆన్‌లైన్లో పాలసీల విక్రయం, పాలసీల విక్రయానికి బ్యాంకులు ప్రాధాన్యం ఇవ్వడం వంటి పరిణామాలు పరిశ్రమ విస్తృతికి దోహదపడుతున్నాయి. ముున్ముందు మరింత ఆకర్షణీయ వృద్ధిని జీవిత బీమా పరిశ్రమ సాధిస్తుందనే విశ్వాసం ఉంది.

**? పరిశ్రమలో మీ స్థానం, వృద్ధి వ్యూహాలు వివరిస్తారా**

వినియోగదార్ల అవసరాలు, వారి ఆర్థిక స్థితిగతులు, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకుని పాలసీలకు రూపకల్పన చేస్తున్నాం. యులిప్‌లు, క్రిటికల్ ఇల్‌నెస్ పథకాలు ఇందులో ఉన్నాయి. ఆన్‌లైన్లో మేం అందిస్తున్న యులిప్ పాలసీలకు ఎంతో గిరాకీ ఉంది. ఈ విభాగంలో అగ్రస్థానంలో ఉన్నాం. బంధన్ బ్యాంకు, దేనా బ్యాంకు, ఐపీపీబీ తదితర సంస్థలతో మాకు పంపిణీ ఒప్పందాలు ఉన్నాయి. 2018-19లో కొత్త వ్యాపార ప్రీమియం వసూలులో మా సంస్థ 25 శాతం వృద్ధిని నమోదు చేసింది.

**? జీవిత బీమాతో చనిపోతేనే ప్రయోజనమనే అభిప్రాయం ఉంది. దీర్ఘకాలిక ఆర్థిక ప్రణాళికలో బీమా పాలసీ భాగమని ఎక్కువ మంది భావించట్లేదు. ఈ దృక్పథంలో మార్పు వస్తోందా**

ఇది కొంతవరకూ నిజమే. అందుకే ఈ విషయంలో ప్రజాభిప్రాయాన్ని మార్చడానికి మేం కృషి చేస్తున్నాం. చనిపోతేనే కాకుండా జీవించి ఉన్నా కూడా ఎన్నో ప్రయోజనాలు బీమాతో ఉంటాయనే నమ్మకాన్ని కలిగించేందుకు భిన్న పాలసీలు ఆవిష్కరిస్తున్నాం. మనదేశంలో యువత సగటు వయస్సు 29 ఏళ్లే. అందువల్ల పాలసీదారు చనిపోయాక, కుటుంబీకులకు లభించే ప్రయోజనాలంటూ వారిని ఆకట్టుకోవటం కష్టం. జీవించి ఉన్నప్పుడు సైతం ఎంతో లబ్ధి చేకూర్చే పాలసీలను ఆవిష్కరించడంతో పాటు మార్కెటింగ్‌లో కొత్త పద్ధతులతో ఎంతో మందికి దగ్గర కాగలుగుతున్నాం. లైఫ్ కవర్ ఛార్జీలను తిరిగిచ్చే యులిప్ పాలసీని పరిశ్రమలో తొలిసారిగా మేమే తీసుకువచ్చాం.

**? కొత్త పాలసీల ఆవిష్కరణకు నియమ నిబంధనలు సానుకూలంగా ఉన్నాయా**

ఈ విషయంలో ఐఆర్‌డీఏఐ (ఇన్సూరెన్స్ రెగ్యులేటరీ అండ్ డెవలప్‌మెంట్ అథారిటీ) నుంచి ఎంతో సానుకూలత, సహకారం ఉంది. కొత్త పద్ధతులను, సాంకేతిక పరిజ్ఞానాన్ని బీమా కంపెనీలు అందిపుచ్చుకోవాలని ఐఆర్‌డీఏఐ సూచిస్తోంది. 'డిజిటల్' పద్ధతిలో పాలసీలు అందించేందుకు చొరవ తీసుకుంటోంది. సంక్లిష్టత లేకుండా సులువైన పద్ధతిలో పాలసీలకు రూపకల్పన చేయాలని స్పష్టం చేస్తోంది. పాలసీల విక్రయాన్ని సులభతరం చేసే విధానాలపై దృష్టి సారించింది. దీని వల్ల పరిశ్రమ కొత్తదనాన్ని సంతరించుకుంటోంది. వేగంగా విస్తరించేందుకు, ఎక్కువ మంది ప్రజలకు దగ్గరయ్యేందుకు అవకాశం లభిస్తోంది. ఏదైనా ఒక కొత్త పాలసీని ఒక ప్రదేశంలో విక్రయించటం ద్వారా, దాని మంచిచెడులను అధ్యయనం చేసేందుకు వీలుగా 'శాండ్ బాక్స్' పద్ధతిని ఐఆర్‌డీఏఐ రూపొందించింది. దీన్ని అనుసరించి కొత్త పాలసీలు తీసుకురావటానికి మా సంస్థలో ఉన్న 'కొత్త పాలసీల తయారీ బృందం' కృషి చేస్తోంది.

**? పంపిణీ వ్యవస్థ బలోపేతానికి మీరు తీసుకుంటున్న చర్యలేమిటి**

విస్తృత పంపిణీ విధానాలను అనుసరిస్తున్నాం. సొంత విక్రయ సిబ్బందితో పాటు, బ్యాంకులతో 'బ్యాంకష్యూరెన్స్' ఒప్పందాలు మాకు ఉన్నాయి. బీమా సలహాదార్ల ద్వారా పీఓఎస్ (పాయింట్ ఆఫ్ సేల్) ఛానల్‌నూ ఆవిష్కరించాం. సాంకేతిక పరిజ్ఞానాన్ని విరివిగా వినియోగిస్తున్నాం. పాలసీల విక్రయం మీదే కాకుండా, ఆ తర్వాత అందించాల్సిన సేవలపైనా దృష్టి సారిస్తున్నాం.

**? ఇటీవల యులిప్ పాలసీలపై అధికంగా దృష్టి పెడుతున్నారు. సంప్రదాయ జీవిత బీమా పాలసీల కంటే ఇవి ఏవిధంగా మెరుగైనవి**

వినియోగదార్లు జీవితంలో నిర్దేశించుకున్న దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను చేరుకోడానికి అనువుగా రూపొందించిన పాలసీలు ఇవి. ఇతర పెట్టుబడి సాధనాలతో పోల్చితే పెట్టుబడి ప్రయోజనం, బీమా రక్షణ ఇచ్చే వినూత్న సాధనమని చెప్పొచ్చు. లైఫ్ కవర్ ఛార్జీలు పాలసీదారుడికి వెనక్కి తిరిగి వస్తాయి. క్రమశిక్షణతో ముందుకు సాగితే ఎంతో అధిక ప్రయోజనాలను వీటి ద్వారా వినియోగదార్లు పొందొచ్చు. అందుకే ఈ పాలసీలకు అధిక ఆదరణ కనిపిస్తోంది.

**? మీ సంస్థ వ్యాపార లక్ష్యాలేమిటి**

ఎప్పటి కప్పుడు కొత్త పాలసీలను ఆవిష్కరిస్తూ వినియోగదార్లకు అధిక ప్రయోజనాలు కల్పించాలనేది మా ప్రధాన లక్ష్యం. ఆన్‌లైన్ విక్రయాలకు సంబంధించి బహుముఖంగా విస్తరించాలనుకుంటున్నాం. ఆరోగ్య బీమా, రిటైర్‌మెంట్ విభాగాలపై అధిక వృద్ధి సాధించాలని అనుకుంటున్నాం.

**? దేశీయ బీమా రంగంలో ఎటువంటి మార్పులు ఆశిస్తున్నారు. తత్ఫలితంగా ఇతర రంగాలకు సైతం మేలు జరగాలి. అందుకు ఏం చేయాలంటారు**

ఆర్థిక అవసరాలు, లక్ష్యాలు, పొదుపు- పెట్టుబడి... తదితర అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టాలి. జీవిత బీమా ప్రయోజనాలకు సంబంధించి ప్రజా చైతన్యం కోసం ఐఆర్‌డీఏఐతో కలిసి పరిశ్రమ క్రియాశీలకంగా పనిచేస్తోంది. దీనివల్ల ఎక్కువ మందికి బీమా రక్షణ లభిస్తుంది. ఆర్థిక సేవలు అందిస్తున్న సంస్థలు, ఫిన్‌టెక్ కంపెనీల మధ్య భాగస్వామ్యం పెరగాలి. అన్నింటికంటే ముఖ్యమైన అంశం- మోసాలను అరికట్టడం. దీనికి జీవిత బీమా పరిశ్రమలోని వివిధ సంస్థల మధ్య సమాచార మార్పిడి, సహకారం పెరగాలి. ఈ చర్యల వల్ల అటు వినియోగదారుడికి, ఇటు బీమా సంస్థలకు మేలు జరుగుతుంది.

– ఈనాడు, హైదరాబాద్

# చెల్లింపుల సేవలకు వాట్సాప్ సిద్ధం!

### స్థానికంగా డేటా నిల్వ కేంద్రం ఏర్పాటు

**దిల్లీ:** ఫేస్‌బుక్‌కు చెందిన మెసేజింగ్ యాప్ వాట్సాప్, డిజిటల్ చెల్లింపుల సేవలకు సిద్ధమైంది. ఇందుకోసం ఇప్పటికే దేశీయంగా డేటా నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. అంతర్జాతీయ చెల్లింపుల సంస్థలు, దేశీయ పౌరుల ఆర్థిక లావాదేవీల సమాచారాన్ని భారత్‌లోనే నిల్వ చేయాలని రిజర్వు బ్యాంక్ ఆదేశించిన విషయం తెలిసిందే. దీంతో వాట్సాప్ కూడా స్థానికంగా డేటా నిల్వ కేంద్రం ఏర్పాటు చేయక తప్పలేదు. ఐసీఐసీఐ బ్యాంక్‌తో కలిసి యునిఫైడ్ పేమెంట్స్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ) ఆధారిత సేవలను వాట్సాప్ అందించనుంది. అనంతరం యాక్సిస్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎస్‌బీఐల ద్వారా సేవలు విస్తరించనుందని సంబంధిత అధికారి ఒకరు తెలిపారు.



'స్థానికంగా డేటా కేంద్రాన్ని ఏర్పాటు చేయడాన్ని వాట్సాప్ పూర్తిచేసింది. ఇప్పుడు ఆడిట్ ప్రక్రియ నడుస్తోంది. నియంత్రణ సంస్థకు ఆడిటర్లు నివేదిక సమర్పించగానే, కంపెనీ చెల్లింపుల సేవలను మొదలుపెడుతుంది' అని తెలిపారు. భారత్‌లో డేటా నిల్వ కేంద్రాన్ని ఏర్పాటు చేసిన తర్వాత, ఆడిట్ నివేదిక అందజేయాలని ఆర్‌బీఐ పేమెంట్స్ కంపెనీలను ఆదేశించింది. ఈ ఆడిట్‌ను ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్, సెర్ట్-ఇన్‌లతో కూడిన ఆడిటర్లు నిర్వహించాలి. దీనిపై స్పందించడానికి కొత్తగా ఏమీ లేదని వాట్సాప్ వెల్లడించింది. నేషనల్ పేమెంట్ కౌన్సిల్ కూడా స్పందించడానికి నిరాకరించింది.

### ఏడాది క్రితమే ప్రయోగాత్మకంగా..

ఏడాది క్రితమే వాట్సాప్ చెల్లింపు సేవలను ప్రయోగాత్మకంగా ప్రారంభించింది. అయితే డేటా నిల్వపై ఆర్‌బీఐ ఆదేశాలు, వాట్సాప్‌ను వినియోగించుకుని తప్పుడు వార్తలు విస్తృతంగా ప్రచారం జరగడంపై ఆందోళనల వంటివి ప్రభావం చూపాయి. ఈ ఏడాది ప్రారంభంలో యాక్సిస్ బ్యాంక్‌తో కలిసి యూపీఐ ఆధారిత చెల్లింపు సేవలను అమెజాన్ ప్రారంభించిన విషయం తెలిసిందే. ఎన్‌పీసీఐ గణాంకాల ప్రకారం.. గూగుల్ పే, అమెజాన్, ఉబర్, ఓలా వంటి 39 థర్డ్ పార్టీ యాప్‌లు యూపీఐను చెల్లింపు ప్లాట్‌ఫామ్‌గా వినియోగిస్తున్నాయి.

# కాఫీపై కోలా కన్ను

### కేఫ్‌కాఫీడేలో వాటా కొనుగోలుకు చర్చలు

**బెంగళూరు:** ప్రపంచంలోనే అతిపెద్ద పానీయాల కంపెనీ అయిన కోకకోలా కాఫీ విపణిపై దృష్టి సారించినట్లుంది. 10 నెలల కిందట బ్రిటన్‌కు చెందిన కోస్టా కాఫీని 5.1 బిలియన్ డాలర్లతో సొంతం చేసుకున్న ఈ కంపెనీ తాజాగా మన దేశ సంస్థ కేఫ్ కాఫీ డేలో వాటా కోసం చూస్తోంది. బెంగళూరుకు చెందిన ఈ కంపెనీతో ప్రాథమిక చర్చలు జరుపుతున్నట్లు ఈ విషయాలతో సంబంధమున్న వ్యక్తులు తెలిపారు. ఈ ఏడాది మొదట్లో మైండ్ ట్రీలో తనకున్న వాటాను కేఫ్ కాఫీ డే వ్యవస్థాపకుడు వీజీ సిద్ధార్థ విక్రయించిన సంగతి తెలిసిందే.

**స్పందించని కంపెనీలు:** కోకకోలా (ఇండియా, సౌత్ వెస్ట్ ఏషియా) ప్రెసిడెంట్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు టి కృష్ణకుమార్ ప్రస్తుతం అట్లాంటాలో ఉంటూ ఈ చర్చల్లో పాల్గొంటున్నారని తెలుస్తోంది. కాగా, ఈ దశలో ఈ కొనుగోలు వార్తలపై స్పందించలేమని కోకకోలా ఇండియా ప్రతినిధి తెలిపారు. కేఫ్ కాఫీ డే కూడా వ్యాఖ్యానించడానికి నిరాకరించింది.

**కాఫీ డే అప్పులు తగ్గుతాయ్:** కేఫ్ కాఫీ డే తన వాటా విక్రయం ద్వారా మాతృ సంస్థ కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్ రుణ పుస్తకాల్లో ఒత్తిడిని తగ్గించుకోవడానికి వీలవుతుంది. మార్చి 31, 2019 నాటికి కాఫీ డే ఎంటర్‌ప్రైజెస్‌కు రూ.6547 కోట్ల అప్పులున్నాయి. ఇది కంపెనీ నికర విలువ రూ.2529 కోట్లతో పోలిస్తే రెండున్నర రెట్లు ఎక్కువ.

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

ఛాంపియన్




**4** వరుసగా కోహ్లి అర్ధశతకాలు. ప్రపంచ కప్‌లో గ్రేమ్ స్మిత్ (దక్షిణాఫ్రికా, 2007), ఫించ్ (ఆస్ట్రేలియా, 2019) తర్వాత ఈ ఘనత సాధించిన మూడో కెప్టెన్ విరాట్.

'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' కోహ్లి **72**

## పాయింట్ల పట్టిక

| జట్టు | మ్యా | గె | ఓ | టై/ర | పా | నె.రేట్ |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 7 | 6 | 1 | 0 | 12 | +0.906 |
| భారత్ | 6 | 5 | 0 | 1 | 11 | +1.160 |
| న్యూజిలాండ్ | 7 | 5 | 1 | 1 | 11 | +1.028 |
| ఇంగ్లాండ్ | 7 | 4 | 3 | 0 | 8 | +1.051 |
| బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | 7 | −0.133 |
| పాకిస్థాన్ | 7 | 3 | 3 | 1 | 7 | −0.976 |
| శ్రీలంక | 6 | 2 | 2 | 2 | 6 | −1.119 |
| వెస్టిండీస్ | 7 | 1 | 5 | 1 | 3 | −0.320 |
| దక్షిణాఫ్రికా | 7 | 1 | 5 | 1 | 3 | −0.324 |
| అఫ్గానిస్థాన్ | 7 | 0 | 7 | 0 | 0 | −1.634 |

మ్యా: మ్యాచ్‌లు, గె: గెలిచినవి, పా: పాయింట్లు, నె: నెట్ రన్‌రేట్

# బంతులే బుల్లెట్లయి..

## భారత బౌలర్ల ధాటికి విండీస్ విలవిల

- 143కే ఆలౌట్, సెమీస్‌కు దూరం
- కోహ్లీసేనకు భారీ విజయం
- నాకౌట్‌కు మరింత చేరువ
- మెరిసిన విరాట్, ధోని, పాండ్య

భారత్ స్కోరు 268. పసికూన అఫ్గానిస్థాన్‌తో గత మ్యాచ్‌లో 225 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకోవడానికి భారత్ ఎంతగా ఆపసోపాలు పడిందో చూశాక.. ప్రమాదకర హిట్టర్లున్న కరీబియన్ జట్టుకు ఈ స్కోరు ఏమాత్రం సరిపోతుందో అని సందేహం! క్రిస్ గేల్.. షై హోప్.. హెట్‌మయర్.. బ్రాత్‌వైట్.. వీళ్లలో ఎవరో ఒకరు నిలబడితే లక్ష్యం ఏపాటిదన్న ఆందోళన!

కానీ భారత బౌలర్లు ఈసారి అలా ఇలా విజృంభించలేదు. వాళ్ల బంతులు బుల్లెట్లలా దూసుకెళ్తుంటే.. కరీబియన్ బ్యాటింగ్ లైనప్ కకావికలైపోయింది. బంతి బంతికీ ప్రమాదం పొంచుకొస్తుంటే తమ వల్ల కాదంటూ బ్యాట్లెత్తేశారు విండీస్ హిట్టర్లు.

ఈ ప్రపంచకప్‌లో భారత జట్టు నుంచి ప్రత్యర్థులకు ప్రధాన ముప్పు బౌలర్లతోనే అని విశ్లేషకులు ఎందుకన్నారో ఈ మ్యాచ్‌తో మరోసారి రుజువు చేసింది బౌలింగ్ దళం. బ్యాటింగ్ కఠినంగా సాగిన పిచ్‌పై మొదట బ్యాట్స్‌మెన్ పోరాడి జట్టును నిలబెట్టారు. ఈ విజయంతో భారత్ సెమీస్‌కు మరింత చేరువ కాగా.. వెస్టిండీస్ నాకౌట్ రేసు నుంచి నిష్క్రమించింది.

మాంచెస్టర్

అఫ్గాన్‌తో మ్యాచ్‌లో అతి కష్టం మీద నెగ్గి తన సత్తాపై సందేహాలు రేకెత్తించిన కోహ్లీసేన.. తర్వాతి మ్యాచ్‌లో రెచ్చిపోయింది. గురువారం వెస్టిండీస్‌ను 125 పరుగుల తేడాతో చిత్తు చేసింది. 269 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన విండీస్.. షమి (4/16), బుమ్రా (2/9), చాహల్ (2/39)ల ధాటికి 143 పరుగులకే కుప్పకూలింది. 31 పరుగులు చేసిన ఆంబ్రిసే ఆ జట్టులో టాప్ స్కోరర్. కోహ్లి (72; 82 బంతుల్లో 8×4), ధోని (56 నాటౌట్; 61 బంతుల్లో 3×4, 2×6), రాహుల్ (48; 64 బంతుల్లో 6×4), పాండ్య (46; 38 బంతుల్లో 5×4) రాణించడంతో మొదట భారత్ 7 వికెట్లకు 268 పరుగులు చేసింది. ప్రతికూల పరిస్థితుల్లో కీలక ఇన్నింగ్స్ ఆడిన కోహ్లికి 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు దక్కింది. 6 మ్యాచ్‌ల్లో ఐదో విజయం సాధించిన భారత్.. 11 పాయింట్లతో (మ్యాచ్ రద్దు వల్ల ఒక పాయింట్) సెమీస్ బెర్తుకు అత్యంత చేరువలో నిలిచింది. 7 మ్యాచ్‌ల్లో ఐదో ఓటమి చవిచూసిన విండీస్ (3 పాయింట్లు) సెమీస్ రేసు నుంచి నిష్క్రమించింది. చివరి రెండు మ్యాచ్‌ల్లో గెలిచినా విండీస్ పాయింట్లు ఏడే అవుతాయి. ప్రస్తుతం నాలుగో స్థానంలో ఉన్న ఇంగ్లాండ్ ఇప్పటికే 8 పాయింట్లతో ఉన్న నేపథ్యంలో విండీస్ టాప్-4లోకి రావడానికి అవకాశం లేదు.


గేల్

**టపటపా..:** విండీస్ ఏ దశలోనూ లక్ష్యాన్ని ఛేదించేలా కనిపించలేదు. ఇటు షమి.. అటు బుమ్రా.. ఇద్దరూ కట్టుదిట్టమైన బౌలింగ్‌లో విండీస్‌కు ఆరంభంలోనే కళ్లెం వేశారు. 5 ఓవర్లకు స్కోరు 10. అదే ఓవర్లో గేల్ (6).. షమి బంతికి బోల్తా కొట్టాడు. తన తర్వాతి ఓవర్లో హోప్ (5)ను బౌల్డ్ చేశాడు షమి. స్కోరు 16/2. దీంతో విండీస్ ఆత్మరక్షణలో పడిపోయింది. ఆంబ్రిస్ (31), పూరన్ (28) నెమ్మదిగా ఇన్నింగ్స్‌ను చక్కదిద్దే ప్రయత్నం చేశారు కానీ.. జట్టు స్కోరు 71 వద్ద ఆంబ్రిస్‌ను ఔట్ చేసిన పాండ్య (1/28) భాగస్వామ్యాన్ని విడదీశాడు. దీంతో విండీస్ పతనానికి గేట్లెత్తేసినట్లయింది. స్పిన్నర్లు కుల్‌దీప్, చాహల్ స్వల్ప వ్యవధిలో రెండు వికెట్లు పడగొట్టారు. స్కోరు 98/5కు చేరుకుంది. ఆపై బుమ్రా వరుస బంతుల్లో బ్రాత్‌వైట్ (1), అలెన్ (0)లను ఔట్ చేసి విండీస్ పతనాన్ని వేగవంతం చేశాడు. రోచ్ (14 నాటౌట్), కాట్రెల్ (10) భారత్ విజయాన్ని కాస్త ఆలస్యం చేశారు.




**1** ప్రపంచకప్‌లో వెస్టిండీస్‌పై నాలుగు వికెట్ల ప్రదర్శన చేసిన భారత తొలి బౌలర్ షమి.

షమి **4/16**

### తడబడుతూనే..

అంతకుముందు భారత ఇన్నింగ్స్ ఆద్యంతం ఒడుదొడుకులతోనే సాగింది. పాకిస్థాన్‌తో మ్యాచ్‌తో పోలిస్తే.. మాంచెస్టర్‌లో పరిస్థితులు బ్యాటింగ్‌కు అంత అనుకూలంగా లేవు. సౌథాంప్టన్‌లో అఫ్గాన్‌తో మ్యాచ్‌లో మాదిరే ఇక్కడ కూడా బంతి బ్యాట్ మీదికి రాకపోవడం, ఔట్‌ఫీల్డ్ కూడా నెమ్మదిగా ఉండటంతో బ్యాటింగ్ కష్టమైంది. ఫాస్ట్‌బౌలర్లు కీమర్ రోచ్ (10-0-36-3), జేసన్ హోల్డర్ (10-2-33-2) కట్టుదిట్టమైన బౌలింగ్‌తో భారత బ్యాట్స్‌మెన్‌కు పరీక్ష పెట్టారు. అయితే ఎవ్వరూ భారీ ఇన్నింగ్స్ ఆడకపోయినా.. రాహుల్, కోహ్లి, ధోని, పాండ్య తలో చేయి వేయడం, కీలక భాగస్వామ్యాలు నెలకొల్పడంతో భారత్ మెరుగైన స్కోరే సాధించింది.

ఇన్నింగ్స్ నెమ్మదిగా ఆరంభం కాగా, రోహిత్ (18) వరుసగా రెండో ఇన్నింగ్స్‌లోనూ విఫలమవడంతో రాహుల్, కోహ్లి ఆచితూచి బ్యాటింగ్ చేశారు. రన్‌రేట్ 5కు మించలేదు. కోహ్లి సైతం నెమ్మదిగానే ఆడాడు. అయితే గంటకు పైగా మరో వికెట్ ఇవ్వకపోవడంతో విండీస్‌కు పైచేయి సాధించే అవకాశం దక్కలేదు. అయితే 21వ ఓవర్లో హోల్డర్.. రాహుల్‌ను బౌల్డ్ చేయడంతో భారత్‌కు కష్టాలు మొదలయ్యాయి. విజయ్ శంకర్ (14) మరోసారి పేలవ ఇన్నింగ్స్ ఆడాడు. క్రీజులో ఉన్నంతసేపూ ఇబ్బందిగా కదిలిన అతను.. చివరికి రోచ్‌కు వికెట్ సమర్పించుకున్నాడు. కేదార్ జాదవ్ (7) కూడా విఫలం కావడంతో భారత్ 140/4తో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ధోని పరుగులు మరీ జిడ్డుగా బ్యాటింగ్ చేశాడు. కోహ్లి సైతం నెమ్మదించడంతో రన్‌రేట్ పడిపోయింది. 38 ఓవర్లకు స్కోరు 176 పరుగులే. ఇక వేగం పెంచక తప్పని పరిస్థితుల్లో హోల్డర్ బౌలింగ్‌లో ఒక ఫోర్ కొట్టిన విరాట్.. వేగం తగ్గించి విసిరిన షార్ట్ బంతికి బోల్తా కొట్టాడు. పేలవ షాట్‌తో క్యాచ్ ఔటయ్యాడు. పాండ్య వచ్చాక పరిస్థితి మారింది. వేగంగా క్రీజులో కుదురుకున్న అతను.. ధనాధన్ షాట్లతో స్కోరు బోర్డును పరుగులు పెట్టించాడు. ధోని కూడా చివరి ఓవర్లలో కొంచెం వేగం పెంచడంతో భారత్ అనుకున్న దానికంటే ఎక్కువ స్కోరే చేసింది.

### రోహిత్ ఔటేనా?

భారత ఇన్నింగ్స్‌లో రోహిత్ క్యాచ్ ఔట్ వివాదాస్పదమైంది. రోచ్ బౌలింగ్‌లో రోహిత్ డిఫెన్స్ ఆడే ప్రయత్నం చేయగా.. బంతి బ్యాట్‌కు, ప్యాడ్‌కు మధ్యలో వెళ్లి వికెట్ కీపర్ చేతుల్లో పడింది. బంతికి రెండిట్లో ఏదో ఒకటి తాకిన శబ్దం వచ్చింది కానీ.. అది ప్యాడ్‌గా భావించి అంపైర్ ఔటివ్వలేదు. వెస్టిండీస్ సమీక్షకు వెళ్లింది. రీప్లేలో బంతి బ్యాట్‌కే తాకినట్లు స్పష్టమైన ఆధారం ఏమీ లభించలేదు. స్నికో మీటర్‌ను ఉపయోగించకుండానే బంతి బ్యాట్‌కు తాకినట్లు నిర్ధరించుకున్న మూడో అంపైర్ ఔటిచ్చేశాడు. మైదానంలో స్క్రీన్‌పై రీప్లే చూసిన వాళ్లందరూ అవాక్కయ్యారు. రోహిత్ తీవ్ర అసంతృప్తితో వెనుదిరిగాడు.




> ఎలా ఆడాలో ధోనికి బాగా తెలుసు. అతడు ఒక్క రోజు విఫలమైనా అంతా అతడిపై విమర్శలు చేస్తారు. మేము మాత్రం మద్దతుగా ఉంటాం. భారత్‌కు అతడు ఎన్నో విజయాలు అందించాడు. ధోని అనుభవం పదిలో ఎనిమిది సార్లు మాకు ఉపయోగపడింది. ఎంత స్కోరు చేస్తే సరిపోతుందో అతడు కచ్చితంగా చెప్పగలడు. అతడు 265 పరుగులు సరిపోతాయంటే మేమేం 300 కోసం ఆడం. అలాగని 230తో సరిపెట్టుకోం. అతడు క్రికెట్ దిగ్గజం అన్న సంగతి మాకు తెలుసు.
>
> – విరాట్ కోహ్లి

### కోహ్లి.. రికార్డు 20,000



టీమ్ ఇండియా కెప్టెన్ కోహ్లి మరో ఘనత సాధించాడు. దిగ్గజ ఆటగాళ్లు సచిన్ తెందుల్కర్, బ్రయాన్ లారాల పేరిట ఉన్న ఉమ్మడి రికార్డును బద్దలు కొట్టాడు. అంతర్జాతీయ క్రికెట్లో అత్యంత వేగంగా 20 వేల పరుగులు పూర్తి చేసిన ఆటగాడిగా నిలిచాడు. 417 ఇన్నింగ్స్‌ల్లో అతనీ ఘనత సాధించాడు. సచిన్, లారా ఇద్దరూ 453 ఇన్నింగ్స్‌ల్లోనే 20 వేల క్లబ్‌లోకి అడుగుపెట్టడం విశేషం. వన్డేల్లో 232 మ్యాచ్‌లాడి 11,159 పరుగులు చేసిన కోహ్లి.. 77 టెస్టుల్లో 6613 పరుగులు, 67 టీ20ల్లో 2263 పరుగులు సాధించాడు.

### షమి కసి కసిగా..

చక్కటి ఫామ్‌లో ఉన్నప్పటికీ తుది జట్టులో చోటు దక్కలేదు. భువనేశ్వర్ గాయపడితే తప్ప అవకాశం రాలేదు. దీంతో షమి కసితో రగిలిపోయినట్లే ఉన్నాడు. ఆ కసినంతా తన బౌలింగ్‌లోనే చూపిస్తున్నాడు. మొన్న అఫ్గానిస్థాన్‌పై సంచలన హ్యాట్రిక్‌తో జట్టును గట్టెక్కించిన షమి.. గురువారం వెస్టిండీస్‌పై మరింత గొప్పగా బౌలింగ్ చేశాడు. నిప్పులు చెరిగే బంతులతో విండీస్ పతనాన్ని శాసించాడు. ప్రమాదకర గేల్‌ను పడగొట్టి వికెట్ల వేటను ఆరంభించింది అతనే. హోప్‌ను షమి బౌల్డ్ చేసిన బంతి మ్యాచ్‌కే హైలైట్. అనూహ్యంగా లోపలికి స్వింగ్ అయిన బంతికి హోప్ దగ్గర సమాధానమే లేకపోయింది. స్టంప్ ఎగిరిపోయాక ఏం జరిగిందన్నట్లుగా అతను ఆశ్చర్యపోయి చూశాడు. ఇంకో ఇద్దరిని ఔట్ చేసిన షమి.. వరుసగా రెండో మ్యాచ్‌లోనూ నాలుగు వికెట్ల ప్రదర్శన చేయడం విశేషం. అఫ్గాన్‌పై షమి ప్రదర్శన చూశాక.. విండీస్ మ్యాచ్‌కు భువి ఫిట్‌నెస్ సాధించినా అతడిని తుది జట్టులోకి తీసుకోలేదు. షమినే కొనసాగించగా.. అతను మరోసారి చక్కటి ప్రదర్శన చేసి తనేంటో చాటిచెప్పాడు.

### ధోని విసిగించాడు కానీ..


ధోని 56 నాటౌట్

**140/4**తో జట్టు కష్టాల్లో ఉండగా క్రీజులోకి వచ్చిన ధోని.. చాలాసేపు మ్యాచ్ చూస్తున్న వాళ్లందరినీ అసహనానికి గురి చేశాడు. పరుగులు చేయడానికి అతను చాలా ఇబ్బంది పడిపోయాడు. ఒక దశలో అతను 40 బంతుల్లో 20 పరుగులే చేశాడు. అసలతను వరుసగా రెండో మ్యాచ్‌లోనూ స్టంపౌట్ కావాల్సింది. 8 పరుగుల వద్ద స్పిన్నర్ అలెన్ బౌలింగ్‌లో ముందుకొచ్చి ఆడబోగా అనూహ్యంగా టర్న్ అయిన బంతి అతడికి చిక్కలేదు. తొలి ప్రయత్నంలో వికెట్ కీపర్ హోప్ బంతిని అందుకోలేకపోయాడు. అయినా ధోని వెనక్కి వచ్చే స్థితిలో లేడు. హోప్ మళ్లీ ప్రయత్నించి విఫలమయ్యాక కానీ ధోని క్రీజులోకి రాలేదు. ఈ జీవనదానం తర్వాత కూడా ధోని ఏమీ వేగం పెంచలేదు. కోహ్లి ఔటయ్యే వరకు అతడి బ్యాటింగ్ జిడ్డుగానే సాగింది. తర్వాత కొంచెం వేగం పెంచాడు. అయితే చివరి ఓవర్లో మాత్రం ధోని అనూహ్యంగా చెలరేగాడు. తొలి, చివరి బంతులకు మిడ్‌వికెట్లో కళ్లు చెదిరే సిక్సర్లు బాదాడు. మధ్యలో ఒక ఫోర్ కూడా కొట్టాడు. దీంతో అంతవరకు తాను చేసిన నష్టాన్ని ధోనీనే భర్తీ చేసినట్లయింది.

**భారత్ ఇన్నింగ్స్:** రాహుల్ (బి) హోల్డర్ 48; రోహిత్ (సి) హోప్ (బి) రోచ్ 18; కోహ్లి (సి) డారెన్ బ్రావో (బి) హోల్డర్ 72; శంకర్ (సి) హోప్ (బి) రోచ్ 14; జాదవ్ (సి) హోప్ (బి) రోచ్ 7; ధోని నాటౌట్ 56; హార్దిక్ (సి) అలెన్ (బి) కాట్రెల్ 46; షమి (సి) హోప్ (బి) కాట్రెల్ 0; కుల్‌దీప్ నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 7 **మొత్తం:** (50 ఓవర్లలో 7 వికెట్లకు) **268;** **వికెట్ల పతనం:** 1-29, 2-98, 3-126, 4-140, 5-180, 6-250, 7-252; **బౌలింగ్:** కాట్రెల్ 10-0-50-2; కీమర్ రోచ్ 10-0-36-3; ఒషానె థామస్ 7-0-63-0; అలెన్ 10-0-52-0; హోల్డర్ 10-2-33-2; బ్రాత్‌వైట్ 3-0-33-0

**వెస్టిండీస్ ఇన్నింగ్స్:** గేల్ (సి) జాదవ్ (బి) షమి 6; ఆంబ్రిస్ ఎల్బీ (బి) పాండ్య 31; హోప్ (బి) షమి 5; పూరన్ (సి) షమి (బి) కుల్‌దీప్ 28; హెట్‌మెయర్ (సి) రాహుల్ (బి) షమి 18; హోల్డర్ (సి) జాదవ్ (బి) చాహల్ 6; బ్రాత్‌వైట్ (సి) ధోని (బి) బుమ్రా 1; అలెన్ ఎల్బీ (బి) బుమ్రా 0; రోచ్ నాటౌట్ 14; కాట్రెల్ ఎల్బీ (బి) చాహల్ 10; థామస్ (సి) రోహిత్ (బి) షమి 6; ఎక్స్‌ట్రాలు 18; **మొత్తం:** (34.2 ఓవర్లలో ఆలౌట్) **143;** **వికెట్ల పతనం:** 1-10, 2-16, 3-71, 4-80, 5-98, 6-107, 7-107, 8-112, 9-124; **బౌలింగ్:** షమి 6.2-0-16-4; బుమ్రా 6-1-9-2; పాండ్య 5-0-28-1; కుల్‌దీప్ 9-1-35-1; జాదవ్ 1-0-4-0; చాహల్ 7-0-39-2




Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

# ఛాంపియన్స్

## స్పిన్నర్లను ఆడేది ఇలాగేనా?



దిల్లీ: టీమ్‌ఇండియా బ్యాట్స్‌మెన్ స్పిన్నర్లను ఎదుర్కొంటున్న తీరును మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ విమర్శించాడు. ప్రపంచకప్‌లో అఫ్గానిస్థాన్‌తో మ్యాచ్‌లో రషీద్ ఖాన్, ముజీబ్ రెహ్మాన్ బౌలింగ్‌లో మరీ రక్షణాత్మకంగా ఆడిన బ్యాట్స్‌మెన్.. తాజాగా వెస్టిండీస్‌తో పోరులో ఆఫ్ స్పిన్నర్ ఫాబియన్ అలెన్‌ను ఎదుర్కోవడానికి ఇబ్బంది పడ్డారు. "రషీద్ తొలి 4 ఓవర్లలో 25 పరుగులే ఇచ్చాడు. ఆ తర్వాత ఆరు ఓవర్లలో 13 మాత్రమే ఇచ్చాడు. ఇక అలెన్ అయితే 5 ఓవర్లలో 34, ఆ తర్వాత 5 ఓవర్లలో 18 మాత్రమే ఇచ్చుకున్నాడు. దీన్ని బట్టే భారత్ బ్యాట్స్‌మెన్ ఎలా ఆడారో చెప్పొచ్చు" అని వీరూ అన్నాడు.

## అఫ్గాన్ వెనుక భారత్

మాంచెస్టర్: ప్రపంచకప్‌లో టీమ్‌ఇండియా అజేయ జట్టుగా కొనసాగుతుండొచ్చు. కానీ తొలి 10 ఓవర్ల రన్‌రేట్‌లో అఫ్గానిస్థాన్ కంటే భారత్ వెనుకుంది. ఈ విషయంలో టీమ్‌ఇండియాది 9వ స్థానం. 4.32 రన్‌రేట్‌తో భారత్.. దక్షిణాఫ్రికా (4.01) కంటే కాస్త మెరుగ్గా ఉంది. శ్రీలంక (6.63), బంగ్లాదేశ్ (5.48), ఇంగ్లాండ్ (5.34), ఆస్ట్రేలియా (5.10), పాకిస్థాన్ (5.07), న్యూజిలాండ్ (5.02), వెస్టిండీస్ (5.01), అఫ్గానిస్థాన్ (4.57) వరుసగా తొలి 8 స్థానాల్లో ఉన్నాయి.

## భారత్ సాయం చేస్తే..



కరాచీ: గత రెండు మ్యాచ్‌ల్లో గెలిచిన పాకిస్థాన్ ప్రపంచకప్‌లో సెమీఫైనల్ అవకాశాలను సజీవంగా ఉంచుకున్న సంగతి తెలిసిందే. తన తర్వాతి రెండు మ్యాచ్‌ల్లో అఫ్గానిస్థాన్, బంగ్లాదేశ్‌లపై గెలిస్తే.. ఇతర మ్యాచ్‌ల ఫలితాలు కలిసి వస్తే పాక్‌కు తుది నాలుగులో చోటు దక్కే అవకాశముంది. ఈ నేపథ్యంలో సెమీస్‌కు చేరేందుకు తమకు సహాయం చేయాలని పాక్ మాజీ ఫాస్ట్‌బౌలర్ షోయబ్ అక్తర్ భారత్‌ను కోరాడు. "పాకిస్థాన్‌కు భారత్ సహాయం అవసరం! ఎలా? భారత్ తన తర్వాతి మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై గెలవాలి. అప్పుడు ఇంగ్లాండ్ టోర్నమెంట్ నుంచి నిష్క్రమిస్తుంది. పాకిస్థాన్ (మిగతా రెండు మ్యాచ్‌లు గెలిస్తే) 11 పాయింట్లతో సెమీఫైనల్‌కు అర్హత సాధిస్తుంది" అని చెప్పాడు. "టోర్నీలో పాక్ బలంగా పుంజుకుంది. ఇప్పుడు భారతే మాకు సహాయం చేయాలి. మేం మిగతా రెండు మ్యాచ్‌లు గెలుస్తాం. అప్పుడు సెమీస్‌లో భారత్‌తోనే తలపడొచ్చు. ఆ జట్టును ఓడించొచ్చు" అని అక్తర్ అన్నాడు.

# నమ్మకమివ్వని 4 ఎందుకు?



"విజయ్ శంకర్ మూడు కోణాల్లో (3 డైమెన్షన్స్) ఉపయోగపడే ఆటగాడు. బ్యాటింగ్ చేస్తాడు. బౌలింగ్ చేయగలడు. మంచి ఫీల్డర్ కూడా. నాలుగో నంబర్‌కు అతడే సరైన వ్యక్తి"

ప్రపంచకప్‌కు టీమ్‌ఇండియా ఎంపిక అనంతరం చీఫ్ సెలెక్టర్ ఎమ్మెస్కే ప్రసాద్ అన్న మాటలివి. శంకర్ బ్యాటింగ్ సమర్థతపై అత్యధికులకు నమ్మకం లేకపోయినా టీమ్‌ఇండియా టాప్ ఆర్డర్ ఫామ్.. తిరుగులేని బౌలింగ్ విభాగం ముందు అతడి ఎంపిక పెద్ద వివాదం కాలేదు! ఐతే శంకర్ ఏ కోణంలోనూ అంతగా ఆకట్టుకోలేకపోవడం ఇప్పుడు భారత్‌కు అతిపెద్ద సమస్యగా మారింది! నాలుగో స్థానంలో శంకర్ ఓ విఫల ప్రయోగమని స్పష్టమైంది! రానున్న మ్యాచ్‌ల్లో టీమ్‌ఇండియాను నమ్మకం లేని 'నాలుగు' ముంచుతుందా? తేల్చుతుందా?

ఈనాడు క్రీడావిభాగం

'నోట్ల ఉపసంహరణ తర్వాత భారత్ చేసిన విఫల ప్రయోగం.. విజయ్ శంకర్! సామాజిక మాధ్యమాల్లో ఎక్కడ చూసినా ఇలాంటి వ్యాఖ్యలే ట్రెండింగ్ అవుతున్నాయి. ప్రపంచకప్‌లో అతడి ప్రదర్శనే ఇందుకు కారణం. పాకిస్థాన్ (15 నాటౌట్), అఫ్గానిస్థాన్ (29), వెస్టిండీస్ (14)లపై శంకర్ బ్యాటుతో ప్రభావం చూపలేకపోయాడు. ఈ నేపథ్యంలో శంకర్‌ను ఆడించడం, ముఖ్యం కీలకమైన నాలుగో స్థానంలో బ్యాటింగ్‌కు దించడం అభిమానులకు ఆగ్రహం తెప్పిస్తోంది. గత కొన్నేళ్లుగా భారత్ విజయాల్లో టాప్ ఆర్డర్.. పేసర్లదే ముఖ్యభూమిక. వన్డేల్లో టీమ్‌ఇండియా చేసిన పరుగుల్లో సగం రోహిత్‌శర్మ, శిఖర్ ధావన్, విరాట్ కోహ్లి త్రయానిదే. ప్రపంచకప్‌లోనూ అలాంటి పరిస్థితే పునరావృతమవుతుందని భావించారంతా! అందుకు తగ్గట్లే తొలి 2 మ్యాచ్‌ల్లో ఈ ముగ్గురు టాప్ లేపారు. దక్షిణాఫ్రికాపై రోహిత్ (122 నాటౌట్).. ఆస్ట్రేలియాపై ధావన్ (117), కోహ్లి (82) సత్తాచాటారు. దక్షిణాఫ్రికాతో 230 స్కోరులో 148, ఆస్ట్రేలియాతో 352 స్కోరులో 256 పరుగులు ఈ ముగ్గురు కలిసి చేసినవే. ఈ రెండు మ్యాచ్‌ల్లో అప్పటి పరిస్థితులకు తగ్గట్లు హార్దిక్ పాండ్య, కేఎల్ రాహుల్ నాలుగో స్థానాన్ని సమర్థంగా భర్తీ చేశారు. ఐతే గాయంతో ధావన్ ప్రపంచకప్‌కు దూరమవడం భారత బ్యాటింగ్ ప్రణాళికల్ని దెబ్బతీసింది. నాలుగో స్థానంలో ఆడతాడని అనుకున్న రాహుల్ ఓపెనింగ్‌లోకి వచ్చాడు. నాలుగో నంబరులో శంకర్‌కు అవకాశమిచ్చారు. ఫలితం చూస్తూనే ఉన్నాం!

పాక్‌తో పోరులో ఆరో స్థానంలో బరిలో దిగిన శంకర్ 15 బంతులాడి 15 పరుగులే చేసి విసుగు తెప్పించాడు. భారీ షాట్‌లు ఆడలేక చేతులెత్తేశాడు. కేవలం ఒకేఒక్క బౌండరీతో సరిపెట్టాడు. తొలి బంతికే వికెట్ తీయడం మినహా పాక్‌తో పోరులో శంకర్ నుంచి సానుకూలాంశాలేమీ లేవు! అఫ్గాన్‌తోనూ శంకర్ కష్టపడ్డాడు. 41 బంతుల్లో 29 (2×4) పరుగులే చేశాడు. విండీస్‌పైనా విఫలమయ్యాడు. 19 బంతుల్లో 14 పరుగులే చేసి వికెట్ పారేసుకున్నాడు. అఫ్గాన్, విండీస్‌లతో మ్యాచ్‌ల్లో శంకర్ వైఫల్యం జట్టు బ్యాటింగ్‌పై ప్రభావం చూపింది. రెండు మ్యాచ్‌ల్లోనూ సరైన సహకారం లభించక కోహ్లి ఇబ్బంది పడ్డాడు. శంకర్ వైఫల్యం ప్రభావం తర్వాత వచ్చే బ్యాట్స్‌మెన్‌పైనా పడుతోంది. ధోని (56 నాటౌట్), హార్దిక్ పాండ్య (46) ఆదుకోకపోయుంటే విండీస్‌తో మ్యాచ్‌లో టీమ్‌ఇండియా పరిస్థితి ఘోరంగా ఉండేదే! అఫ్గాన్, విండీస్‌లతో మ్యాచ్‌లు కాబట్టి బౌలింగ్ బలంతో కోహ్లీసేన గట్టెక్కింది. నాకౌట్‌లో.. పటిష్టమైన జట్టుతో తలపడినప్పుడు శంకర్‌పై ఏమేరకు నమ్మకముంచొచ్చన్నది జట్టు మేనేజ్‌మెంట్ తక్షణం దృష్టిసారించాల్సిన విషయం. టాప్ ఆర్డర్.. మిడిలార్డర్‌ను సమన్వయం చేయాల్సిన అత్యంత కీలక స్థానానికి బౌలింగ్ ఆల్‌రౌండర్‌ను ఎంపిక చేయడం ద్వారా భారత సెలెక్టర్లు చేశారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దినేశ్ కార్తీక్, రిషబ్ పంత్ వంటి ప్రధాన బ్యాట్స్‌మెన్ అందుబాటులో ఉన్నా.. జట్టు మేనేజ్‌మెంట్ శంకర్‌కు పదే పదే అవకాశాలు ఇస్తుండడాన్ని కూడా తప్పుపడుతున్నారు. ప్రపంచకప్‌కు ముందు వన్డేల్లో శంకర్ అనుభవం 9 మ్యాచ్‌లే. అందులో నాలుగింట్లో అతడికి బ్యాటింగ్ చేసే అవకాశమే రాలేదు. మిగతా ఐదు మ్యాచ్‌ల్లో ఒక్క అర్ధ సెంచరీ కూడా లేదు. అత్యధిక వ్యక్తిగత స్కోరు 46. ఇంత తక్కువ అనుభవమున్న ఆటగాడు.. అదీ బౌలింగ్ ఆల్‌రౌండర్ చేతికి నాలుగో స్థానాన్ని అప్పగిస్తున్న టీమ్‌ఇండియాది వ్యూహాత్మక తప్పిదమే!

## ప్రపంచకప్‌లో ఈనాడు

# దక్షిణాఫ్రికా × శ్రీలంక

**33** శ్రీలంక, దక్షిణాఫ్రికా ఆడిన వన్డేలు. సఫారీ జట్టు 18 గెలవగా, లంక 14 నెగ్గింది. ఒక మ్యాచ్ రద్దయింది.

**2** ప్రపంచకప్‌లో లంక, దక్షిణాఫ్రికా తలపడిన మ్యాచ్‌లు. చెరొకటి గెలిచాయి.

వేదిక: చెస్టర్‌లీ స్ట్రీట్ (మ.3 నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో)

గత మ్యాచ్‌లో టైటిల్ ఫేవరెట్ ఇంగ్లాండ్‌ను మట్టికరిపించి ఆశ్చర్యపరిచిన శ్రీలంకకు అసలు సవాల్. దక్షిణాఫ్రికాతో పోరాటం నేడే. గత మ్యాచ్‌లో పటిష్టమైన ఇంగ్లాండ్‌ను ఓడించి సెమీస్ రేసులో నిలిచిన లంక.. సఫారీలపై గెలిస్తేనే పోటీలో నిలుస్తుంది. మరోవైపు ఏడు మ్యాచ్‌లు ఆడి ఒక్క అఫ్గానిస్థాన్‌పైనే నెగ్గిన దక్షిణాఫ్రికా మరో విజయం సాధించాలనే పట్టుదలతో ఉంది.

# పిచ్‌లు మారుతున్నాయి

గ్రేమ్ స్మిత్

FRANKLIN TEMPLETON
బ్యాట్స్‌మెన్ మరియు బౌలర్స్ కలసిమెలసి సమతుల్యమైన టీమ్ ఏర్పడుతుంది
డెట్ మరియు ఈక్విటీ ఫండ్స్ కలసిమెలసి సమతుల్యమైన పోర్ట్‌ఫోలియో ఏర్పడుతుంది
9010340000కి మిస్డ్ కాల్ ఇచ్చి, iPhone X మరియు ఇతర ఉత్తేజభరితమైన కానుకలు గెలుచుకునే అవకాశాన్ని పొందండి*

దక్షిణాఫ్రికా ఇలాంటి స్థితిలో ఉండడం చాలా బాధిస్తోంది. ఈ ప్రపంచకప్‌లో మా జట్టుకు సానుకూలాంశాలేమీ లేవు. ఇంతకుముందులా ఇప్పుడు దక్షిణాఫ్రికాలో ఇప్పుడు ఆత్మవిశ్వాసం, పోరాటపటిమ లేవు. పరువును కాపాడుకోవడానికి ఆ జట్టుకు ఇప్పుడు రెండు మ్యాచ్‌లు ఉన్నాయి. అయితే శ్రీలంక, ఆస్ట్రేలియాలపై నెగ్గడం అంత తేలిక కాదు. తొమ్మిది మ్యాచ్‌ల్లో ఒకే విజయంతో టోర్నీ నుంచి నిష్క్రమించడం కంటే దారుణం ఇంకోటి ఉండదు. శ్రీలంక టోర్నీ ఆరంభంలో కంటే భిన్నంగా కనిపిస్తోంది. ఆ జట్టు కీలక ఆటగాళ్లు మెరుగైన ప్రదర్శన చేయడం మొదలుపెట్టడమే అందుకు కారణం. ఇంగ్లాండ్‌పై లంక విజయం టోర్నమెంట్‌ను ఆసక్తికరంగా మార్చేసింది. లసిత్ మలింగ ప్రదర్శన ఆ జట్టుకు బోనస్. ఇంగ్లాండ్‌పై అతడు అద్భుతంగా బౌలింగ్ చేశాడు. దక్షిణాఫ్రికా టాప్ ఆర్డర్ అతణ్ని ఎలా ఎదుర్కొంటుందన్నది కీలకం. ఇంగ్లాండ్‌లో పిచ్‌లు స్పిన్‌కు సహకరించడం మొదలుపెట్టాయి. ఆ పిచ్‌లు శ్రీలంక లాంటి జట్లకు సరిగ్గా సరిపోతాయి.

## స్నైడర్‌తో విజేందర్ ఢీ



దిల్లీ: యుఎస్ ప్రొఫెషనల్ బాక్సింగ్ సర్క్యూట్‌లోకి భారత స్టార్ బాక్సర్ విజేందర్‌సింగ్ అరంగేట్రం చేయబోతున్నాడు. జులై 13న జరిగే తొలి పోరులో అమెరికా బాక్సర్ మైక్ స్నైడర్‌తో విజేందర్ తలపడనున్నాడు. ఇప్పటిదాకా ఆడిన 10 బౌట్లలో అజేయంగా సాగుతున్న విజేందర్.. యుఎస్ సర్క్యూట్‌లో ఎలా ఆడతాడన్నది ఆసక్తికరం.

## ఆ వీడియో చూసి నా భార్య ఏడ్చింది
### సర్ఫరాజ్ అహ్మద్

కరాచి: ఓ అభిమాని ప్రవర్తన తన భార్య కన్నీరు పెట్టేలా చేసిందని పాకిస్థాన్ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అన్నాడు. భారత్ చేతిలో ఓటమి తర్వాత సర్ఫరాజ్ తన కొడుకును తీసుకొని ఇంగ్లాండ్ వీధుల్లో వెళ్తుంటే ఓ అభిమాని అతని దగ్గరికి వచ్చి ''నువ్వు ఎందుకు పందిలా ఉన్నావ్'' అని అన్నాడు. ఆ సమయంలో తీసిన వీడియో సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతోంది. ''నేను గదిలోకి వచ్చేసరికి ఆ వీడియో చూసిన నా భార్య ఏడుస్తూ కూర్చుంది. అది కేవలం వీడియో మాత్రమే.. క్రికెట్ అభిమానులకు భావోద్వేగాలు ఎక్కువ కాబట్టి మనం ఇలాంటివాటిని భరించాల్సిందే అని ఆమెకు చెప్పా. అతని వ్యాఖ్యలు నాకూ బాధ కలిగించాయి. నా కొడుకు చేతుల్లో ఉండడం వల్ల ప్రశాంతంగా ఉండిపోయా. ఆ సమయంలో నేను ప్రతిఘటించి ఉంటే అతనికి, నాకు తేడా లేకుండా పోయేది'' అని సర్ఫరాజ్ చెప్పాడు.

# కొత్త చట్టం.. పౌరుల చుట్టం

- పురపాలికల సేవలకు చట్టబద్ధత
- చట్టాన్ని అతిక్రమిస్తే ఛైర్‌పర్సన్లు, వైస్‌ఛైర్‌పర్సన్ల తొలగింపు.. ఆరేళ్ల వరకూ అనర్హత
- ఆస్తి పన్ను స్వీయ మదింపునకు అవకాశం
- జవాబుదారీ పాలనకు ఆస్కారం
- వికేంద్రీకరణతో పెరగనున్న వార్డుల సంఖ్య
- పుర ఉద్యోగులంతా ఒకే చట్టం పరిధిలోకి
- నూతన పురపాలక చట్టం ముసాయిదాలో పలు కీలకాంశాలు




బొమ్మ: బాలు

ప్రజలకు అండగా.. సమస్యల పరిష్కారానికి భరోసాగా.. పుర ప్రజాప్రతినిధుల్లో జవాబుదారీతనం పెంపొందించేలా.. ఏకీకృత పురపాలక చట్టం తుదిరూపు సంతరించుకుంది. పుర చట్టాల్ని ఒకే గొడుగు కిందకు తెస్తూ తెలంగాణ పురపాలక శాఖ తీసుకొస్తున్న ఈ చట్టం ఒకటి రెండు అంశాలు మినహా పూర్తి స్పష్టతతో సిద్ధమైనట్లు విశ్వసనీయ సమాచారం. రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి సంస్థలు, హెచ్ఎండీఏ, టౌన్‌ప్లానింగ్ విభాగాలు ఈ చట్టం పరిధిలోకి రానున్నాయి. కొత్త చట్టాన్ని సాధ్యమైనంత త్వరగా సిద్ధంచేసి దీని ద్వారానే పుర ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈ నేపథ్యంలో చట్టం ముసాయిదాను ప్రభుత్వ వర్గాలు పరిశీలిస్తున్నాయి. అందులోని కీలకాంశాలివీ..

### అసెంబ్లీలో చట్టం ద్వారానే కొత్త పురపాలికలు

ప్రస్తుతం కొత్త పురపాలక సంఘాల ఏర్పాటు, గ్రామాల విలీనం ప్రభుత్వం నిర్ణయం మేరకు జరుగుతోంది. న్యాయవివాదాలతోపాటు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలో కొత్త పురపాలక చట్టంలో.. పురపాలక సంఘాల ఏర్పాటు, విలీనం రెండు అంశాలనూ అసెంబ్లీ పరిధిలోకి తీసుకురానున్నారు. అసెంబ్లీలో చట్టం ద్వారానే ఇవి ఏర్పాటు కానున్నాయి. కొత్త పురపాలక సంఘాల ఏర్పాటు, కొత్త ప్రాంతాల చేరిక, సరిహద్దుల మార్పునకు సంబంధించిన ముసాయిదాను అసెంబ్లీ ముందుంచాలి. శాసనసభ, మండలి తీర్మానం అనంతరమే కొత్తవాటిని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది.

**ఫలితం:** చట్టసభలో చర్చించి ఆమోదం మేరకు పురపాలక సంఘాల ఏర్పాటు, విస్తరణ జరుగుతుంది. ప్రజాకోణంలో చర్చ జరుగుతుంది. న్యాయవివాదాలకు ఆస్కారం తక్కువ.

### ఎంత జనాభాకు ఎందరు కౌన్సిలర్లు?

పురపాలక సంఘం స్థాయిని బట్టి చిన్నవాటిలో రెండువేల జనాభాకు ఒకరు, మిగిలిన వాటిలో పురపాలక సంఘంలోని జనాభా ప్రాతిపదికగా మూడు వేలు, ఐదువేలు, ఆరు వేలు, 12 వేల జనాభాకు ఒక కౌన్సిలర్ ఉండనున్నారు.

**ఫలితం:** వికేంద్రీకరణతోపాటు స్థానిక ప్రజాప్రతినిధులు అందుబాటులో ఉండేలా కౌన్సిలర్లు, వార్డు సభ్యుల సంఖ్య పెరగనుంది. చిన్న పురపాలికల్లోనూ పది మంది వార్డు సభ్యుల ఉండనున్నారు.

**ఇదీ వార్డుల లెక్క ..**

| జనాభా | కనిష్ఠం | గరిష్ఠం |
|---|---|---|
| 1.5 లక్షల నుంచి 2.5 లక్షలు వరకు | 45 | 49 |
| లక్ష నుంచి 1.5 లక్షలు.. | 40 | 45 |
| 75 వేల నుంచి లక్ష.. | 30 | 40 |
| 30 వేల నుంచి 75 వేలు.. | 20 | 30 |
| 10 వేల నుంచి 30 వేల వరకు | 10 | 20 |

### రిజర్వేషన్లు గరిష్ఠంగా 50 శాతమే

కొత్త పురపాలక చట్టంలో రిజర్వేషన్లను గరిష్ఠంగా 50 శాతంగా స్పష్టంచేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఈ మేరకు రిజర్వేషన్లు ఉంటాయి. రాష్ట్రం యూనిట్‌గా, రొటేషన్ విధానంలో రిజర్వేషన్లు అమలవుతాయి.

### చట్టం పరిధిలోకి పట్టణ ప్రణాళిక

పట్టణ, నగర ప్రణాళికా విభాగం (డీటీసీపీ) ప్రస్తుతం పురపాలక పరిధిలోనేఉన్నా ప్రత్యేక చట్టం పరిధిలో ఉంది. తాజాగా డీటీసీపీ కూడా పురపాలక చట్టంలో అంతర్భాగం కానుంది.

**ఫలితం:** కీలకమైన పట్టణ ప్రణాళిక విభాగంపై పురపాలక పర్యవేక్షణ పెరుగుతుంది.

### అతిక్రమిస్తే అనర్హతే

ప్రస్తుత చట్టంలో ఉన్నట్లే కౌన్సిల్ తీర్మానాలను రద్దు చేసే అధికారం ప్రభుత్వానికి ఈ చట్టంలోనూ ఉంటుంది. పురపాలక చట్టాన్ని అతిక్రమించినప్పుడు, హోదాను, అధికారాలను దుర్వినియోగం చేసినప్పుడు ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లను సస్పెండ్ చేసే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. విధి నిర్వహణలో విఫలమైనా, ప్రభుత్వ ఉత్తర్వులను ధిక్కరించినా, అక్రమాలకు పాల్పడినా, లెక్కలు ఆడిట్ చేయించకపోయినా ఛైర్‌పర్సన్, వైస్ ఛైర్‌పర్సన్‌లను తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. తొలగింపునకు గురైన వారు ఆరేళ్ల వరకూ పురపాలక సంఘంలో పోటీకి అనర్హులవుతారు.

**ఫలితం:** అక్రమాలకు పాల్పడితే చర్యలు తీసుకునే అవకాశం ఉండటంతో జవాబుదారీ పాలన ఉంటుంది.

### స్వీయ మదింపునకు అవకాశం

ఆస్తిపన్ను స్వీయ మదింపు విధానాన్ని పురపాలక చట్టం పరిధిలోకి తీసుకొచ్చారు. అధికారుల ప్రమేయం లేకుండా భవన నిర్మాణదారులే ఆస్తిపన్నును మదింపు చేసుకుని చెల్లించొచ్చు. అయితే, కొలతల్లో తేడాలు ఉన్నట్లు ఆడిట్‌లో గుర్తిస్తే 50 శాతం జరిమానా వసూలు చేస్తారు. ఆస్తిపన్ను మదింపులో అక్రమాలకు పాల్పడితే చర్యలుంటాయి.

**ఫలితం:** ప్రస్తుతం ఆస్తి పన్ను మదింపు వ్యవహారంలో జరుగుతున్న అనేక అక్రమాలకు స్వీయమదింపుతో తెరపడనుందని భావిస్తున్నారు.

### పారిశుద్ధ్య ప్రణాళిక

ప్రతి నగరానికి, పురపాలక పట్టణానికి పారిశుద్ధ్య ప్రణాళిక (శానిటేషన్ ప్లాన్) రూపొందించాలి. ఇందులో వార్డులవారీగా చెత్త సేకరణ, రవాణా, ప్రాసెసింగ్, వందశాతం ఘనవ్యర్థాల నిర్వహణ సమగ్ర సమాచారం ఉండాలి.

**ఫలితం:** ప్రస్తుతం పట్టణాల్లో పారిశుద్ధ్యమే ప్రధాన సమస్యగా మారుతోంది. వందల టన్నుల చెత్త ఏర్పడుతోంది. ఈ నేపథ్యలంలో పారిశుద్ధ్య నిర్వహణ ప్రణాళిక రూపొందించి అమలు చేయడం వల్ల ప్రణాళికాబద్ధమైన పరిష్కారం లభిస్తుంది.

### పునర్విభజనకు 30 రోజులే

వార్డుల పునర్విభజనకు ప్రస్తుతం నిర్దేశించన గడువు రెండు నెలలు ఉండగా కొత్త చట్టంలో ఇది 30 రోజులకు తగ్గనుంది. మరోవైపు ముసాయిదా చట్టంలో పురపాలక సంఘాలు, నగరపాలక సంస్థల ఛైర్‌పర్సన్ల ఎన్నికను పరోక్ష విధానంలో ప్రతిపాదించారు. అయితే, మేయర్‌లు, పురపాలక ఛైర్‌పర్సన్‌లకు ప్రత్యక్ష ఎన్నిక విధానాన్ని ప్రతిపాదిస్తే ఎలా ఉంటుందనే అంశాన్ని ప్రభుత్వం పరిశీలిస్తోంది.

**ఫలితం:** ఎన్నికల నిర్వహణ ప్రక్రియ గడువు తగ్గుతుంది.

### అధికారాలతోపాటు విధులు

ఛైర్‌పర్సన్, కౌన్సిలర్ లేదా వార్డు సభ్యుల అధికారాలు, బాధ్యతలను కొత్త చట్టంలో స్పష్టంగా నిర్దేశించారు. పౌరసేవలతోపాటు కనీస వసతుల కల్పన పట్టణ ప్రజాప్రతినిధుల బాధ్యతగా స్పష్టంచేశారు.

**ఫలితం:** పారిశుద్ధ్యం, నీటి సరఫరా, పచ్చదనం పెంపు, వీధి దీపాల నిర్వహణ పురపాలక ప్రజాప్రతినిధుల తప్పనిసరి బాధ్యత కానుంది.

### ఉద్యోగులకు ఏకీకృత నిబంధనలు

పురపాలక చట్టం మేరకు రాష్ట్రంలోని అన్ని నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, పట్టణాభివృద్ధి సంస్థలు, జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ ఒకే చట్టం పరిధిలోకి రానుండటంతో ఆయా సంస్థల ఉద్యోగులందరికీ ఒకే మున్సిపల్ సర్వీసు రూల్స్ అమలవుతాయి తాత్కాలిక ఉద్యోగులు మినహా మిగతావారికి ఈ ఏకీకృత నిబంధనలు వర్తిస్తాయి. బదిలీలకు ఇదే ప్రాతిపదికగా ఉంటుంది.

**ఫలితం:** వివిధ విభాగాల్లోని ఉద్యోగుల సేవల్ని సమర్థంగా వినియోగించుకునేందుకు అవకాశం ఉంటుంది.

### పౌర సేవలు చట్టబద్ధం

సిటిజన్ ఛార్టర్‌ను చట్టంలో చేర్చారు. ఫలితంగా పురపాలక సంఘం అందించే సేవలకు చట్టబద్ధత వస్తుంది. నిర్దేశించిన గడువులోపు సేవలు అందించడంలో విఫలమైతే బాధ్యులైన ఉద్యోగుల నుంచి జరిమానా వసూలు చేయాలి. ప్రతి చోటా పౌరసేవా కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

**ఫలితం:** నిర్దేశించిన గడువు మేరకు పౌరసేవలు పొందడం ప్రజల హక్కుగా మారుతుంది

### ఇక ఇవన్నీ ఒకే చట్టంగా..

- తెలంగాణ పురపాలక చట్టం–1965
- తెలంగాణ మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం–1994
- తెలంగాణ పట్టణ ప్రణాళిక చట్టం–1920
- తెలంగాణ జనరల్ క్లాస్ చట్టం–1891

- ఈనాడు, హైదరాబాద్

Eenadu epaper

Downloaded from Playstore: Todays NewsPaper Telugu

# మన బంధం.. మరింత బలోపేతం

- అన్నింటా ఉభయ దేశాల భాగస్వామ్యం
- జపాన్‌లో ప్రధాని మోదీ వెల్లడి

కోబె

కోబె నుంచి బుల్లెట్ రైళ్ల తయారీ వరకు అన్నింటా పరస్పర సహకారంతో భారత్, జపాన్ దేశాల మధ్య బంధం రోజురోజుకూ మరింత బలోపేతం అవుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ అన్నారు. భారతదేశ ఆర్థిక అభివృద్ధిలో జపాన్ కీలకపాత్ర పోషించిందని చెప్పారు. జీ20 సదస్సులో పాల్గొనేందుకు ఆయన జపాన్‌లోని ఒసాకా నగరానికి గురువారం తెల్లవారుజామున చేరుకున్నారు. మూడురోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు కోబె నగరంలో ప్రవాస భారతీయులతో మాట్లాడుతూ.. జపాన్, భారత్ మధ్య కొన్ని శతాబ్దాలుగా సంబంధాలున్నాయని చెప్పారు. జపాన్ ప్రాజెక్టులు లేదా పెట్టుబడుల ప్రభావం కనపడని ప్రాంతం అంటూ భారతదేశంలో ఏదీ లేదని, అలాగే భారతదేశపు ప్రతిభాపాటవాలు జపాన్‌ను బలోపేతం చేస్తున్నాయని చెప్పారు. స్వామి వివేకానంద, రవీంద్రనాథ్ ఠాగూర్, మహాత్మాగాంధీ, నేతాజీ సుభాష్ చంద్రబోస్, జస్టిస్ రాధావినోద్ పాల్.. ఇలా చాలామంది జపాన్‌తో భారతదేశ సంబంధాలను బలోపేతం చేశారని, రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఈ బంధాలు సరికొత్త ఎత్తులను చూశాయని మోదీ అన్నారు. 2014లో తాను ప్రధాని అయ్యాక తన స్నేహితుడు షింజో అబేతో కలిసి ఈ బంధాన్ని మరింత దృఢం చేసే అవకాశం లభించిందని తెలిపారు. తన 'ప్రియమైన స్నేహితుడు' షింజో అబేను తాను దిల్లీ, అహ్మదాబాద్‌తో పాటు వారణాసికి తీసుకెళ్లి గంగాహారతి చూపించానని గుర్తుచేశారు.



కోబెలో గురువారం భారత సంతతి ప్రజలకు అభివాదం చేస్తున్న ప్రధాని మోదీ

### ప్రవాస భారతీయులకు ప్రశంసలు

అతిపెద్ద ప్రజాస్వామ్యమైన భారతదేశ ఎన్నికల వ్యవస్థలో విదేశాలలో ఉంటున్న భారతీయులు కూడా భాగస్వాములు అవుతున్నందుకు ప్రధాని మోదీ వారికి ధన్యవాదాలు తెలిపారు. ఏడు నెల క్రితం తాను ఇక్కడకు వచ్చినప్పుడు జపాన్‌లో ఎన్నికలు జరిగాయని, అప్పుడు తన స్నేహితుడు షింజోఅబేపై విశ్వాసం చూపారని.. ఇప్పుడు అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం ఈ 'ప్రధాన సేవకుడి' మీద మరింతగా విశ్వాసం చూపిందని అన్నారు.

### జపాన్ ప్రధానితో విస్తృత చర్చలు

జపాన్ ప్రధాని షింజో అబేతో భారత ప్రధాని మోదీ పలు అంశాలపై విస్తృతంగా చర్చించారు. అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థ, విదేశాలకు పారిపోతున్న ఆర్థిక నేరస్థులు, విపత్తు నివారణ తదితర అంశాలు వారిద్దరి మధ్య చర్చకు వచ్చాయి. అక్టోబరులో జరిగే జపాన్ చక్రవర్తి నరుహిటో పట్టాభిషేకంలో భారత రాష్ట్రపతి పాల్గొంటారని మోదీ చెప్పారు. 'రైవా' శకం ప్రారంభం సందర్భంగా జపాన్ ప్రజలకు ఆయన అభినందనలు తెలిపారు. మిత్రులు ఇద్దరి మధ్య నిర్మాణాత్మక చర్చలు జరిగాయని విదేశాంగ శాఖ కార్యదర్శి విజయ్ గోఖలే చెప్పారు.

### జపాన్‌లోనూ మూడు కోతుల కథ

భారత - జపాన్ దేశాల మధ్య బంధాన్ని వివరించేందుకు మహాత్మాగాంధీ బోధనలలోని మూడు కోతుల కథను మోదీ ప్రస్తావించారు. 'చెడు కన వద్దు, చెడు వినవద్దు, చెడు అనవద్దు' అని బాపూజీ చెప్పిన విషయం మనకందరికీ తెలుసని.. కానీ ఇది జపాన్‌లో 17వ శతాబ్దంలోనే ఉందని ఆయన అన్నారు. ఈ మూడు కోతుల్లో మొదటిది మిజారు అని, అది కళ్లు మూసుకుని చెడు చూడదని, రెండో కోతి కికజారు చెవులు మూసుకుని చెడు వినదని, మూడో కోతి ఇవజారు నోరు మూసుకుని చెడు మాట్లాడదని తెలిపారు. రెండు దేశాల భాషల్లో కూడా కొన్ని పదాలు కలుస్తాయని.. భారతదేశంలో 'ధ్యాన్' అనే పదాన్ని జపాన్‌లో 'జెన్' అంటారని, అలాగే 'సేవ' పదాన్ని జపాన్‌లోనూ అలాగే పలుకుతారని చెప్పారు.



## అమరవీరుడి కుటుంబానికి షా పరామర్శ

జమ్మూకశ్మీర్‌లోని అనంతనాగ్‌లో ఈ నెల 12న జరిగిన ఉగ్రదాడిలో వీరమరణం పొందిన పోలీసు ఇన్‌స్పెక్టర్ అర్షద్ అహ్మద్ ఖాన్ కుటుంబాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్ షా గురువారం పరామర్శించారు. శ్రీనగర్‌లోని అర్షద్ నివాసానికి వెళ్లిన షా.. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అర్షద్ తన ధైర్య సాహసాలతో దేశం గర్వించేలా చేశారని పేర్కొన్నారు. అమర పోలీసు భార్యకు ప్రభుత్వ ఉద్యోగ నియామక పత్రం అందజేశారు.

## సెల్ఫీ మృతుల్లో భారతీయులే ఎక్కువ



దిల్లీ: దాదాపు దశాబ్దకాలంగా స్వీయచిత్రాల(సెల్ఫీ) మోజులో చనిపోయిన వారి సంఖ్య, ప్రపంచవ్యాప్తంగా షార్కు చేపల దాడిలో ప్రాణాలు కోల్పోయినవారి సంఖ్య కంటే ఐదురెట్లు ఎక్కువగా ఉందని భారత్‌కు చెందిన 'ఫ్యామిలీ మెడిసిన్ అండ్ ప్రైమరీ కేర్' జర్నల్ పేర్కొంది. అక్టోబరు 2011 నుంచి నవంబరు 2017 మధ్య సెల్ఫీలు తీసుకుంటూ 259 మంది చనిపోతే, ఇందులో 159 మంది మనదేశంవారే కావడం గమనార్హం. ఇదేకాలంలో రష్యాలో 16 మంది, అమెరికాలో 14 మంది దుర్మరణం చెందారు. భారత్‌లో మహిళలు ఎక్కువ సెల్ఫీలు తీసుకోవడానికి ఇష్టపడుతున్నారు. కుర్రకారు సాహసంతో కూడిన చిత్రాలకు ఫోజులెక్కువ ఇస్తున్నారు. నీటిలో మునిగిపోవడం, వాహనాలు గుద్దుకోవడం, ఎత్తైన స్థలాల నుంచి పడిపోవడం, వీడియో చిత్రీకరణలో నిమగ్నమై ఉండగా జరుగుతున్న ప్రమాదాలు నాలుగింట మూడొంతుల మరణాలకు కారణమవుతున్నాయి. సెల్ఫీల మోజులో ప్రాణాలు కోల్పోతుండడంతో ముంబయిలో సెల్ఫీలు తీసుకోకూడని చోటుగా 16 ప్రాంతాలను ప్రభుత్వం ప్రకటించింది.

# దత్తత బిడ్డ హంతకుడికి యావజ్జీవం

- చిన్నారి షెరీన్ కేసులో అమెరికా కోర్టు తీర్పు
- భారతీయ అమెరికన్ వెస్లీ మాథ్యూస్‌కు శిక్ష ఖరారు

డాలస్

షెరీన్..! తనకంటూ ఎవరూలేని మూడేళ్ల చిన్నారి. బిహార్‌లోని గయలో ఓ అనాథాశ్రమంలో ఆశ్రయం పొందుతుంటే... 'కన్న కూతురిలా చూసుకుంటాం' అని ఆమెను దత్తత తీసుకున్నారు కేరళకు చెందిన వెస్లీ దంపతులు. తమతో పాటే అమెరికా తీసుకెళ్లారు. కానీ... విధి ఆ చిన్నారిని అనాథలాగే విడిచిపెట్టింది. పెంపుడు తండ్రి నిరాదరణతో మృతిచెంది... మురుగు కాలువలో శవమై తేలింది. చిన్నారి మృతికి తండ్రే కారణమని నిగ్గు తేల్చిన న్యాయస్థానం... అతనికి యావజ్జీవ కారాగార శిక్ష విధించింది!

మూడేళ్ల చిన్నారి షెరీన్ మాథ్యూస్ మృతికి కారణమైన పెంపుడు తండ్రి, భారతీయ అమెరికన్ వెస్లీ మాథ్యూస్(39)కు డాలస్ న్యాయస్థానం బుధవారం యావజ్జీవ కారాగారం విధించింది. 12 మంది న్యాయమూర్తుల బృందం మూడు గంటలపాటు సుదీర్ఘంగా చర్చించి, వెస్లీకి ఏకగ్రీవంగా ఈ శిక్షను ఖరారు చేసింది. కారాగారంలో 30 ఏళ్లు గడిపిన తర్వాత అతనికి పెరోలు ఇవ్వవచ్చని తీర్పులో స్పష్టం చేశారు.

కేరళకు చెందిన వెస్లీ, సినీ దంపతులు బిహార్‌లోని ఓ అనాథాశ్రమం నుంచి 2016లో షెరీన్‌ను దత్తత తీసుకుని తమతోపాటు టెక్సాస్‌లోని రిచర్డ్‌సన్‌కు తీసుకెళ్లారు. ఓ రోజు పాలు తాగనని షెరీన్ మారాం చేసింది. దీంతో వెస్లీ రాత్రంతా ఆమెను ఇంటి బయట నుంచోబెట్టాడు. అక్కడితో ఆగకుండా... బలవంతంగా పాలు తాగించేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పాలపీక గొంతులో ఇరుక్కొని ఊపిరాడక చిన్నారి చనిపోయింది. విషయం బయటకు పొక్కకుండా వెస్లీ జాగ్రత్త పడటమే కాకుండా... తన కుమార్తె కనిపించడం లేదంటూ అక్టోబరు 7, 2017న పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొంత కాలం తర్వాత అతని ఇంటి సమీపంలోని మురుగు కాలువలో కుళ్లిన దశలో ఉన్న ఓ మృతదేహం పోలీసులకు లభ్యమైంది. దర్యాప్తు అధికారులు లోతుగా పరిశోధన సాగించి వెస్లీపై నేరారోపణ చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఎంతోమందిని కదిలించిన ఈ కేసు విచారణ సందర్భంగా గట్టి వాదోపవాదనలు నడిచాయి.

### సుష్మా ప్రత్యేక దృష్టి

తీర్పు వెలువడిన వెంటనే వెస్లీ భార్య ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా అక్కడి నుంచి వెళ్లిపోయింది. షెరీన్ మృతి నేపథ్యంలో అప్పటి విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మాస్వరాజ్ ప్రత్యేక దృష్టి సారించారు. బాలికకు న్యాయం జరిగేలా చూడాలని భారత రాయబారులను ఆదేశించారు.

### మంచి తండ్రి... కానే కాదు

"వెస్లీ చాలా మంచి తండ్రి. కుమార్తె మృతితో ఎంతో కుమిలిపోయాడు. ఆమె అపస్మారక స్థితిలో ఉన్నప్పుడు హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయలేకపోయానని చాలా దుఃఖపడ్డాడు. అతనే హత్య చేశాడనడానికి కచ్చితమైన ఆధారాలు లేవు" అని నిందితుని తరఫు న్యాయవాది వాదనలు వినిపించారు. కానీ న్యాయస్థానం వాటిని తోసిపుచ్చింది. "ప్రమాదవశాత్తూ కుమార్తె చనిపోతున్నప్పుడు ఏ తండ్రి అయినా హెల్ప్‌లైన్‌కు ఫోన్ చేయకుండా ఉంటాడా? పైగా తాను ఎక్కడుంటున్నదీ తెలియకుండా వెస్లీ తన లొకేషన్ వివరాలను ఆన్‌లైన్ నుంచి ఎందుకు తొలగించాల్సి వచ్చింది? షెరీన్ వైద్య వివరాలను పరిశీలిస్తే ఆమెను పెంపుడు తల్లిదండ్రులు నిత్యం కొట్టేవారని తెలుస్తోంది. లేకుంటే చిన్నారి శరీరంలో పలుమార్లు ఎముకలు ఎందుకు విరుగుతాయి? ఏ విధంగా చూసినా ఇది ముమ్మాటికీ హత్యేనని అర్థమవుతోంది" అని న్యాయస్థానం అభిప్రాయపడింది.

## సెజ్ సవరణ బిల్లుకు ఆమోదం

దిల్లీ: ప్రత్యేక ఆర్థిక మండళ్ల(ఎస్ఈజెడ్)లో యూనిట్లు ఏర్పాటు చేయడానికి ట్రస్టులను కూడా అనుమతిస్తూ తీసుకువచ్చిన సెజ్ సవరణ బిల్లును పార్లమెంటు ఆమోదించింది. గురువారం మూజువాణి ఓటుతో రాజ్యసభ ఆమోదించింది. బుధవారం లోక్‌సభలోనూ ఈ బిల్లు ఆమోదం పొందింది. బిల్లులో చేసిన చిన్న సవరణ పెట్టుబడులు, ఉద్యోగాలు, అభివృద్ధిపై గొప్ప ప్రభావం చూపనుందని చర్చ సందర్భంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి పీయూష్‌గోయల్ పేర్కొన్నారు. "ఇప్పటికే ఎనిమిది ట్రస్టుల నుంచి ప్రతిపాదనలు వచ్చాయి. సుమారు రూ.8000 కోట్లు పెట్టుబడులు పెట్టనున్నాయి. తాజా సవరణ బిల్లు వల్ల ఏటా రూ.20 వేల కోట్ల పెట్టుబడులు వస్తాయని భావిస్తున్నాం. మార్చి 2019నాటికి సెజ్‌లు రూ.ఐదు లక్షల కోట్లకుపైగా పెట్టుబడులు ఆకర్షించాయి. 20 లక్షలమందికిపైగా ఉద్యోగాలకల్పన జరిగింది. రూ.ఏడు లక్షల కోట్లకుపైగా ఎగుమతులు జరిగాయి" అని గోయల్ పేర్కొన్నారు.

### హోమియో మండలికి గడువు పెంపు

హోమియోపతి కేంద్ర మండలి పునర్నిర్మాణానికి ప్రస్తుతం ఉన్న ఏడాది గడువును రెండేళ్లకు పెంచుతూ ప్రతిపాదించిన బిల్లును లోక్‌సభ గురువారం ఆమోదించింది. ఫలితంగా మండలి బోర్డు గవర్నర్ల పదవీకాలాన్ని మే 17, 2019 నుంచి మరో ఏడాదికి పెంచడానికి కేంద్ర ప్రభుత్వానికి వీలు కలుగుతుంది.

## మేం నిర్దోషులం.. మోసగాళ్లం కాదు!

### బ్రిటన్ హోంమంత్రికి విదేశీ విద్యార్థుల స్పష్టీకరణ

లండన్: ఆంగ్లభాషా ప్రావీణ్య పరీక్షల్లో మోసానికి పాల్పడ్డామని తమపై తప్పుడు అభియోగాలు మోపారని వాపోతూ బ్రిటన్ హోం మంత్రి సాజిద్ జావిద్‌కు భారతీయులు సహా పలువురు విదేశీయులు మొరపెట్టుకున్నారు. తమకు న్యాయం చేయాలని విన్నవించుకున్నారు. అన్యాయంగా తమపై మోసగాళ్లమనే ముద్ర వేశారని, ఆ ముద్రను చెరిపివేసుకోవడానికి ఐదేళ్లుగా శ్రమ పడుతున్నామని జావిద్‌కు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

బ్రిటన్‌లో విద్యాభ్యాసానికి తప్పనిసరిగా టెస్ట్ ఆఫ్ ఇంగ్లిష్ ఫర్ ఇంటర్నేషనల్ కమ్యూనికేషన్ (టీఓఈఐసీ) పరీక్ష ఉత్తీర్ణులు కావాలి. ఎడ్యుకేషనల్ టెస్టింగ్ సర్వీస్ తరఫున నిర్వహించే రెండు ఇంగ్లీషు భాషా కేంద్రాల్లో మోసాలు జరిగాయని ఒక వార్తాసంస్థ బయటపెట్టింది. దీంతో అప్పటి నుంచి మార్చి 2019 వరకు ఈ మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న 11 వేలమందిని బ్రిటన్ నుంచి పంపించేశారు. అయితే కొందరు నిర్దోషులను సైతం అన్యాయంగా బ్రిటన్ నుంచి పంపించివేశారని ఆ దేశ వ్యయ నియంత్రణసంస్థ ఇటీవల వెల్లడించింది.

### బ్రిటన్‌కు భారీగా తగ్గిన భారతీయ విద్యార్థులు

దిల్లీ: బ్రిటన్ విశ్వవిద్యాలయాల్లో విద్యాభ్యాసం చేయడానికి భారతదేశం నుంచి వెళ్లే విద్యార్థుల సంఖ్య 2010 నుంచి గణనీయంగా తగ్గింది. విద్యాభ్యాసం తరువాత వర్క్‌వీసా ఇవ్వకపోవడం, ఆంగ్ల భాషా ప్రావీణ్యం కనీస అర్హతలు కఠినతరం చేయడం, ఇతర దేశాల్లో ఉన్నత విద్యాభ్యాసానికి అవుతున్న వ్యయంతో పోలిస్తే ఎక్కువ కావడమే ఇందుకు ప్రధాన కారణాలని విదేశీ వ్యవహారాల సహాయమంత్రి వి.మురళీధరన్ రాజ్యసభలో తెలిపారు. 2009-10లో 40,470మంది బ్రిటన్‌కు వెళ్లగా 2016-17లో 16,559కు తగ్గారు.

## నీరవ్ మోదీ స్విస్ ఖాతాల స్తంభన

లండన్, దిల్లీ: పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) కుంభకోణం కేసులో పరారీలో ఉన్న వజ్రాల వ్యాపారినీరవ్ మోదీ, ఆయన సోదరి పూర్వీ మోదీకి చెందిన నాలుగు ఖాతాలను భారత అధికారులు ఇచ్చిన సమాచారంతో స్విట్జర్లాండ్ అధికారులు స్తంభింపచేశారు. వాటిలో ప్రస్తుతం రూ.283.16 కోట్లు ఉన్నాయి. మరోవైపు నీరవ్ మోదీ జ్యుడిషియల్ రిమాండ్‌ను వచ్చే నెల 25 వరకూ బ్రిటన్ కోర్టు పొడిగించింది.

## లుధియానా కేంద్ర కారాగారంలో ఖైదీల ఘర్షణ

లుధియానా: పంజాబ్‌లోని లుధియానా కేంద్ర కారాగారంలో రెండు గ్యాంగ్‌స్టర్ గ్రూపుల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. అల్లర్లను అదుపు చేయబోయిన ఏసీపీ సహా 35 మంది గాయపడ్డారు. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. మాదకద్రవ్యాల కేసులో విచారణ ఖైదీగా ఉన్న సన్నీ సూద్ బుధవారం అస్వస్థతకు గురయ్యాడని, పటియాలా ఆసుపత్రిలో గురువారం చనిపోయాడని డీసీపీ అశ్వనికపూర్ తెలిపారు. పోలీసులే అతన్ని హత్య చేశారని ఆరోపిస్తూ, తోటి ఖైదీలను సన్నీకి చెందిన గ్యాంగ్‌స్టర్లు రెచ్చగొట్టారు. ఇది చివరకు జైల్లోని రెండు గ్యాంగ్‌స్టర్ గ్రూపుల మధ్య ఘర్షణకు దారి తీసింది. రాళ్లు, ఇటుకలు రువ్వుకున్నారు. ఎల్పీజీ సిలిండర్ సాయంతో జైలు సూపరింటెండెంట్ అధికారిక వాహనానికి, జైలు వంటశాలకు నిప్పు పెట్టారు. ఈ ఘర్షణలో ఏసీపీ గాయపడ్డారు. పరిస్థితిని అదుపు చేయడానికి పోలీసులు కాల్పులు జరపాల్సి వచ్చింది. ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు.



## మన్మోహన్‌తో నిర్మలాసీతారామన్ భేటీ

దిల్లీ: కేంద్ర ప్రభుత్వం వచ్చే నెల 5న లోక్‌సభలో బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్న నేపథ్యంలో... ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గురువారమిక్కడ మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌తో ఆయన నివాసంలో భేటీ అయ్యారు. అయితే వారిద్దరి మధ్య ఏయే అంశాలు ప్రస్తావనకు వచ్చాయన్నది తెలియరాలేదు. మన్మోహన్ 1991-1996 మధ్య పీవీ నరసింహారావు ప్రభుత్వంలో ఆర్థిక మంత్రిగా పనిచేశారు. దేశ ఆర్థిక ముఖచిత్రాన్ని మార్చే పలు సంస్కరణలు ప్రవేశపెట్టారు.

## మన్మోహన్ సింగ్ సిబ్బంది సంఖ్య 5కు తగ్గింపు

### 14 మందినే కొనసాగించాలంటూ లేఖ

ఈనాడు, దిల్లీ: మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ సిబ్బంది సంఖ్యను ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) 14 నుంచి 5కు కుదించిన నేపథ్యంలో.. ఎప్పటిలా పూర్తి సిబ్బందినే ఉంచాలంటూ ఆయన పీఎంవోకు లేఖ రాశారు. మోదీ ప్రభుత్వం రెండోసారి ప్రమాణస్వీకారం చేయడానికి 4 రోజుల ముందు మన్మోహన్ సిబ్బందిని కుదిస్తూ పీఎంవో నిర్ణయం తీసుకుంది. పూర్తిస్థాయి సిబ్బందిని ఉంచాలంటూ మన్మోహన్ అప్పట్లో కోరగా ప్రధాని మోదీ తిరస్కరించినట్లు పీఎంవో ఆయనకు సమాచారం అందించింది. ఈ నేపథ్యంలో తాజాగా ఆయన లేఖ రాశారు. వాజ్‌పేయికి యూపీఏ హయాంలో ఐదేళ్ల తర్వాత కూడా ఆయన అవసరాల మేరకు 12 మందిని కొనసాగించిన విషయాన్ని మన్మోహన్ సింగ్ లేఖలో ప్రస్తావించినట్లు ఉన్నత వర్గాల సమాచారం.

### రాజస్థాన్ నుంచి రాజ్యసభకు..!

మాజీ ప్రధాని మన్మోహన్‌ను రాజస్థాన్ నుంచి రాజ్యసభకు పంపించాలని కాంగ్రెస్ పార్టీ యోచిస్తోంది. తమిళనాడు నుంచి ఆయనను ఎగువసభకు ఎన్నుకోవడానికి డీఎంకే అంత సుముఖంగా లేని నేపథ్యంలో పార్టీ రాజస్థాన్‌ను పరిశీలిస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

# అమెరికాపై భారత్ ఘనవిజయం

- అగ్రరాజ్యంలో రాయితీలు అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధం
- మనకు అనుకూలంగా డబ్ల్యూటీఓ తీర్పు



దిల్లీ: అంతర్జాతీయ వేదికపై భారత్‌కు ఘన విజయం లభించింది. అగ్రరాజ్యం అమెరికాపైనే అంతర్జాతీయ వాణిజ్యం వివాదంలో భారత్ వాదన నెగ్గింది. అమెరికాపై దాఖలుచేసిన కేసులో భారతదేశానికి అనుకూలంగా ప్రపంచ ఆర్థిక సంస్థ (డబ్ల్యూటీఓ) వివాద పరిష్కారాల కమిటీ తీర్పునిచ్చింది. పునరుద్ధరణీయ ఇంధన వనరుల రంగంలో అమెరికాలోని ఎనిమిది రాష్ట్రాలు ఇస్తున్న రాయితీలు అంతర్జాతీయ వాణిజ్య నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయని స్పష్టం చేసింది. అమెరికా చేపట్టిన చర్యలు 'సుంకాలు, వాణిజ్యంపై సాధారణ ఒప్పందం' (గాట్), డబ్ల్యూటీఓ నిబంధనలలోని కొన్ని అంశాలకు అనుగుణంగా లేవని తేల్చింది. భారతదేశానికి రావాల్సిన ప్రయోజనాలను అమెరికా రద్దుచేసిందని స్పష్టం చేసింది. అమెరికాలోని 8 రాష్ట్రాలు ఇస్తున్న సబ్సిడీలపై భారతదేశం 2016 సెప్టెంబరులో డబ్ల్యూటీఓను ఆశ్రయించింది. కస్టమ్స్ సుంకాల లాంటి వాణిజ్య అడ్డంకులను తొలగించడం ద్వారా అంతర్జాతీయ వాణిజ్యాన్ని సులభతరం చేయాలన్నది గాట్ లక్ష్యం. కానీ, పునరుద్ధరణీయ ఇంధన వనరుల రంగంలో అమెరికా అమలుచేస్తున్న పది రకాల చర్యలు 1994 నాటి గాట్ నిబంధనలకు అనుగుణంగా లేవని డబ్ల్యూటీఓ తేల్చిచెప్పింది. వాషింగ్టన్, కాలిఫోర్నియా సహా మొత్తం 8 రాష్ట్రాలు ఈ రంగంలో సబ్సిడీలు ఇస్తున్నాయి. దానివల్ల అక్కడి ఉత్పత్తుల కంటే భారత్ లాంటి విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న ఉత్పత్తుల ఖరీదు ఎక్కువ అవుతుందని భారత్ వాదించింది. డబ్ల్యూటీఓ తాజాగా ఇచ్చిన తీర్పును అప్పిలేట్‌లో సవాలు చేయడానికి అవకాశం ఉంది. ఇప్పటికే ఇరు దేశాల మధ్య వాణిజ్యానికి సంబంధించి వివాదాలు నడుస్తున్నాయి. హార్లీ డేవిడ్‌సన్ బైకులపై భారత్ ఎక్కువ పన్ను విధిస్తోందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మండిపడుతున్నారు. దాంతోపాటు మొత్తం 28 రకాల అమెరికన్ ఉత్పత్తులపై భారత్ అధిక కస్టమ్స్ సుంకాలు విధిస్తోందని వాదించి.. ఎగుమతి ప్రోత్సాహకాలను ఉపసంహరించుకుంది.

### పన్నులు ఉపసంహరించాల్సిందే: ట్రంప్

వాషింగ్టన్, ఒసాకా: అమెరికన్ ఉత్పత్తులపై భారత్ విధిస్తున్న అత్యధిక పన్నులు తమకు ఆమోదయోగ్యం కావని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి చెప్పారు. జపాన్‌లో శుక్రవారం జరగనున్న జీ20 సదస్సులో మోదీతో భేటీ కానున్న తరుణంలో ఆయనీ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. భారత్ ఇటీవలే పన్నులను మరోసారి పెంచిందని, వీటిని ఉపసంహరించాలని ట్రంప్ ట్వీట్ చేశారు.

## వాతావరణ మార్పులపై అంతర్జాతీయ ఒత్తిడికి తలొగ్గం

### కేంద్ర మంత్రి జావడేకర్

దిల్లీ: వాతావరణ మార్పులకు ప్రధాన కారణం అభివృద్ధి చెందిన దేశాలేనని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జావడేకర్ విమర్శించారు. స్వీయ ప్రయోజనాల పరిరక్షణలో తాము అంతర్జాతీయ ఒత్తిడికి ఏ మాత్రం తలొగ్గబోమని స్పష్టంచేశారు. హామీ ఇచ్చిన మేరకు వర్ధమాన దేశాలకు వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కోవడం కోసం 100 బిలియన్ డాలర్లు, సాంకేతిక పరిజ్ఞాన బదిలీని అభివృద్ధి చెందిన దేశాలు చేయడంలేదని ఆరోపించారు. వాతావరణ మార్పులు, వాటిని ఎదుర్కోవడానికి ప్రభుత్వం చేపట్టిన చర్యలపై 'సావధాన తీర్మానం' కింద గురువారం రాజ్యసభలో ఇచ్చిన నోటీసుకు జావడేకర్ సమాధానమిచ్చారు. "నేడు వాతావరణ మార్పులకు అగ్రరాజ్యాలే కారణమన్నది నిజం. 70 శాతానికిపైగా గ్రీన్‌హౌస్ ఉద్గారాలు ఆ దేశాల వల్లే వెలువడ్డాయి. భారత్ వాటా 3 శాతమే. అగ్రరాజ్యాల్లోని ప్రజలు మితిమీరి వినియోగం చేస్తున్నారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ప్రతి వెయ్యి మందికి 800 కార్లు ఉన్నాయి. భారత్‌లో 25 మాత్రమే ఉన్నాయి. భారత తలసరి విద్యుత్ వినియోగం వెయ్యి యూనిట్లు ఉండగా, అభివృద్ధి చెందిన దేశాల్లో అది 10వేల నుంచి 12 వేల యూనిట్ల వరకూ ఉంది. వాతావరణ మార్పుల అంశాలపై మేం అగ్రరాజ్యాల ఒత్తిడికి తలొగ్గబోం" అని పేర్కొన్నారు. పారిస్ వాతావరణ సదస్సును తామే ముందుండి నడిపించి, కీలకమైన ఒప్పందాన్ని ఖరారు చేశామన్నారు. ఆ ఒప్పందం మేరకు భారత్ తన స్థూల జాతీయోత్పత్తిలో ఉద్గారాల తీవ్రతను 2030 నాటికి 33-35 శాతం మేర తగ్గించుకుంటామని హామీ ఇచ్చింది. ఇప్పటివరకూ దేశంలోని 33 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు తమ వాతావరణ కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేశాయని జావడేకర్ తెలిపారు.

# ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు

## లండన్‌లో దించి తనిఖీలు ● అది ఉత్తుత్తి బెదిరింపేనని నిర్ధారణ

లండన్/ ముంబయి: అమెరికాకు వెళుతున్న ఎయిర్ ఇండియా విమానానికి బాంబు బెదిరింపు రావడంతో లండన్‌లోని స్టాన్‌స్టెడ్ విమానాశ్రయంలో అత్యవసరంగా దించారు. ఇందుకోసం బ్రిటన్ వైమానిక దళం తన టైఫూన్ యుద్ధవిమానాలను పంపింది. ఆ జెట్లు తోడురాగా విమానం క్షేమంగా ల్యాండ్ అయ్యింది. తనిఖీల అనంతరం అది ఉత్తుత్తి బెదిరింపేనని తేలింది.

ఏఐ 191 సర్వీసు నెంబరు కలిగిన ఈ విమానం ముంబయి నుంచి అమెరికాలోని నువర్క్ వెళుతోంది. ముంబయి విమానాశ్రయ అధికారులకు ఒక బెదిరింపు ఈమెయిల్ రావడంతో ఆ విమానాన్ని లండన్‌కు మళ్లించారు. సెర్గీ సెలిజ్‌నెవ్, నటాలియా ర్యుమ్రినాల పేరిట ఈ మెయిల్ వచ్చింది. ఎయిర్ ఇండియా విమానంతో పాటు లుఫ్తాన్సా సంస్థకు చెందిన ముంబయి-మ్యూనిక్, స్విస్ ఎయిర్‌కు చెందిన ముంబయి-జ్యూరిక్ విమానాలు గాల్లోనే పేలిపోతాయని వారు అందులో హెచ్చరించారు. తాము కాకసస్ ఎమిరేట్ సభ్యులమని, ప్రపంచవ్యాప్త షరియా కోసం తాము పోరాడుతున్నామని వారు చెప్పారు. ఇజ్రాయెల్‌ను తాము గుర్తించడంలేదన్నారు. పాలస్తీనా ఆక్రమణదారుగా ఆ దేశాన్ని పరిగణిస్తున్నామని చెప్పారు. ఇజ్రాయెల్ నాశనం కోసం తాము ప్రాణత్యాగానికైనా సిద్ధమన్నారు. సర్వీసు టెక్నీషియన్ల సాయంతో తాము జెట్ ఇంధనంలో పాలీసైలోక్సేన్ ద్రావకాన్ని కలిపామన్నారు. ఎయిర్ ఇండియా విమానాన్ని పేల్చడానికి నైట్రోజన్ రహిత బాంబును బ్యాగేజీలో పెట్టామన్నారు. హెచ్చరిక సమాచారం అందేటప్పటికి మిగతా రెండు విమానాలు ల్యాండయ్యాయి.

స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 9.50 గంటలకు ఎయిర్ ఇండియా విమానం లండన్ విమానాశ్రయంలో దిగాక అందులోని 327 మంది ప్రయాణికులను దించేసి తనిఖీలు చేపట్టారు. అనంతరం బోయింగ్ 777-300ఈఆర్ శ్రేణికి చెందిన ఈ విమానాన్ని తన గమ్యస్థానానికి వెళ్లేందుకు సిద్ధం చేశారు. బాంబు బెదిరింపు రావడంతో ముందుజాగ్రత్త చర్యగా లండన్‌లోని స్టాన్‌స్టెడ్ విమానాశ్రయంలో విమానాన్ని దించినట్లు ఎయిర్ ఇండియా పేర్కొంది. బ్రిటన్ రక్షణ శాఖ మాత్రం 'ఆపరేషనల్ కారణాల' వల్ల ఈ చర్యను చేపట్టినట్లు తెలిపింది. సూపర్‌సోనిక్ వేగంతో దూసుకెళ్లి ఎయిర్ ఇండియా విమానాన్ని అడ్డుకోవాలని, దాన్ని విమానాశ్రయానికి తీసుకురావాలని టైఫూన్ పైలట్లకు ఆదేశాలిచ్చినట్లు వైమానిక దళం తెలిపింది. ఆ వేగంతో దూసుకెళ్లడం వల్ల నేల మీదున్నవారు తీవ్ర శబ్దాన్ని ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇందుకు క్షమాపణ చెబుతున్నట్లు వైమానిక దళం తెలిపింది. బాంబు బెదిరింపు ఘటనతో స్టాన్‌స్టెడ్‌లోని అన్ని విమానాలను తాత్కాలికంగా నిలిపివేశారు.



## కలవరపెడుతున్న కార్చిచ్చు!

స్పెయిన్‌లో భీకర కార్చిచ్చు చెలరేగింది. కాటలోనియాలోని టోరె డెల్ ఎస్పనాల్ ప్రాంతంలో బుధవారం మధ్యాహ్నం ప్రారంభమైన ఈ భారీ మంటలు ఇప్పటికే దాదాపు 5,500 హెక్టార్ల అడవిని దహించివేశాయి. గురువారం రాత్రి వరకూ మంటలు అదుపులోకి రాలేదు. 350 మంది అగ్నిమాపక సిబ్బంది, 120 మంది సైనికులు కార్చిచ్చును అదుపు చేసేందుకు తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. అందుకోసం 15 హెలికాప్టర్లను కూడా ఉపయోగిస్తున్నారు. దాదాపు 20 వేల హెక్టార్ల అడవిని ఈ కార్చిచ్చు దహించివేసే ముప్పుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

Editor: Ramoji Rao, Printed and Published by him on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Private Limited, and printed at Eenadu Press, Alugunoor, Karimnagar - 505 527, Telangana. Cell: 99590 21802, 99590 21803 RNI No. 52793/92, Regd. No. G/RN/KAR/48/2018-20 Eenadu, Karimnagar. Air surcharge extra. Mumbai, Kolkata, Goa. Re.1-00, Portblair Rs.10.00
Eenadu epaper